ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రిక



4 అణాలు


13-5-53

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



★

"సూర్యప్రియు"
ఫోటో— శ్రీ తుమ్మలపల్లి
సత్యనారాయణమూర్తి (పిప్పర.)



★

"చంద్రప్రియు"
ఫోటో— శ్రీ హరి సత్యం.
(ఖమ్మంమెట్టు)

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.


ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 45
సంచిక 37
13-5-53

విజయ వైశాఖ బహుళ అమావాస్య; బుధవారం



"పరీక్షల చదువు"

ఫొటో శ్రీమతి పి. పార్వతమ్మ (విజయవాడ)

విషయానుక్రమణిక

ముఖచిత్రం :— సినీతార
శ్రీమతి జానకి.

కాలక్షేపం

"స్వవశము హితంబు మూఢతాచ్ఛాదనంబు
గాగ నీగతి నిర్మించె గమలభవుడు
సర్వవిదులగు సుజనుల సభలలోన
మౌనమె విభూషణము మూఢమానవులకు."

తా|| సమస్తము తెలిసినటువంటి సుజనులయొక్క సభలలో, మూఢమానవులైన వారు మౌనముగా ఉండడమే వారికి శోభాలంకారముగా ఉంటుంది.' ఈ విధముగా మౌనము వహించుట యనునది మూఢత్వమును కప్పిపుచ్చుటకు తగిన ముసుగువంటిది. ఇది తమ వశంలో ఉన్నటువంటి పని- ఇది వారికి శ్రేయస్కరమైనది. వారి మేలుకొరకై అటువంటి మౌనాలంకారమును బ్రహ్మ సృష్టిచేసినాడు.

మూఢమానవులు అనబడేవాళ్ళు ఒక ప్రత్యేక జాతిగా ఎక్కడా లేరు. పండితులు అనబడేవాళ్ళలోనే చాలామంది మూర్ఖులు ఉన్నట్లుగా చిరకాలంనుంచీ యుగయుగాలనుంచీ ఋజువు అవుతూ ఉంది. రావణాసురుడు మహా మూర్ఖాగ్రేసరుడు. సీతామహాదేవిని చెరబట్టి నిర్బంధించడంవల్ల లంకాపురికే చేటు తెచ్చిపెట్టడము గునని ఎవరెన్నివిధాలుగా చెప్పినప్పటికీ, చెవినిపెట్టలేదు. ఆంజనేయులవారు వెళ్లి అనేక విధాలుగా రావణాసురునకు హితబోధ చేశారు.

"రాముని భార్యను అపహరించి తీసికొని రావడం ఒక పెద్ద అపరాధం అయినప్పటికీ, ఆ యిల్లాలును యిప్పుడైనను చెరనుండి విడిపించి, రామునివద్దకు పోనిచ్చినట్లయితే, నీమీదకు శ్రీరాముడు దండెత్తిరాడు" అని ఆంజనేయులవారు సౌమ్యంగా చెప్పారు. రావణుడు సీతను చెరనుండి విడిపించి పంపివేసినప్పటికిన్నీ రావణుడు చేసిన మహాపరాధమునకై రావణుని దండించకుండా విడిచిపెట్టడం భావ్యంకాదు. ఎత్తుకొనిపోయిన సొత్తును దొంగవాడు తిరిగి యిచ్చివేసినంత మాత్రముచేత దొంగవానిని శిక్షించకుండా విడిచిపెట్టవలెనా? విడిచిపెట్టవచ్చునా? అనే విషయం ఒక ధర్మసమస్యగానే ఉంది. కొన్ని సందర్భములలో క్షమించి విడిచిపెట్టడమే ప్రశస్తమైన ప్రభుత్వ ధర్మంగా పరిగణింపబడుతూ ఉంటుంది. గడచిన యుద్ధకాలంలో చాలామంది పెద్ద వ్యాపారస్థులు లక్షాధికార్లు బ్లాకుమార్కెటు వ్యాపారాలు చేసి అపారంగా ద్రవ్యం ఆర్జించారు. ఆర్జించిన ద్రవ్యం తమ చిఠా ఆవర్జా లెక్కలలో ఎక్కడా కన్పించకుండా చేసి, సదరు రహస్యాదాయములమీద ఆదాయపు పన్నులను కూడా చెల్లించకుండా తప్పించుకున్నారు. కాని యీవిధంగా సర్కారుకు సరియైన లెక్కలను చూపించకుండా దొంగలెక్కలను చూపించడం ఒక పెద్ద నేరము. అట్టి ఆదాయములమీద ఆదాయపు పన్నును చెల్లించకపోవడం మరొక మహానేరము. అయినప్పటికిన్నీ, సర్కారువారికి సరియైన లెక్కలను సకాలంలో చూపించకపోయినప్పటికిన్నీ క్షమిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కొన్ని ఏండ్లును బూండ్లును గడచిపోయినప్పటికిన్నీ, చెల్లించక తప్పిన ఆదాయపు పన్నును వర్తక శిఖామణులు వారియ్యంతటవారు వచ్చి వసూలు యిచ్చినట్లయితే ఆ పైకమును తీసికొని వారిని దండించకుండా దయజూచి విడిచిపెట్టగలమని కూడా ప్రకటించారు. అది ప్రభుత్వమువారి మర్యాద. వర్తకులు కూడా తమ వర్తనమును మార్చుకొని, ఒకరి తర్వాత యింకొకరు అపహృతాదాయ లక్ష్మిని అవమానభయం లేకుండా అపరాధ ప్రతీకార భయం లేకుండా సర్కారు సన్నిధిని హాజరుపరచి, "పాపోహం, పాపకర్మాహం" అనకుండానే చెల్లించవలసిన పైసా చెల్లించారు. ప్రభుత్వంకూడా

"మహా ప్రసాదం" అని స్వీకరించింది. కాబట్టి పరిపాలనా వ్యవహారములకు సంబంధించిన రాజనీతిలో ఉదారభావమును ప్రభుత్వము చూపించవలసి ఉంటుంది. అటువంటి ఉదారభావమును ప్రభువులైన వారు చూపించకపోవడమే మూర్ఖత్వంగా ఉంటుంది సాధారణమైన న్యాయవిచారణ సభలలో కూడా, యిటువంటి ఔదార్యమును అనేక సందర్భములలో ప్రాసిక్యూషను తరఫున అధికారులే చూపించడం కలదు. ఏదైనా ఒక పెద్ద కుట్రకేసు విషయములో గాని, రాజద్రోహ నేరము విషయములోగాని, పెద్దపెద్ద ఖూనీ వ్యవహారములలోగాని నేర సంబంధమైన విషయములను అన్నింటినీ బయటపెట్టి కేసును పట్టి యిచ్చినటువంటివాడు ఆ నేరస్థులలో ఒకడైనప్పటికీ, సత్యవాదియై సాక్ష్యమిచ్చినందుకుగాను అటువంటివానిని (నేరస్థుడైనప్పటికీ) సత్యవాది యగుటవల్ల శిక్షించక క్షమించి విడిచివేయుట కలదు.

రావణాసురుడు అంటే కేవలం మూర్ఖుడు. ఎంతమంది ఎన్ని హితబోధలు చేసినప్పటికీ అతని చెవి కెక్కదు. తలకెక్కదు. కాబట్టి ఏ మూర్ఖత్వం కూడదని యితరుల విషయములో మనము ఖండిస్తున్నామో, ఆ మూర్ఖత్వమే మన విషయములో కూడా కూనిదై కీడు మూడ జేయునని పాడిదప్పని ప్రభువు దేశకాలపాత్ర పరిస్థితులనుబట్టి గ్రహించి తన మనస్సు నిగ్రహించి ఔదార్యమును చూపించగలడు. రావణుడు మూర్ఖుడైతే రాముడుకూడా మూర్ఖుడు కాడు. సీతను విడిచి పెట్టినయెడల, సీతను వెంటదీసికొని, రాముడు సరాసరి అయోధ్యకు వెళ్ళియుండేవాడా? రావణుడు తనంతట తాను సీతను విడిచిపెట్టినప్పటికీ, రావణుడు మొట్టమొదట భూపుత్రిని అపహరించినందుకై ఆ రావణుని శిక్షించే నిమిత్తమై శ్రీరాముడు పూనుకొనియుండెడి వాడా? రావణుడు తాను చేసినది తప్పు అని గ్రహించడమే శ్రీరామునివంటిమహాపురుషునకు కావలసినది. రావణుడు అంటే అల్పుడు కాడు. గొప్పశివపూజాధురంధరుడు. "రావణాబ్రహ్మ" అనే జగత్ప్రఖ్యాతి పొందినవాడు. సీతా అమ్మవారి స్వయంవరానికి వచ్చినటువంటి, (బహుశః ఆహ్వానింపబడినటువంటి) ఆ కాలపు గొప్పప్రభువులలో ఒకడు. ప్రతిభా సామర్థ్యములందు అఖండుడు. అటువంటి వాడు బుద్ధిపూర్వకముగా "నాదే అపరాధము - నేను చేసినది అధర్మము" అని అంగీకరించినయెడలనే సీతను తనంతట తాను తిరిగి శ్రీరామునకు ఒప్పగించడం జరుగుతుంది. శ్రీరాముడు. తనమీదకుదండెత్తి వచ్చి శిక్షిస్తాడేమో అనే భయంచేత మాత్రము అటువంటి పనిని రావణుడు చేయడు. కాబట్టి ధర్మమేదో, అధర్మమేదో, రావణుడు గ్రహించినట్లయితే, అంతేచాలును. అదే శ్రీరామచంద్రుని అభీష్టం - పితృవాక్యపరిపాలనకొరకై, తండ్రియొక్క సత్యమును నిలువబెట్టుటకొరకై, అఖండ సామ్రాజ్యమును విడిచిపెట్టి అరణ్యములకు వచ్చినటువంటి ధర్మమూర్తి రావణునియందు హృదయ పరివర్తనం కలిగితే, అంతమాత్రమునకే ఆనందిస్తాడు. మీదు మిక్కిలి రావణుని మనస్సు మారినందుకు తన మనస్సుకూడా మార్చుకొని, తన దండయాత్రా సంకల్పమును విరమించుకొనేవాడు. అంతేగాని, తాను మాత్రము తన మనస్సును మార్చుకొనకుండా, మూర్ఖంగా మొండి పట్టుదలతో దండయాత్రాసంకల్పమును కొనసాగించేవాడు కాడు.

జలియన్వాలాబాగులో బహిరంగసభలో సమావేశమైయున్న జనంమీద తుపాకులు బ్రిటిష్ సోల్జరు కాల్చారు. డైయరు సేనాని తనవద్ద తుపాకీ గుండ్లు యింకా ఉన్నట్లయితే ఇంకా కాల్పించేవాడు. స్త్రీలను అవమానపరిచాడు. విద్యార్థులైన ఘరానా మనుష్యులను క్రూరహింసలపాలు జేశాడు. పొట్టలమీద ప్రాకించాడు. ఈ పంజాబు వధలను తలుచుకుంటే గాంధిమహాత్ముని కడుపు తరుగుకొనిపోయింది. ఈ క్రూర కార్యములను చేసిన, చేయించిన డయ్యరు సేనానికి బ్రిటిష్‌వారు కితాబు లిచ్చారు. ఈ పంజాబు వధలు జరిగినందుకు బ్రిటిష్ వారు తమ పశ్చాత్తాపమును తెలియజేస్తే చాలునని గాంధిమహాత్ముడు అన్నాడు. "బ్రిటిష్‌వారిలో హృదయపరివర్తనం కలిగితే చాలు. అదే నాకు కావలసింది" అని మహాత్ముడన్నాడు. బ్రిటిష్‌వారిని నిర్మూలించడం నా సంకల్పం గాని, నా కోరిక గాని కాదన్నాడు. వారు అనుసరిస్తున్న ప్రభుత్వ ధర్మం అధర్మం అని వారు గ్రహిస్తే చాలునన్నాడు. ధర్మమార్గమును వారు అనుసరించడమే నా కోరికయని ప్రకటించాడు.

ఈవిధంగా మహాపురుషులు అవతరించి మూర్ఖజన చిత్తమును మార్చుటకై అనేక మహాప్రయత్నాలు యుగయుగములనుంచీ చేస్తూనే ఉన్నారు. "మూర్ఖజన చిత్తము దెల్ప నసాధ్య మేరికిన్" అనే మాట మనం లోకపరిపాటిగా అంటాము. కాని, మహాపురుషులు ఆ మాట అంగీకరించరు.

"మూర్ఖస్య నాస్త్యౌషధమ్" అని వాదించడంవల్ల మూర్ఖులయొక్క మూర్ఖత్వమును చాలా అభేద్యమైన, అచంచలమైన, అజేయమైన (జయింప వీలులేని) గొప్ప తత్వంగా ప్రశంసించినట్లవుతుంది. "మూర్ఖత్వమును పోగొట్టుటకు మందులేదు" అనే మాట మనం తరుచు ఆలాపన చేయడం కేవలం మన అసమర్థతను అప్రయోజకత్వమును వెల్లడి చేసికొనడమే అవుతుంది. "మూర్ఖజన చిత్తము దెల్ప నసాధ్య మేరికిన్" అనే పల్లవికూడా అటువంటిదే. ప్రతి జాడ్యమునకూ ఔషధము ఒకటి ఉండక తప్పదు. ఈనాడు కొన్ని మొండివ్యాధులకు మనము ఔషధమును కనిపెట్టియుండక పోయినప్పటికీ, ఉత్తరోత్తర యింకొకనాటికైనా మందును కనిపెట్టవచ్చు. ఒకప్పుడు ప్లేగు జ్వరానికి (బొబ్బల జాడ్యానికి) మందులేదని ప్రజలు నిస్పృహ జెందియుండేవారు. అటువంటి వ్యాధి ఈనాడు యింగ్లండులో నామరూపాలు లేకుండా పోయింది.

వ్యాధి అనేది ఏదైనా కుదర్చడానికి మనము అశక్తులము కావచ్చును. కాని, వ్యాధి అనేది నిత్యమై శాశ్వతంగా స్థిరంగా అంతంలేకుండా అనంతముగా ఉండడానికి వీలులేదు. శాశ్వతంగా నిర్వికారంగా ఏ మార్పు లేకుండా ఉండేది ఎవరు? భగవంతుడొక్కడే - జాడ్యం అనేది కూడా శాశ్వతంగా చలనంలేకుండా మార్పులేకుండా యీ జగత్తులో ఉండగలదని మనము వాదించినట్లయితే, అటువంటి జాడ్యం కూడా యీశ్వరునితో సమానమైనది కాగలదు. కనీసం, ఆచంద్రతారార్కమనే విఖ్యాతినైనా అది పొందగలదు. కాని, మూర్ఖత్వమనేది, అచంచల తత్వమే అయినట్లయితే, అటువంటి శాశ్వత తత్వం నిజంగా బ్రహ్మపదార్థంవంటిదే. కనుక మూర్ఖత్వం బ్రహ్మత్వం ఒకటే అవుతాయి. అటువంటి బ్రహ్మత్వమునే మన మందరమూ పొందగల్గుటకు ప్రయత్నించవలసి వస్తుంది.

"బ్రహ్మకర్మ సమారంభే" అని అనుదినమున్నూ సూర్యునకు నమస్కరించి సంధ్యాకాలమందు వందనమాచరిస్తూ నియమ నిష్ఠలతో కర్మపరతంత్రులై ఉండేటటువంటి పూర్వాచార పరాయణులే అనేక సందర్భములలో నూతన సంఘ సంస్కారములకు ఎదురుతిరిగి అతి మూర్ఖంగా అధిక్షేపించారు.

అన్ని కులాలవారికీ భక్తిమార్గం బోధించి ముక్తిమార్గం ఒక్కటే అని చూపించి, "ఓం నమో నారాయణాయ" అనే అష్టాక్షరీ తిరుమంత్రమును గాలిగోపురం మీదనుంచి ఆలిండియా రేడియో ద్వారా బ్రాడ్‌కాస్టు చేసినట్లుగా వెల్లడించినటువంటి శ్రీరామానుజాచార్యులవారిని చంపడానికి ప్రయత్నించారు. ఎవరు? పూర్వాచార కర్మపరాయణులైన సనాతన శర్మలు. వీరేశలింగం పంతులుగారు విధవా వివాహం

★ కాలక్షేపం ★

చేయవచ్చునని వాదిస్తే వీరేశలింగంమీద శివలింగములవంటి రాళ్ళు విసరిన వీరులు పూర్వాచార నిష్ఠాగరిష్ఠులు. రాజారామ మోహనరాయలు సహగమనం చేయకూడదని వాదిస్తే ఆయనతో సహగమనం చేయుము అని వాదించినది ఆనాటి బ్రహ్మశ్రీ వేదమూర్తులే. గాంధిమహాత్ముడు "అస్పృశ్యతా నిర్మూలనము" అత్యంతావశ్యకమని అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లుగా అహోరాత్రాలు వాదిస్తే ఆలయములలోనికి అస్పృశ్యులను రానీయరాదని అడ్డుపెట్టిన దెవరు? బ్రహ్మత్వం పొందవలెనని తల్లక్రిందులుగా తపస్సు చేసెడివారెవరు? అటువంటివారి మనస్సును త్రిప్పవలెనంటే, మా తరమా? అని మహాత్ముడు గాని యితర సంస్కర్తలుగాని తాముపూనిన ప్రయత్నమును ఎన్నడూ విరమించలేదు. "...తెలిసియు దెలియని నరుదెల్ప బ్రహ్మ-దేవుని వశమే?" అని మహాత్ము డెప్పుడూ నిస్పృహ చెందలేదు. చిట్టచివరకు "బ్రహ్మదేవుని వశమే?" అని తిరస్కరింపబడిన సనాతన బ్రాహ్మణబృందమే ఈ సంస్కర్తలకు బ్రహ్మరథంపట్టి, ఒక మెట్టు పైకెక్కి తాము తరించి యితరులను తరింపజేశారు.

కాబట్టి సనాతనిష్ఠుల దృష్టిలో ఎన్ని నిష్ఠూరము లాడినప్పటికీ, ఉన్నమాట ఉన్నదున్నట్లుగా అంగీకరించగల ఆత్మపరిజ్ఞానమే బ్రహ్మజ్ఞానికిగాని, బ్రహ్మకర్మపరతంత్రునకుగాని పరమోత్కృష్టమైన ప్రశస్త లక్షణం.

"బుద్ధిజాడ్యజనితో న్మాదుల్గదా శ్రోత్రియుల్" అని అల్లసాని పెద్దన్నగారి మనుచరిత్ర ప్రబంధంలోని ప్రవరుడు అనే బ్రాహ్మణుడు స్పష్టంగా చాటించాడు. ఈ ప్రవరుడనే బ్రాహ్మణోత్తముని యింటికి ఒక సిద్ధుడు వచ్చి, పాదములకు పూసికొనెడి పసరు ఒకటి తెచ్చి ఆ ప్రవరుని పాదములకు పూసి, "నీవు యెక్కడికి పోవలెనని తల్చుకుంటే, అక్కడికి క్షణంలో ఎగిరిపోవచ్చునని" అన్నాడు. ఆ పసరుయొక్క ప్రభావం పరీక్షించాలనే కుతూహలంతో హిమాలయ పర్వత కాంతార ప్రాంతములకు పోవలెనని ప్రవరుడు కోరుకున్నాడు. వంటనే ఆ అరణ్య ప్రాంతాలకు వెళ్ళి చేరుకున్నాడు. నిజంగా, బైరాగి టిక్కెట్టు అనేది ఒకటి లభిస్తోంది గదా అనే దిలాసాతో, అగ్గంటుపని ఉన్నట్టుగా అనేక ఊళ్ళకు అదేపనిగా తిరిగేవాళ్ళు అప్పుడూ ఉన్నారు. ఇప్పుడూ ఉన్నారు. పాదలేపనం అనే బైరాగి టిక్కెట్టు ఆనాడు ఆ కథలో ఆ ప్రవరునకు లభించింది. కాని, ఆ హిమాలయ ప్రాంతాలకు చేరిన పిమ్మట ఎండవేడికి, చెమటపోసి పాదలేపనం కరిగి, కాళ్ళు కడిగికొన్నట్లయింది. బైరాగి టిక్కెట్టు జేబులోనుంచి జారి ఎక్కడో గైర్హాజరీయా అయితే, ఇక అక్కడే [illegible] కొని పోవలసివస్తుంది. ప్రవరుని పనికూడా అంతే అయింది. అక్కడ ఆ హిమాచల ప్రదేశ్‌లో అందమైన స్త్రీలు ఉంటారు. ఒక యువతి కన్పిస్తే, ఆమెను వేడుకున్నాడు. తిరిగి మాఊరు అనగా, కాశీ సమీపంలో ఉన్నటువంటి 'అరుణాస్పదం' అనే ఊరికి పోవాలంటే దారి ఏది? అని అడిగాడు. తాను అక్కడికి ఎందుకు వచ్చాడో, ఎట్లావచ్చాడో ఆ వివరాలు, ఆ రహస్యాలు మాత్రం ఆమెకు వివరించి చెప్పలేదు. అతనికి యీ దురవస్థ ఎందుమూలంగా వచ్చిందో ఆ మూలకారణం ఆ అమ్మాయికి తెలియదు.

"ఇంతలు కన్నులుండ తెరువెవ్వరి
వేడెదు భూసురేంద్ర? ఏ
కాంతము నందునున్న జవ
రాండ్ర నెపంబిడి పల్కరింపలా
గింతియ కాక, నీ వెరుగవే
మునువచ్చిన త్రోవచొప్పు? నీ
వింత భయంబులే కడుగ
నెల్లిదమైతిమి మాట లేటికిన్."

ఆ వయసు వగలాడి బలే జవాబు చెప్పింది.

"ఓ బ్రాహ్మణుడా యింత పెద్ద కన్నులు పెట్టుకొని నీవు వచ్చిన త్రోవ నీవు చూడలేకుండా ఉన్నావా? ఒకరి నడుగవలెనా? ఇది ఒక మిషగా కల్పించుకొని, ఒంటరిపాటున ఉన్నటువంటి పడుచు ఆడవాళ్ళను నీవు పల్కరించుటకు పూనుకొన్నావు. ఇంతకూ, మేము నీ కంటికి చులకనగా కన్పిస్తున్నాము. లేకపోతే నీవింత నిర్భయంగా మమ్ములను పల్కరిస్తావా?" అని ఆకలికి తన కులుకు వెలుపలికి చిలుక, చిలుక పలుకులు కొన్ని పలికింది. ఆ ప్రవరుణ్ణి తన వలలో వేసికోవాలని ప్రయత్నించింది. ఆ బ్రాహ్మణుని ముందర యీ భామామణి ఆట సాగలేదు. తిరిగి ప్రయాణం కావాలన్న బ్రాహ్మణునకు తోట సాగలేదు.

ఎక్కడి యారుణాస్పదపుర
మెక్కడి తుహినాద్రి? క్రొవ్వి
ఏ రాదగునే?

యక్కట మును సనుదెంచిన
దిక్కది యని యెఱుగ; నెడలు
తెలి గయ్యదియో?

అని తన్ను తానే నిందించుకొన్నాడు. ఒళ్ళు క్రొవ్వి యిక్కడకు నేను రావడం ఎందుకు అని ఆత్మపరిశీలన చేసికొన్నాడు. ఈ పాదలేపమనే ఔషధంయొక్క ప్రభావం తెలిసికోవలెనంటే, ఏవైనా మంచి పుణ్యక్షేత్రాలకు వెళ్ళకుండా యీ

మంచుకొండకు రావడం ఎందుకు అని తనలో తాను తర్కించుకొన్నాడు.

"ఇమ్మంచు కొండకు రాశెల్లునె? బుద్ధి జాడ్య జనితోన్మాదుల్ గదా శ్రోత్రియుల్" అన్నాడు.

ఆ హిమాచలప్రదేశ్‌లోని భామామణితో చాలా రగడ జరిగిన పిమ్మట, "ఎట్లాగురా దేవుడా తిరిగి స్వగ్రామం చేరడం?" అని గజేంద్రునిలాగున ఒక్క మొఱపెట్టి, ఫైర్ యింజన్ కోసం టెలిఫోను చేసినట్లుగా అగ్నిహోత్రుణ్ని "హలో! రక్షించు నన్ను" అని విన్నవించి అన్యథాశరణం నాస్తి యని కళ్ళు మూసికొని కాళ్ళు పట్టుకొన్నాడు.

దాన జపాగ్నిహోత్ర పరతంత్రుడ నేని,
భవత్పదాంబుజ
ధ్యానరతుండ నేని, బరదార ధనా
దుల గోర నేని, స
న్మానము తోడ నన్ను సదనంబున
జేర్పు మినుండు పశ్చిమాం
భోనిధియందు గ్రుంకకయమున్న
రయంబున హవ్య వాహనా!

ఓ అగ్నిహోత్రుడా! నిన్ను నేను అనుదినం ఆరాధిస్తూ ఉన్నవాడనైతే, పరస్త్రీ పరద్రవ్యములను ఆశించనివాడనైతే, సూర్యుడు అస్తమించేలోగా నన్ను నా యింటికి చేర్చవలసినదని వేడుచున్నాను అని తన టెస్టిమోనియల్సుతో సహా (యోగ్యతాపత్రాల జాబితాతో సహా) దరఖాస్తు దాఖలు చేసికొన్నాడు. అప్పుడు అగ్నిహోత్రుడు ప్రత్యక్షమై అతనిని తిరిగి స్వగ్రామమైన అరుణాస్పదమునకు చేర్చి ఆయన కోరిక తీర్చాడు. అయితే ప్రవరుడు అనే యీ పండితునకు యీ బుద్ధి, ఈ సంకల్పం మొట్టమొదటనే కలిగి, తన కాలి పసరు కరిగినవెంటనే అగ్నిహోత్రుణ్ని ఆత్మలో తలపోసి "నీవే తప్ప నితఃపరంబెరుగ" అన్నట్లయితే, వరూధినితో విరోధం లేకుండా, దాని గాథలో దిగి కాలహరణం కాకుండా, యింటికి చేరుకునేవాడు. ఈ విధంగా అగ్నిహోత్రుణ్ని వేడుకుంటే హాయిగా యింటికి చేరవచ్చుననే సంగతి మొదట్లో స్ఫురించక పోవడం మెదడులో ఉన్న లోపమే. అందాకా ఎందుకు? ఎక్కడికి పోవాలంటే అక్కడికి తీసికొని పోగల్గిన అగ్నిహోత్రుడు తనకు పిలిస్తే పలికే మోటారు డ్రైవరులాగున అక్కరకు రాగలడనే ఆత్మపరిజ్ఞానం ఉన్నట్లయితే, కాలికి పసరు పూసికొని యీ పండితుడు ప్రయాణాలు చేయవలసిన ప్రయాసకూడా అక్కరలేదు. కాబట్టి "బుద్ధిజాడ్యజనితోన్మాదుల్ గదా శ్రోత్రియుల్" అనే వాక్యం ఆత్మజ్ఞానం కలిగే వరకు పండితుడు నెమరువేసి ఆత్మపరిశీలన చేసికొంటూ ఉంటాడు. వరూధినివంటి పరాయి మనిషికి తన తెలివితక్కువను వెల్లడించకపోయినా, తాను చేసినది వెఱ్ఱిపనియని విమర్శించుకుంటూ ఉంటాడు. పండిత లక్షణం యిది.

అటువంటివాళ్లు తెలివితక్కువ పనులు చేస్తే చేయవచ్చుగాక! అనవసరంగా హిమాలయ పర్వతాలకు వెళ్లడం *Himalayan Blunder* (హిమాచలాపరాధము) కావచ్చు. కాని మహాత్ముడంతవాడు సత్యాగ్రహోద్యమం రోజులలో చౌరీచౌరాయందు హత్యలు జరిగినప్పుడు, జనులు అహింసామార్గమును విడిచిపెట్టి దౌర్జన్యరహిత సహాయనిరాకరణ మార్గమును విసర్జించి పోలీసుస్టేషనులను తగులబెట్టడం ప్రారంభించారు. ఈవిధంగా దేశమందు జనబాహుళ్య పద్ధతిగా సమష్టి సత్యాగ్రహం సాగించడం తాను చేసిన బ్రహ్మాండమైన హిమాలయ పర్వతం అంతటి అపరాధం అని వెల్లడించాడు. తన సమష్టిసత్యాగ్రహం అప్పుడు చాలించాడు. పండితుడైనవాడు మొండిపట్టుదలతో 'నే పట్టిన కోడికి మూడే కాళ్లు' అని వాదించడు. అవసరమైతే అవశ్యం అస్త్రసన్యాసం చేస్తాడు. పండితుడైనవాడు తన ప్రజ్ఞాసామర్థ్య పరిమితిని గ్రహించి, అహం నిగ్రహిస్తాడు.

పండితుడంటే మైసూరు రాజ్యంలో "వైద్యుడు" అనే ప్రయోగార్థం ఉంది. సామాన్య గృహంలోని నిత్యనైమిత్తిక వైద్య చికిత్సలను సంగ్రహంగా వివరిస్తూ "శతశ్లోకి" అనే పేరుతో 100 శ్లోకాలు గల వైద్యగ్రంథం కలదు. "శతశ్లోకేన పండితః" అనే మాట ఒకటి పరిపాటి అయింది. శతశ్లోకి అనే గ్రంథం చదువుకున్నవాడు 'పండితుడు' అనగా వైద్యుడు అవుతాడని అర్థం.

ఈలోకోక్తినిబట్టి చూస్తే వైద్యునకు "పండితుడు" అనే పర్యాయపదము చాలాకాలంనుంచి వాడుకలో ఉన్నదని ఊహించవచ్చు - కాని, నాగపూరు ప్రాంతములందు మంగలివానిని పండితుడని పిలువడం కలదు. శస్త్రచికిత్సలు మొదలైనవి గ్రామాలలోని మంగలి చేస్తూ ఉండడం ఇప్పటికీ అమలులో ఉన్న విషయమే. క్షురకర్మకు "ఆయుష్కర్మ" యనే పేరు నేటికిన్నీ శాస్త్రవిహితంగా వర్తిస్తోంది. అట్టి సందర్భంలో ఆయుర్వృద్ధికరమైన ఆయుర్వేదము మంగలియొక్క విద్యగా అనేక ప్రాంతాలలో ఉంటూ వచ్చింది. అందువల్లనే పండితుడంటే మంగలియను పర్యాయపదము రూఢియై యుండవచ్చును. కాని, యీ కాలంలో ఆయుర్వేదము అందరికీ యథాశక్తిగా తెలిసియుండవలసిన ఆరోగ్యదాయకమైన విద్య యని చెప్పక తప్పదు. అదేవిధంగా ఆయుష్కర్మకూడా ఎవరికి వారే స్వయంగా చేసికొనడం అలవాటై పోయింది. సామాన్యంగా తల క్రాపింగు చేయించుకొనుటకు క్షౌరశాలకు పోవుటకు ఎవరైనా తల యొగ్గును కాని, నిత్యనైమిత్తిక ఆయుష్కర్మకు అనగా గడ్డం మీసం వగైరా క్షౌరమునకు మాత్రము తనకుతానే పండితుడై ప్రతి యువకుడు ప్రాతఃకాల ప్రథమ కర్తవ్యంగా 7 "O' clock" బ్లేడుతో 6 గంటలకే "ప్రత్యూష పవనాంకురములు పైకొను వేళ" వపనం ముగిస్తాడు.

కాని నేటి భద్రతామండలి అమలులోనికి రాకపూర్వమే *Safety-Razors* (భద్రతాముండకాయుధములు సేఫ్టీరేజర్లు) ప్రచారంలోనికి వచ్చాయి. కాని, యీ భద్రతాముండకాయుధములు లేని రోజులలో మామూలు మంగలి కత్తులే (గుల్లకత్తులు) అమలులో ఉండేవి.

ఆనాటి ప్రాచీనకాలంలో అనగా సేఫ్టీరేజరు యుగానికి పూర్వయుగంలో సుబ్బారావు అనే ఒక బ్రాహ్మణ యువకుడు స్వయంగా క్షురకర్మ చేసికొని అందులో కూడా తాను పండితుడు కావాలని కలత

(56-వ పేజీ చూడండి)

రచయితలకు మనవి

మీరు కథలు, గేయాలు, చిత్రాలు, ఫోటోలు పంపేవారు వానిని త్రిప్పి పంపగోరినట్లయితే, వానితోపాటు తగిన స్టాంపులను చేర్చి పంపవలసిందని సూచన. ఈ సందర్భంలో బుక్‌పోస్టుకు అణా స్టాంపులు తక్కువ కాకుండా అంటించాలని గుర్తుంచుకోవడం అవసరం. ఫోటోలను పంపేవారు కనీసం కార్డుసైజు ఫోటోలను పంపాలి. నెగటివ్‌లు స్వీకరించబడవు. కథలు, ఫోటోలు మొదలైనవి అందినవెంటనే ప్రచురణ విషయమై మా నిర్ణయాన్ని తెలియచెయ్యడం సాధ్యంకాదని మనవి చేస్తున్నాము. నిరాకరించబడిన వానిని త్రిప్పి పంపడానికి కనీసం ఒక మాసమైనా వ్యవధి నివ్వవలసిందని మా విన్నపం. ప్రచురించే వాని విషయమై ప్రచురించే ముందు మాత్రమే తెలియపరచగలము. రచయితలూ, చిత్రకారులూ ఈ విషయంలో సహకరించగలరని మా విశ్వాసం. —సం॥

సంతానం

1

కమలవంటి అదృష్టవంతురాలు లేదన్నారు పదేండ్లక్రిందట. చదువుకొన్నవాడు, చక్కనివాడు, పైగా బుద్ధిమంతుడు, దమ్మిడీ కట్నాన్ని గూడా తీసుకోకుండా పెండ్లిచేసుకున్నాడు రామం కమలను. ఏమి చూసి చేసుకున్నాడంటె ఏమి చూసి అని అన్నారంతా. కమల అంత రూపవతి గాదు. కాలేజీలో చదువనూ లేదు. సంగీతపాటకురాలూ గాదు. పెద్ద ఆస్తికి వారసురాలూగాదు. తండ్రిలేనిపిల్ల. అన్నవదినే ఎక్కడో వుద్యోగం చేసుకుంటూ కమలను తల్లికే అప్పచెప్పిపోయినారు. ఆ చిన్న వూళ్లోనే పదిహేనేండ్ల వరకూ పెరిగి పెద్దదయింది. మంచి సౌమ్యత గలపిల్ల. చామనచాయ. సన్నగా నాజూగ్గానేవుంటుంది. తెల్లచీరా. పచ్చ జరీ అంచు జాకెటూ తొడిగి కరణంగారింట్లో స్నేహితురాలు జానకి పెండ్లికి పేరంటం చేస్తుంటే చూశాడు రామం కమలను. అసలు రామం ఎప్పుడూ పల్లెటూరికి వెళ్ళనే లేదు. గుంటూరులోనే పుట్టి గుంటూరులోనే పెరిగాడు. తన యిరవై ఏండ్లూ అక్కడే గడిపాడు. తండ్రి కాలేజీలో లెక్చరరు. బి. ఏ పరీక్షలయినవి. ఆ వైశాఖంలో మిత్రుడు వెంకట్రావు పెండ్లికని ఆవూరు వెళ్లాడు. సరదాగా నాలుగురోజులు గడపటానికని వెంకట్రావుతో తోడి పెండ్లికొడుకుగా వెళ్ళాడు రామం. కరణంగారి కూతురు పెండ్లి. సుందరమ్మగారింట్లో విడిదీను. సుందరమ్మగారిది పెంకుటిల్లే. అయినా వాకిట్లో ఎత్తయిన అరుగులు. ఇంటివెనుక పెద్ద దొడ్డీ, దొడ్లో కరివేపాకుచెట్టు, బాదంచెట్టు, మల్లెమొక్కలూ, గిలకభావి- ఇల్లు చాలా వసతిగలయిల్లేనని పించింది రామానికి. చల్లగాలి పంకాలు లేకుండానే వచ్చేది. గుంటూరులో తను వుండే డాబాకన్నా యిక్కడే ఎంతో హాయి అనిపించింది. పెండ్లి మూడోరోజున సాయంకాలం దొడ్లో గిలకభావిదగ్గర స్నానానికి నీళ్ళు తోడుకోబోతుంటే కమల వచ్చి 'ఆ గచ్చుతొట్లో నీళ్ళు పోసుకోండి ఫరవాలేదు. మేము తర్వాత తోడించుకుంటాం' అంటూ చెప్పిపోయింది. పెండ్లి పేరంటానికని అందరూ పట్టు చీరెలూ, జరీచీరెలూ కట్టుకొంటే మలకమాత్రం మామూలు తెల్ల చీరేకట్టుకోటం చూస్తే రామానికి ఆశ్చర్యం వేసింది. బస్తీలలో పిల్లలమాదిరిగాక ఎంతో చనువుగా తనతో మాట్లాడినందుకు గూడా మురిసిపోయినాడు. పెండ్లికి వచ్చిన బంధువులంతా కరణంగారింట్లో మేజువాణీ తిలకిస్తున్నారు. రామం స్నానం కాంగానే పాంటూ - షర్టూ తొడిగి విడిది యింట్లోనే మంచం మీద విశ్రాంతి తీసుకున్నాడు. తన కంత వరకూ ధోవతి కట్టుకోవాల ననిపించలేదు. కాని ఆరోజున ఎందుకనో తన పాంటు మీద విసుగు పుట్టింది. కట్టుకొందామన్నా తనకు ధోవతి లేదు.

శ్రీ తన్నీరు
లక్ష్మీనారాయణ

ఇంట్లో సుందరమ్మగారు తప్పితే ఎవ్వరూ లేరు. వాకిట్లో మంచంమీద పడుకొని రామం ఆలోచిస్తున్నాడు. ఇంతలో సుందరమ్మగారు వచ్చి 'ఏం నాయనా. ఒక్కడవే యిక్కడున్నావు. వంట్లో బాగుండలేదా' అని పలకరించింది.

'ఆ ఏమీలేదండీ. అయినా యింకా అక్కడ మనతో పనేముందండీ. పెండ్లికొడుకూ నేనూ కలిసి చదువుకొన్నాము. పెండ్లికి రమ్మంటే సరదాకని వచ్చాను. యీ మూడు రోజులూ చాలా హాయిగా వెళ్ళిపోయినవండీ. రేపు మళ్లీ మాగుంటూరు పోవాలెగదా అని అనుకుంటున్నాను.'

'అదేమిటి నాయనా. మీ గుంటూరు బస్తీ. ఇదేదో చిన్న పల్లెటూరు. పాపం మీరెట్లా గడిపారో యీ మూడు రోజులూనూ.'

'అయితే మీ అమ్మాయి కింకా పెండ్లి కాలేదాండీ' అన్నాడు రామం చటుక్కున.

'అవును నాయనా. ఎలాగవుతుందీ పెండ్లి - సంచులుంటేగదా' అన్నది సుందరమ్మగారు.

'ఎందుకండీ సంచులు. అమ్మాయి మంచి పిల్ల; బుద్ధిమంతురాలు. నిక్షేపంగా చేసుకుంటా రెవరయినా' అన్నాడు రామం.

'ఆ! అంత అదృష్టమా నాయనా' అన్నది సుందరమ్మ.

'నేను బి. ఏ. దాకా చదివానండీ. మీ కభ్యంతరం లేకపోతే మా అమ్మనూ నాన్ననూ పంపిస్తాను. మీ అమ్మాయిని గూడా కనుక్కోండి. ఆమె కిష్టమయితే నేనామెను తప్పకుండా పెండ్లి చేసుకుంటాను. దమ్మిడీ కట్నంగూడా లేకుండా' అంటూండగానే కమలా, యింకో ముగ్గురు పెండ్లిపేరంటాండ్రువచ్చారునవ్వుకుంటూ.

'అరే . తోడు పెండ్లికొడు కిక్కడున్నాడా, పెండ్లికొడుకెంతో వెదుక్కుంటున్నాడీయనగారి కోసం' అన్నది ఆ వచ్చిన ముత్తయిదువులలో నొకామె.

'అవును పిన్నీ. కాస్త విశ్రాంతికోసం ఇక్కడే వుండిపోయాను. ఏముందీ ఇంకా అక్కడ మనం చేసేదీ, చూసేదీనూ. బంతులాటలూ - ఆడవారి పాటలూ తప్ప.'' అన్నాడు రామం.

సుందరమ్మగారు రామం పిన్ని ద్వారా అన్ని సంగతులూ తెలుసుకొన్నది. పిల్లవాడు చాలా బుద్ధిమంతుడు. మంచి సంప్రదాయం. ఒక అక్కగారూ ఒక తమ్ముడూ వున్నారు. పెద్ద ఆస్తిపరులుగాదు. తండ్రి సంపాదన తప్ప యింకేమీ లేదు.

మర్నాడు రామం సుందరమ్మగారి దగ్గర శెలవు తీసుకొని ఆ వూరు వదలేక వదలేక వెళ్ళాడు. తప్పకుండా మంచిరోజు చూసుకొని తలిదండ్రులతో రావలసిందిగా చెప్పింది సుందరమ్మగారు. కమలకు గూడా రామం అంటే అదోరకం అయిన ఆప్యాయత కల్గింది. ఆ నాలుగురోజులూ ముఖం కడుక్కోటానికి మరచెంబుతో నీళ్ళు తనే పెట్టేది అరుగుమీద. చదువుకున్న పట్రవాండ్ల మాదిరి ఆడపిల్లలను చూసి కేరింతలు కొట్టలేదు రామం. అందుకనే కమల రామం అంటే అభిమానపడ్డది. యీ సంబంధాని కతని తలిదండ్రులు ఒప్పుకుంటే బాగుండునని ఎన్నో విధాల దేవుడిని ప్రార్థించుకుంది మనసులోనే కమల.

'ఏమండీ, అబ్బాయి [illegible] మే కాదండీ మన నరసమ్మగారు గు[illegible] ఆ అమ్మాయి మంచి కలు[illegible] పిల్లట. చాలా బుద్ధిమంతు[illegible]



నట. ఆ పిల్లముఖం కళకళ్ళాడుతూందిటండీ. వైభవ కట్నాలు మనకేమి వుద్ధరిస్తవండీ - ఏదో వాడికి నచ్చిన పిల్ల. రేపు దశమినాడే వస్తున్నామని వ్రాయించండీ' అని బతిమిలాడింది రామం తల్లి రామలక్ష్మమ్మగారు భర్తను. ఏదో అయిదు వేలన్నా రావాలని పట్టుబట్టి కూర్చున్న రామచంద్రయ్యగారు గూడా ఇంత చెపుతుంటే తప్పించుకోలేక 'సరే' నన్నాడు.

అనుకున్న ప్రకారమే అన్నీ జరిగిపోయినవి. పిల్లకు పిల్లాడు నచ్చాడు. పిల్లవాడికి పిల్ల నచ్చింది. కట్నాల ప్రస్తాపనే లేదు. ఐదు రోజులూ పెండ్లి వైభవంగా జరిగింది. కరణంగారి కూతురు పెండ్లి చలవ అని అనుకున్నారు కమలా రామారావు గూడా. 'అదృష్టమంటే కమల[illegible] అదృష్టం'' అని అన్నారుఅం[illegible]డు.

2

[illegible]హమయిన ఆరునెలలకే రామానికి ఉద్యోగం దొరికింది. జీతం నెలకు నాలుగు వందలు. కోడలు వచ్చిన వేళా విశేషం అన్నారు రామలక్ష్మమ్మగారితో అంతా. రామం ఎంతో సంతోషించాడు. కమలతో పాటు అదృష్టం గూడా కలసి వచ్చిందనుకున్నాడు. పట్నంలో క్రొత్త కాపురం పెట్టాడు. ఎంతో హాయిగా గడచిపోయినవి అయిదేండ్లు. చీకూ చింతా అనేది ఎరగరా దంపతులు. చాలినంత డబ్బు, కమలకు కోరినచీరె కోరిన నగ. ఒకసారి సుందరమ్మగారు వచ్చి ఒక నెలరోజులు కూతురూ అల్లుడూ ఖులాసాగా వుండటం చూసి వెళ్లింది. రామం తలిదండ్రులు గూడా ఒక వేసవి శెలవులు పట్నంలో గడపి వెళ్ళారు. చిలకా గోరింకల్లా వున్న దంపతులను చూసి బంధుజనం అంతా సంతోషించారు. నిజంగా అటువంటి కోడలు దొరికినందుకు మరి మరీ సంతోషించింది రామలక్ష్మమ్మగారు.

ఒక నెలరోజులు శెలవుపెట్టి తమ బంధువుల యిండ్లకు పోయివద్దామని బయలుదేరారు రామం కమలాను. వారం రోజులు గుంటూరులో వుండి బందరులో నున్న అక్కయ్యగారింటికి వెళ్ళాడు రామం భార్యాసమేతంగా. తమ్ముడినీ తమ్ముడి భార్యను ఎంతో మర్యాద చేసింది పంకజమ్మగారు. ఒకరోజున రామంతో అన్నది:

'రామూ! అంతా బాగున్నది కాని కమల కొక్క కూతురన్నా పుడితే మా నారాయుడికి పెండ్లాన్ని వెతుక్కోనక్కర్లేదురా. అదొక్కటే కొరతగా వుందిరా నాకు' అని అన్నది. రామం ఒక చిన్న నవ్వు మాత్రం నవ్వి వూరుకున్నాడు కమలవైపు చూసి. కాని కమల మనసుమాత్రం చివుక్కుమన్నది. తనలో ఒక కొరతను చూపించింది గదా వదినెగారు అని అనుకొన్నది. బందరు నుంచి విశాఖపట్నంలోనున్న బావమరది గారింటికి బయలుదేరాడు రామం. సిండియాలో చిన్న గుమాస్తాగా పనిచేస్తున్నాడు కమల అన్నగారు శంకరం. నెలకు నూరు

సంగీతమునకు లొంగి వంగిన సామ్రాట్టు

అక్బరు చక్రవర్తి ఢిల్లీలో పరిపాలించు చుండిన కాలమందు గ్వాలియరు నగరమందు "మియాన్ తాన్సేన్" అను పేరుగల ఒక గొప్ప సంగీత విద్వాంసుడు జన్మించినాడు. ఇతడు జన్మతః హిందువు. తర్వాత మహమ్మదీయుడైనాడు. గ్వాలియరు ప్రభువైన రాజా మాన్ సింగు తన్వార్ చాలా సంగీత ప్రియుడు. "ద్రుపద్" సంగీతపు బాణి యాతడు కల్పించినదే-అక్బరు వద్ద మంత్రిగా. సలహాదారుగా నుండిన రాజా మాన్ సింగు యితడు కాడు. పై జెప్పిన గ్వాలియరు ప్రభువగు రాజా మాన్ సింగు తన్వార్ ఒకనాడు తాన్సేన్ చేత పాట కచ్చేరీ చేయించి, ఆఒక్కపాట కచ్చేరికి ఒకలక్ష టంకములు యిచ్చాడు. టంకము అనే ఆనాటి బంగారు నాణెము యీనాటి వరహాకు రమారమిగా సమానమని యెంచి సుమారు రూ 4 లు కిమ్మతు కట్టవచ్చు. కనుక ఒక్కపాటకచ్చేరీకి అప్రభువు రూ 4 లక్షలు యిచ్చి తాన్సేను మహాశయుని బహూకరించాడు. అటువంటి మహాప్రభువు రాజా మాన్ సింగు తన్వారు చనిపోయిన తర్వాత తాన్సేను ఒక నియమ దీక్ష నిర్ణయించుకున్నాడు. ఆ ప్రభువునకు తన కుడిచేతిని అంకిత మిచ్చినట్లుగా భావించి, ఎంతటి మహా చక్రవర్తికి తాను సలాము చేయవలసి వచ్చినను తన ఎడమ చేతితోనే సలాము చేసేవాడు. తాన్సేన్‌ను తన దర్బారుకు పంపవలసినదిగా, అక్బరు చక్రవర్తి కబురు చేశాడు. రాజా మాన్ సింగు తన్వారును విడిచి పోలేక విడిచిపోలేక తాన్సేను ఢిల్లీకి వెళ్లెను. అతడు ఢిల్లీకి వెళ్లునప్పుడు తాన్సేను కూర్చుండినపల్లకిని రాజామాన్ సింగు తన్వార్ స్వయంగా కొంతదూరం మోసెను.

అక్బరు చక్రవర్తితో కలిసి గాయక శిరోమణియైన తాన్సేను ఒకనాడు చక్రవర్తి యొక్క తోటలో విహరిస్తున్నాడు. ఒక మామిడి చెట్టు నుండి పండి వ్రేలాడు చుండిన మామిడి పండును కోయవలెనని తాన్సేను చాలా ప్రయత్నం చేశాడు కాని, అకాయ్మ అతనికి అందలేదు. అక్బరు చక్రవర్తి అది చూచి తాను వంగి తనవీపు మీద ఎక్కి ఆకాయను కోసికో వలసినదని తాన్సేనుతో చెప్పెను. ఢిల్లీ పాదుషా యంతటి వాడు తన వీపుమీద అతనిని ఎక్కించుకొనుటకు సిద్ధపడి వంగినందుకు తాన్సేను నిశ్చేష్టుడైనాడు-తనయందు పాదుషా చూపిన గౌరవాదరణకు తాన్సేను హృదయం చలించింది. వెంటనే తన రెండు చేతులతో అక్బరుకు రాజదర్బారు మర్యాద ననుసరించి "తస్లీం" నమస్కారము చేసెను.

అక్బరు కాలము నాటి వాడైన "అబుల్ ఫజల్" వ్రాసిన "అయినీ - అక్బరీ" (అక్బరుచరిత్ర) అనే గ్రంథంలో అక్బరు చక్రవర్తి దర్బారులో ఉన్నటువంటి సుప్రసిద్ధ సంగీత విద్వాంసులు 38 మంది పేర్కొన బడియున్నారు. వారందరిలో "తాన్సేన్" అగ్రగణ్యుడు. సంగీతానికి లొంగి వంగిన సామ్రాట్టు అక్బరు చక్రవర్తి.

★ సంతానం ★

రూపాయ లిస్తారు. ఒక చిన్న యిల్లు గూడా పూరికే యిచ్చారు. చాలీచాలని యిల్లు. అందులోనే నలుగురు పిల్లలతో కాపురం చేస్తున్నాడు శంకరం. కాంతానికి అంటే కమల వదినెగారికి కమల అంటే నిష్కారణమైన కోపం. పెద్ద ఉద్యోగస్థుని భార్యననే గర్వం కమలకు వున్నదని ఆమె అనుమానం. అందుకనే కాబోలు 'ఆ, ఎంత సంపాదిస్తేమటుకు ఏం లాభం. పిల్లా జెల్లా లేందే ఎందుకూ వందలూ, వేలూను.' అని అవసరం అయినపుడూ లేనపుడూ గూడా అంటుండేది కమలతోనూ, ఇరుగు పొరుగు అమ్మలక్కలతోనూ. కమలకు అన్నయ్యగారింట్లో నాలుగు రోజు లుండేటప్పటికి పిచ్చెక్కినంతపనయింది. 'ఏమండీ. యిక మావూరుపోయి శెలవులయిందాకా అక్కడే వుండి పట్నానికి పోదాం' అన్నది రామంతో. 'సరే' నన్నాడు రామం.

అత్తగారింటికి వచ్చేశారు రామం కమలానూ. అక్కడమాత్రం ఏమయింది. 'అయితే సుందరమ్మగారూ. అమ్మాయికి...' అని సణిగేవారే ఆ వూళ్లో ఆడంగులంతా. 'ఆ. ఇంకా ఆ అదృష్టం కలగలేదమ్మా' అని సమాధానం చెపుతుండేది వారందరికీ సుందరమ్మగారు. 'మాశారా. కరణంగారి అమ్మాయికి ఒక కొడుకూ ఒక కూతురూనూ. నిరుడేగదా పంతులుగారి సీతమ్మ అత్తారింటి కెళ్ళింది. అప్పుడే కంటానికని వచ్చింది. ఏమోనమ్మా, మనమణ్ణి ఎప్పుడు ఎత్తుకుంటానో పాపం' అంటూ ఓదార్పు వెల్లడిచేసింది పొరుగింటి హనుమాయమ్మగారు. ఈ కబుర్లన్నీ వింటుంటే కమలకు కంటకంగా వుండేది. 'ఏమండీ ఇంకా శెలవు ఎన్నాళ్ళుంది' అనేది రోజూను. 'ఏం కమలా అంత తొందర, రేపే పోదాంలే - పట్నంలోనే నాలుగురోజులు విశ్రాంతి తీసుకోవచ్చు' అని పట్నం వెళ్ళారు రామం కామలాను శెలవు యింకా నాలుగురోజు లున్నప్పటికిని.

'ఏమండీ, వీండ్లందరకూ ఎందుకండీ బాధ మనకు పిల్లలు లేరనీ. అబ్బా, యింకో నాలుగురోజులా వూళ్ళల్లోవుంటే నా తల పగిలిపోయే దనుకోండి.' అని అంటుంటే కమలమీద ఎంతో జాలివేసింది రామానికి. 'అదేమిటి కమలా అంత ఖంగారు దేనికి. పిల్లలు పుట్టరనే బెంగ దేనికీ యిప్పుడే. అయినా అయిదేండ్లకే ఏం ముంచుకపోయి ళ్లో వీరంతాను' అని మాత్రం అన్నాడు రామం.

అలానే యింకో ఐదేండ్లు గడచినవి. ఉద్యోగంలో గూడా ప్రమోషను వచ్చింది రామానికి. ఇప్పుడు నెలకు ఎనిమిది వందలు జీతం. ఒక కారు గూడా యిచ్చేరు. ఒక చిన్న బంగాళాలో వుండేవారు. కోరినదల్లా వుంది. కాని ఆ కొరతమాత్రం కొరతగానే వుండిపోయింది. కమలకుగాని రామానికి గాని అది కనబడేది గాదు. కాని హాయిగా వుండనిస్తుందా బంధుజనం. మేనకోడలు పెండ్లికి రావలసిందిగా పిలుపు వచ్చింది బందరునుంచి. బందరు వెళ్ళటానికనంగానే భయం వేసింది కమలకు. 'మీ రొక్కరే వెళ్ళి రాగూడదూ' అని అడిగింది. 'బాగుండదు కమలా. అయినా మనన్నేమి చేస్తారు చెప్పు వాండ్లు. పోయి వద్దాం' అని అన్నాడు రామం. తప్పలేదు ప్రయాణం. పెండ్లికి తన తోడుకోడలు గూడా వచ్చింది. మరదికి గుంటూర్లోనే పుగాకు కంపెనీలో నౌఖరీ. నెలకు నూటపాతిక యిస్తారు. తోడుకోడలు నల్లటి పాత చింతపండు - అయిందానికీ కానిదానికీ ముసుగుతో యుద్ధమే. 'పిల్లా డేడుస్తుంటే వినిపించటంలా - చేటంత చెవులకు. నలుగురుతో పేరంటానికి పోవటానికన్నా వీలులేదు. వెధవ పిల్లలు. తీసుకోండి' అంటూ మరదిచేతుల్లోకి ఆపుత్ర వెధవను వదిలేసి వెళ్లింది తోడికోడలు. అయినా పెండ్లికి వచ్చిన నలుగురూ తోడికోడలుకు చూపే మర్యాద తనకు చూపలేదు. పైగా తనతో సత్యంగా మాట్లాడినవారుగూడా లేరు. వదినెగారుగూడా అన్ని పనులూ తోడికోడలుకే చెప్పేది. తనంటే ఆయింట్లో ఎవరికీ ప్రేమగాని గౌరవంగాని వున్నట్లే లేదు. పై పెచ్చు అందరికీ తనను చూసినా తన సొమ్ములు చూసినా తన చీరెలను చూసినా అసూయగా వుండేది. ఆఖరుకు అత్తగారు గూడా 'ఆ. ఏమిటో. మా రామం ఖర్మ అలాగుంది. ఎన్నివందలు సంపాయించుకొంటే ఏం. పిల్లా జెల్లా?' అని అనేసింది. కమలను చూసి ఒక్కరూ జాలి గనబరచక పోవడం రామానికి గూడా కష్టం వేసింది.

'ఏరా రామూ. పిల్లలు లేరటగా. ఏదో రామేశ్వరం అన్నా వెళ్ళిరండిరా. కనివిరగడ అవుతుందేమో' అని అనేవాండ్లే అంతాను. రామానికి ఎంతో కష్టం వేసింది. ఇన్నాళ్ళూ తామెంతో హాయిగా వుంటున్నామనుకున్నారు. కాని యీ వాతావరణంలో తమ కేమీ విలువ లేదని తెలిసిపోయింది. మగవాడయి తనే అలా అయిపోతే

మంత్రిగారేదో మహా చిరాకులో వున్నారు. ఏదో రాయబోయి, పెన్సిల్ కోసం ఎంత వెతికినా అది కనిపించక పోగా, శెక్రటరీని కేకేశారు.

"నా పెన్సిల్ ఏదయ్యా?"

శెక్రటరి చిత్తర పోతూ నాలుగు మూలలా వెదికి—

"చిత్తం. తమరి చెవిలో వుందండీ!" అన్నాడు.

"చెవ్వి ఎక్కడుందయ్యా?" అని అడిగారు చిరాకుతో చిటపటలాడి పోతున్న సచివోత్తములు!

యిక కమల సంగతి ఎలాగుండివుండాలో వూహించుకొని మరీ విచారించేడు.

మర్నాడే పట్నం బయలుదేరాడు భార్యతో.

3

'కమలా ఎందుకు చెప్పు ఇంత బెంగ. మనకా అదృష్టం వుందో లేదో' అన్నాడు భార్యతో.

'అదేమిటండీ. ఎవరికీ బెంగ. నాకు పిల్లలు లేరని కాదుగానీ మన్య వీండ్లందరకూ ఎందుకో యింత బాధ అని. వాండ్లు కంటే కన్నారు. ఇంకా కనమనండి. అంతే గాని మనల్ని చూసి వీండ్లేడవటం దేనికీ అని. అసలు పిల్లలను కని వీండ్లేమంత సుఖపడి చస్తున్నారండీ. మాకాంగా మా అన్నయ్య పనే అగచాటు - ఒక్కపూట తింటే రెండోపూటకు దిగులే. మీ అక్కయ్యకు ఒక్క కూతురు పెండ్లితోనే తెలిసిందిగా. అయినా మనకు వుండేలోటేమున్నదీ అని. ఉన్నన్నాళ్ళూ తింటాం. తర్వాత సంగతి తర్వాత.' అని అన్నది భర్తతో కమల.

'అది గాదులే కమలా. మనం ఎంత తిన్నా ఎంత సంపాదించినా సంసారంలో వుండే సుఖాలు దుఃఖాలు వాటి కవే సాటి. అయినా మనంమాత్రం రామేశ్వరం పోయి వస్తే వచ్చే ప్రమాదమేముంది చెప్పు. చూసినట్లూ అవుతుంది. ఫలితం వుంటే వుండవచ్చుగూడా. మాఆంజనేయులు మొన్ననే చెప్పాడు. ఇలాగే వాడికి పాతికేండ్లకు

కూడా పిల్లలు లేరట. వారూ వీరూ చెప్పితే రామేశ్వరం అవీ వెళ్ళివచ్చాడుట. ఆ సంవత్సరం లోపలనే కొడుకు పుట్టాడుట. నీవు వప్పుకుంటే యీ సంవత్సరమే మనంగూడా వెళ్లివద్దాం కమలా' అన్నాడు రామం.

'అబ్బా మీకూ పుట్టిందీ యీ వెర్రి! యిన్నాళ్ళూ అందరూ అంటున్నా వూరుకున్నాగాని మీకుగూడా యిదొక కొరతగావున్నదని నాకు తెలియలేదు'

'అదేమిటి కమలా, పుట్టినతర్వాత పెండ్లీ పేరంటం అన్నారు. దాని తర్వాత మరి సంతానమే గదా కోరేదీనీ కావలసిందీను? అదిలేకపోతే కొరత గాదని అనుకోటమెట్లా? కొడుకులూ కూతుండ్లూ కలగటం వాండ్లను పెంచి పెద్దచేయటం వృధాప్యంలో వారి వల్ల సుఖపడటం యివన్నీ జీవితంలో భాగాలేకదా. ఇంతటితో ఆగిపోతే కొరత జీవితమే?'

"ఏమిటండీ ఇన్నాళ్లూ మీరిలా గంటారని నేననుకోలేదు. ప్రాప్తంవుంటే పుడతారు లేకపోతే లేదు. అంతేగాని తృప్తి అనేది, లేకుండా లేనిదానికి వగచి ప్రయోజనం ఏమిటండీ. ఉన్నన్నాళ్ళూ హాయిగా వుంటే చాలదా అని అనుకునే దాన్ని. కాని మీరుగూడా కష్టంపెట్టుకున్నారని అనుకోలేదు. ఏంచేస్తాను నా ప్రారబ్ధం. నన్ను గాకుండా మరొక ర్నెవరినన్నా చేసుకొనివుంటే మీకీ కష్టమే వుండేది గాదు కాబోలు.. అయినా ఎందుకండీ మీకు బాధ" అని అడిగింది కమల.

'అదిగాదు కమలా ఇటుచూడు రేపు నా తర్వాత నీ వొక్కతెవే యీ జీవితం గడపవలసివస్తే...?' అని అన్నాడు రామం.

'చాలు లెద్దురూ పాడుమాటలూ. ఇక వూరుకోండురూ మీ పుణ్యమా అని' అని మాత్రం అనేసి వూరుకొంది కమల.

క్రమేపీ వారికి సుఖం అనేది సన్నగిలింది. విసుగు పుట్టుకొచ్చింది. బంధువుల యిండ్లకు వెళ్ళటం మానివేశారు. వారు గూడా యిటు రావటం మానివేశారు. ఉత్సాహం తగ్గటం పైగా మనోవ్యాధి ఏర్పడింది కమలకు. అప్పటికిగాని రామానికి తెలిసిరాలేదు తను చేసిన పొరబాటు. నలుగురుతోపాటు తనుగూడా కమల మనస్సు పాడుచేశాడు.

కాని చేసేదేముంది. క్రమంగా కమల నీరసించిపోయింది. మంచం పట్టింది. ఏ డాక్టర్లు కుదర్చగలరు మరి మనోవ్యాధిని? పిల్లల్నిగన్న తల్లులే భూమిమీద వుండటానికి అర్హులు అని లోకమంతా అన్నట్లు అనిపించింది కమలకు. పాపం కమల కృంగి కృశించిపోయింది. ఒకనాడు రామంతో అన్నది. 'ఏమండీ, నేనింకెన్నాళ్ళో బ్రతకను. మీ రింకో కమలను చేసుకొని కొడుకులనూ కూతుండ్రనూ సంపాయించుకోండీ' అని. కండ్లనీళ్లు తుడుచుకుంటూ 'ఏమిటి కమలా యీ పిచ్చిమాటలు, నాకు నీవు లేకపోయింతర్వాత కూతుండ్లూ కొడుకులూ దేనికి కమలా. నీతోనే నాకు. నీ వుంటే నాకంతే చాలు. నీకు తిరిగీ ఆరోగ్యం చేకూరితే నాకదే పదివేలు. ధైర్యం తెచ్చుకో కమలా. నే నన్నమాటలు మరచిపో.' అని ఓదార్చాడు కమలను.

కమలస్థితి మరీ నీరసించింది. ఒకరోజున 'అమ్మా, ధర్మం బెట్టరూ' అంటూ అరవై ఏళ్ళు పైబడిన బక్కచిక్కిన ముసలమ్మ గుమ్మంలోకి వచ్చింది. అంత నీరసస్థితిలో గూడా కమల ముసలమ్మను గుర్తుపట్టింది. 'అదేమిటి పిన్నిగారూ, మీ కివేం రోజులూ' అంటూ పల్కరించింది.

'ఎవరమ్మా, మీరూ?' అంటూ దగ్గరగా వచ్చింది ముసలమ్మ.

'నేనండీ - కమలను. గుర్తు చిక్కలే' అంటూ లేచి కూర్చుంది మంచంమీద నే కమల.

'ఆ, నువ్వా కమలా. అయ్యో తల్లీ, ఎందుకమ్మా యిలా అయిపోయినావు. నా తల్లీ ఏమని చెప్పను తల్లీ, నా బ్రతుకు చివరకు యిలా తెల్లారుతుందని కల్లోగూడా అనుకోలేదు తల్లీ. నలుగురు కొడుకులూ, నలుగురు కూతుండ్లూ వుండి కూడా ముష్టి ఎత్తుకొని బ్రతకవలసి వస్తుందని అనుకోలేదు తల్లీ - ఏదో కనిపెంచేవరకే సంతానంగాని ఏం సంతానం తల్లీ. ఉన్నదంతా వాండ్ల చదువులకనీ వాండ్ల పెండ్లిండ్లకనీ ఖర్చుచేసి చచ్చారాయన. తీరా వీండ్లు పెద్దవాండ్లయ్యాక తల్లిముండలను చూస్తేనా. కోడండ్ల మాటలు విని ఒక్కరూ పిడికెడు అన్నం పెడితే ఒట్టు తల్లీ. నాకు పెడితేనే అయిపోతుం దన్నట్లు యింటినుంచి వెళ్ళగొట్టారమ్మా. ఒక్క వెధవా కన్నకడుపు మీద కనికరం చూపించాడా. పెద్దవాడికి నెలకు రెండువందలూ స్తవి. ఏం ప్రయోజనం. అంతా అమ్మగారి దయ. ఆమె తల్లీ - ఆమె తమ్ముడూ వుండి తినవచ్చును గాని నే నుండటానికి వీల్లేదు ఆ యింట్లో. రెండోవాడు పెండ్లానికి నూరేసి రూపాయలు బెట్టి చీరెలు కొంటాడుగాని నాకొక పాతగుడ్డ తీసియివ్వటానికి శక్తి లేదుట. ఇక మూడోవాడు మిలిటరీలోకి చేరి ఏ మూలకు పోయాడో ఎవరికీ తెలీదు. అసలున్నాడో చచ్చాడో గూడా తెలీదు. నాల్గోవాడన్నా యింత పెడుతాడేమోనని అనుకున్నా. 'చాలుచాల్లే. పెద్దవాండ్లందరూ ఏమయినారు. అక్కడికే పో. నాకు మటుకు నువ్వేమిపెట్టావు. ఏదోకష్టపడి చదువుకున్నందుకు యీ వుద్యోగం దొరికింది. యీ సంపాదించుకొనేది నాకే చాలటం లేదు' అన్నాడు. వాడి పెండ్లాం పౌడరు డబ్బాలకూ సినీమాలకూ అయిందాట్లో సగం పారేస్తే నా జీవితం వెళ్లిపోతుంది తల్లీ. కానయితే ఏంచెయ్యనూ ఒక్కడికి కనికరం లేదు. కన్నవాండ్లకే యిలాగుంటే యిక పరాయమ్మలుగన్న అల్లుండ్లకే ముంటుంది చెప్పు. ఏదో ఎంతయినా కన్నప్రేమగదూ. వారి బ్రతుకులు వారు బ్రతకనీ అంతే చాలు, మధ్య నేనెందుకు వాండ్లను వేధించటం అని ఏదో కాలూ చేయీ ఆడినన్నాళ్ళూ నాపొట్టను నేనే పోషించుకుందాం అని యీ పాత్రతో బ్రతుకుతున్నానమ్మా. ఏదోశక్తి వున్నన్నాళ్ళూ యిలాగే తిరుగుతాను. దొరికినవేళ తింటాను. లేనివేళ కృష్ణా రామా అంటూ పడుకుంటాను. ఇలా అయింది తల్లీ నా బ్రతుకు' అని వెళ్లబోసుకున్నది శాంతమ్మగారు.

ఈ మాటలు వింటుంటే కమలకు చెప్పరాని ఆవేదన ఒడలు పట్టరాని సంతోషం వచ్చినవి. 'పిన్నిగారూ! పాపం ఎటువంటి సంసారం ఏస్థితికి వచ్చిందండీ. చిన్నపుడు నే నెన్నిసార్లు మీ యింట్లో పాలూ పెరుగూలతో అన్నం తినలేదు చెప్పండీ! ఇప్పటికీ జ్ఞాపకం వుంది. నాకు వంట్లో ఖులాసా లేదు. మీరు యీ యింట్లోనే వుండిపోతే నేనెంతో సంతోషిస్తాను' అని శాంతమ్మగారి నెంతో బ్రతిమాలుకొంది. ఒక పదిరోజులు శాంతమ్మగారు వండి పెట్టారు. కమల మళ్లీ మనిషయింది. రామం వేయి దేముళ్ళకూ నమస్కారం చేశాడు. కమల కెక్కడలేనీ వుత్సాహంవచ్చింది. శాంతమ్మ గార్కి కొత్త ముల్లుచాపులు తెప్పించింది. 'పిన్నిగారూ మీరు నాకెంతో సాయం చేశారు. ఇకనుంచీ మీరు పనిచేస్తే వల్లగాదు. ఈ యిల్లు వదలిపోవటానికి గూడా వల్లగాదు. మాకేం డబ్బుకు లోటులేదు. మీ వంటివారికి పెడితే పొయ్యేదీ లేదు. ఈ రోజునుంచీ యీ యింటికి మీరే పెద్ద' అని అంటుంటే శాంతమ్మగారు కమలను ఎన్నో విధాల దీవించింది.

'కమలా. నీవు మళ్ళీ జన్మ ఎత్తినట్లుంది కమలా. నాకెంతో సుఖంగా వుందిప్పుడు. పోయిన ప్రాణం బ్రతికించింది మీ పిన్నిగారు' అన్నాడు రామం.

'నిజంగానండీ. పిన్నిగారిని చూస్తే నా రోగం ఎగిరిపోయింది. ఎందుకండీ వెధవ పిల్లలు. పిల్లలెవరో తల్లులెవరో. తేల్లో,

(54-వ పేజీచూడండి)

జీవితపు ఆఖరి సోపానాలు

శ్రీ చిప్పకుల వెంకటసుబ్బయ్య

"ఇస్, అబ్బ" అంటూ మంచంమీద కూలబడ్డాడు రామారావు అప్పుడే బడినుంచి వచ్చి పైపంచదీసి మంచం తల వైపు పడేస్తూ.

"ఏమండీ! ఏమైంది." అని అడిగింది వంటింట్లో పిల్లాడికి అన్నం పెడుతున్న శాంత.

"ఆ! ఏముంది కావడానికి. కేవ్, కేవ్ మని చంటాడు అవిధంగా ఏడుస్తూంటే వాడికి పాలు పొయ్యక ఏమైంది, ఏమైంది అంటే ఏముంది కావడానికి. పాత పాటేగా! ఈరోజు గూడ రాలేదు" అని ప్రొద్దుగూకులు బడిలో పిల్లలతో తలపగుల గొట్టుకొచ్చిన రామారావు ఇంటివద్ద గూడ ఇదే పీడేనా అని మనస్సులో అనుకొంటూ కేక వేశాడు.

ఈరోజు పాలు లేవండీ! ఇప్పుడే పాల మనిషి వచ్చి ఎన్నిరోజులమ్మా! ఆగే ఉంటేది. ఇప్పటికి రెండు నెలలయినా డబ్బు ఇవ్వకపోతే ఎట్లాగని పాలు పోయకుండా పోయిందండీ!" అని గద్గదస్వరంతో సమాధానం ఇచ్చింది భర్త మనస్సులోని ఆవేదనను తెలుసుకున్న శాంత పిల్లవాడిని చేతిలోకి తీసుకొంటూ.

"అయితే, ఈపూట కాఫీ లేవుగా-కాసిని మంచినీళ్లయినా తగలెయ్యి." అన్నాడు తన చంటి పిల్లాడికి పాలు సంపాదించలేని తన జీవితాన్ని గురించి విచారపడుతూ.

"ఇదిగో. త్రాగండి" అన్నది శాంత మంచినీళ్ళ గ్లాసు అందిస్తూ.

భార్య చేతిలోనున్న పాపనుచూచి "ఏం, బాబూ" నీకు పాలుగూడ తేలేక పోతిని గదా అని బాధపడుతూన్న మనస్సుతో మంచినీళ్ళు కూడా త్రాగలేక పోయాడు రామారావు.

"పిల్లవాడు చేతిలో నిలవడంలేదు. మరెక్కడయినా కాసిని తీసుకొనివస్తారా" అన్న భార్యమాటలు విని "నాలుగు సంవత్సరాలనుంచి పనిచేస్తున్న ఈ గ్రామంలో కాసిని పాలు తీసుకొని రాలేకపోతానా?" అని తన మనస్సును ధైర్యపరచుకొని గడప దాటి బజార్లో పడ్డాడు.

కొంతదూరం తలవంచుకొని నడుస్తూ ఎవరిని అడుగుదామా అని ఆలోచిస్తున్న రామారావుకు "ఏమండోయి, మాష్టరు గారూ!" అన్న కేక వినబడేసరికి ప్రక్కకు తిరిగిచూచాడు. తనతో ఈ నాలుగు సంవత్సరాలనుంచి ఒక్కసారైనా ఒక్క మాట మాట్లాడని పేరయ్య ఎడమచేతితో బొర్ర నిమురుకుంటూ కుడిచేత్తో నోట్లోని చుట్టను పార్లిస్తూ తన మేడ వాకిట్లో నిల్చొని ఈయనను ఆహ్వానిస్తూన్నట్లుగా అదో రకంగా చూస్తున్నట్లు కనబడ్డాడు. "ఊర్లోకల్లా కొంచెం పెద్దమనిషి కదా" అనుకుంటూ మేడలోకి పోయాడు రామారావు.

"ఏమండి, ఎక్కడిదాకా." అని చుట్ట దమ్ములాగి గాలిలోనికి పొగవదుల్తూ అడిగాడు పేరయ్య.

"ఆ, ఇక్కడికే కొంచెం పనుండి పోతున్నాను" అని అన్నాడు రామారావు లేనటువంటి చిరునవ్వు నొకదానిని తెచ్చిపెట్టుకొని.

"ఏం చెప్పగూడదా ఏమిటి?" అన్నాడు పేరయ్య ఒక వికటపునవ్వు నవ్వుతూ.

"ఏమిలేదండి, డబ్బులకు కొంచెం ఆలస్యమయిందని పాలమనిషి పాలు పొయ్యలేదట ఎక్కడన్నా కాసిని పాలు తెస్తామని పోతున్నాను." అన్నాడు రామారావు.

"పాలకోసం ఎక్కడికో ఎందుకయ్యా మా యింట్లో అడిగితే కాసిని ఇవ్వక పోయామా" అంటూ పేరయ్య తమ ఇంట్లో పనిచేసే సుబ్బడిని పిల్చి "ఒరేయ్, మాష్టరు గారికి చెంబుతో పాలు తెచ్చియ్యి" అని హుకుం జారీచేశాడు.

"కొంచెం ఆలస్యమవుతుంది దొరగారూ" అంటూ లోనికి పొయ్యాడు సుబ్బడు.

"నా...తో... ఏ...దో... ప...ని వచ్చిందే మీకు?" అని అన్నాడు రామారావు పిల్చిన పని ఏమిటో తెల్సుకుందామని.

"ఆ, ఏమిలేదు నీవు ఈ ఊరువచ్చి ఎన్నాళ్ళయిందో తెలుసుకుందామని?" అన్నాడు పేరయ్య.

"నాలుగు సంవత్సరాలండీ" అన్నాడు రామారావు తనకు ఏమైనా ట్రాన్సుఫరు తెప్పిస్తాడేమోనని భయపడుతూ.

"అయితే మా వూరివాడిక్రింద లెక్కేనన్నమాట."

"ఏ ఊరయితే ఏమిలెండి జీవితం గడవడానికి. మాబోటి వాండ్లకు ఒక ఊరు ఒక పల్లె అని ఏముంది. పైవారికి దయవచ్చి నట్లల్లా మారుస్తుంటే అక్కడికల్లా మేము మా పిల్లలు పిల్లికూనల్లాగ తిరుగుతుంటాము." అని "మీరు పిల్చిన పని చెప్పారుగాదు?" అన్నాడు రామారావు.

"ఏమి లేదు. నీకు తెలిసే ఉంటుందనుకొంటాను వచ్చే నెలలో పంచాయతీబోర్డు ఎన్నికలు గదూ. దానికి నేను ప్రెసిడెంటుగా నిల్చుందామనుకొన్నాను. కనుక మీరందరు సహాయం చేయాలి."

"మీబోటి వాండ్లకు మాబోటి పొట్ట గడవనివాండ్లం ఏమి సహాయం చేస్తామండి" అన్నాడు రామారావు పేరయ్య ఓట్లు వెయ్యమని అడుగుతున్నాడని మనస్సులో అనుకొని.

"పేద గొప్ప అని వ్యత్యాసం ఏముందండి. బ్రహ్మ అందరినీ ఒకేరకంగా సృష్టిం

(53-వ పేజీ చూడండి)

ఆంధ్ర మాతా వ్రతం

"ఉషఃకాల చైతన్యస్వామి విశ్వప్రాంగణ ద్వార బంధానికి అరుణరేఖల నంటిస్తున్నాడు." "ఆయన్ని చూచి అరవిందాలన్నీ పకపకా నవ్వుతున్నాయి." ఆ ఉషానాథుని అపహాస్యంచేయటం తుమ్మెద రాయిళ్ళకు నచ్చలేదు. నిద్రమొగాల్లోనే వేగంగా పర్వెత్తివచ్చి, అరవింద కన్నెల గండయుగాలను కరిచేస్తామని, సింహగర్జనలు చేస్తున్నారు. ఈ దృశ్యం చూట్టానికి, అప్పుడే ఇల్లువదలి బయలుదేరిన బాతులజంట, నీళ్ళు అలసిపోతాయేమో అనుకొంటూ, కాళ్ళకు బాధ కలుగకుండా, తమ మందాకినీ గమనంతో ప్రయాణం చేస్తూ వస్తున్నాయి. అప్పటికే కొందరు కుసుమకన్నెల పరాభవించిన భృంగారావులు ఈ జంటనుజూచి, సిగ్గుపడి మరోచోటికి మెల్లగా ఏమీ తెలియనట్లు వెనుకకు చూడకనే వెళ్తున్నారు. అచ్చటచ్చట మత్స్యకాంతలు తళుక్కుమని మెరుస్తూ వీరికి స్వాగతమిచ్చి దాక్కొంటున్నాయి. తీరమునగల తుంగకాడలు వీరిని చెదరిస్తున్నట్లు ఊగుతూ ఆనందాశ్రువులను రాల్చుతున్నాయి. అచ్చటచ్చట బక స్వాములు సంతతధ్యాన సముద్రములో మునిగియున్నట్లు నటిస్తూ కొత్త పెండ్లికూతురుచూపులు చూస్తున్నారు. గర్భాలయంలో నంబిగారి మంత్రోచ్చారణవలె మండూకేశ్వరులు గుంపులు గుంపులుగాజేరి పనస వల్లించుకొంటున్నారు. ఈ నాటకాన్ని చూస్తూ కట్టపైనున్న మర్రిచెట్లు రెండూ తెగ నవ్వుకొంటున్నాయి - అప్పుడే వేకువ దైనందిన కృత్యాలు నిర్వహించుకొని, కుంభకోణం బిందెల చంకల నిడుకొని, వయ్యారపు మందమరాళ నృత్యగమనంతో చెరువు మీదకు దాడి వెడలారు - ప్రాత కోడళ్లూ, క్రొత్త అత్తగార్లూ! - "స్వామివారి పనైందేమో తన ప్రయాణాన్ని సాగించి సంతోషంతో బయలుదేరారు. మట్టి బుర్రల్ని మరమ్మతుచేసే ప్రచారకులరీతి, బిందెలపై ఇసుకేసి కాంతి వచ్చేదాకా తోమేస్తున్నారు కథానాయికలు - పనితోనే సంభాషణలు సాగుతున్నయ్ ఆ తటాక రంగంపై.

"భ్రమరాంబగారి జానకి ఇంకా రాలేదేం! బామ్మగారూ!?"

"ఏమోనమ్మ! ఆమె ఇంక మేలుకుందంటావా ?"

"ఏమైనమ్మ! ప్రతిరోజు ఆలస్యంగానే వస్తుంటుంది. - ఏంపనో! ఏమో!

పదిమంది పిల్లల తల్లికైనా తీర్తుంది గాని, ఆమెగారికి మాత్రం తీరుబడుండదు."

"ఆఁ...చదువుకొన్న రాణీగార్లందరింతే!"...అని ఒక వృద్ధగొంతుక వినిపించింది.

"ఎంత చదువుకొంటే మాత్రం యింత సోమరితనమా ? మరీను!"...అన్నది ఒక పాతకోడలు-

శ్రీ రాళ్ళబండి రామకోటీశ్వరరాజు

"అసలు మీకేం తెలుసు? ఆ సంసారాన్నంతా అప్పుడే బుట్టలో పెట్టేసింది అమ్మగారు ?" అన్నారు ఒక కొత్త అత్తగారు.

"పని తీరితేసరి ! ఒకటే పుస్తకాలు - ఒకటే చదువు!" అనేసింది ఒక వితంతు యువతి—

"రోజుకు డజను సార్లైనా తల దువ్వేస్తుంది !" అన్నదొక పతివ్రతాలలామ.

"అదిగో! దయచేస్తూంది దొరసానిగారు! అన్నదొక పుబుసుపోని నడిముత్తెదువ - సినిమా ప్రారంభించేసరికి ప్రేక్షకుల తలలన్నీ తెరవైపు తిరిగినట్లుగా, - కథానాయికల తలలన్నీ వెనక్కు చూశాయి - బిందె చేత్తో పుచ్చుకొని, మంద మరాళ గమనంతో వస్తుంది జానకి - ఆమెపాదములు సమీపించిన కొలది, ప్రేక్షకుల దృష్టులు మారిపోతున్నాయి. మూతులు తిరుగుతున్నాయి. చేతివ్రేళ్లు వాటంతటవే బుగ్గలను నొక్కేస్తున్నాయి - కళ్లలోని నల్లపాపలు మౌన సంభాషణల సాగిస్తున్నాయి. కొందరి పనులు వేగంగా సాగిపోతున్నాయి. జానకి సమీపించి ఇంత ఇసుకతీసికొని తన దైనం దిన కృత్యాన్ని మెల్లగా సాగించింది.

అసెంబ్లీ భవనంలోని ప్రతినిధులకు, విచర్చనీయాంశం ముందు బయటికి తీయాలా ? అని ఆలోచిస్తున్నట్లు, అందరి తలకాయల్లో, ఆలోచనలు గిర్రున తిరుగుతున్నాయి. - "ఎవరు ముందు ప్రసారం ప్రారంభం చేస్తారో? - అని ఒకరి దృష్టులు మరొకరి దృష్టులతో పోట్లాడుతున్నాయి- చివరి కెలాగైతేనేం! నాటకం ప్రారంభించింది. క్రొత్తత్తగారైన గౌరమ్మగారు.

"ఏవమ్మా! జానకీ! ఇంతాలస్యమైందేం ?"

"వొంట్లో బాగా లేదేవోఁ...!"అన్నది శేషమ్మగారు.

."పెందలాడి మెలకువ రాలేదేవోఁ"! అన్నారు గంగమ్మగారు.

"పనితీరలేదేమో...! అన్నది మంగమ్మగారు.

"అన్ని మాటలూ మీయే నట్రా! ఆమెను చెప్పనీయండి?" అన్నది పండుముత్తైదువ వెంకమ్మగారు.

"చెప్పనీయక మేమేం అడ్డువొచ్చాం?" ...అన్నది వితంతు యువతి రంగమ్మ.

"ఓయబ్బ! మీదంతా మరీ బూటకమే...! చెప్పనీయండామెను!" అన్నది గౌరమ్మగారు - జానకి ముఖం వెలవెల బోతోంది - తన కాలస్యమైతే వీరందరి కేం - అని మనస్సులో అనుకొని, జవాబు చెప్పడం తన విధ్యుక్త ధర్మం గనుక-"ఇవాళ కొంచం ఆలస్యం ఐందండీ" అన్నది.


"ఇవ్వాళేం! రోజూ ఆలస్యంగానే వస్తున్నావుగా!"అన్నది జడ్జిమెంటు చేస్తూ గౌరమ్మ.

"ఆఁ...ఇంట్లో పని తెమలటల్లేదండీ!"

"ఏంఁ...? మీ అత్తగారు ఏపనీ చేయరా ?"

"ఎందుకు చేయరు! - ప్రొద్దున్నే మా వారికి కాఫీ పెట్టాలి; వారిని ముస్తాబుచేసి, స్కూలుకు పంపేసరికి ఆలస్యమౌతుందండి."

"ఇదంతా విడ్డూరంగాని, మనం మాత్రం ఏమంత ఎండెక్కి కాఫీ త్రాగుతున్నాం గౌరమ్మత్తా!" అన్నది శేషమ్మగారు.



"త్రాగడం లేదంటున్నానా! మా వారికి అరున్నరకే అవ్వాలి, ఏడింటికే వారి స్కూలు, అందుకని పోరిపనే సరిపోతుంది యివ్వాళదాక."

"అఁ...ఎవరెవరి తాహతునిబట్టి వాళ్లు కుని సెగ్గించుకొంటుంటారు - అని బిందె మోకాలిపైకెత్తుకొని, "కాస్త బిందెత్తమ్మా జానకీ?" - అన్నది వెంకమ్మగారు - జానకి చేతులు కడుక్కొన్నీ, బిందెత్తింది - అసలే వెంకమ్మగారు అజానుబాహురాలు. జానకి మామూలు మానవాంగన - బిందెత్తడంలో బిందెలోని నీటికికూడా జానకిపై కక్షేమో! కొంచెం వొలికి వెంకమ్మగారి భుజాన్ని పడ్డై.

"ఇదేం వయ్యారమమ్మోయ్? బిందెత్తడంలోనూ నాజూకేనా?", అన్నది గౌరమ్మ గారు.

"వాళ్ళూరునుంచి నేర్చుకొచ్చిందిలే!" అన్నది శేషమ్మగారు.

"ఏ సినిమాలో చూసి నేర్చుకొచ్చావమ్మా!" అన్నది వితంతు రంగమ్మ.

"ఇంకొంచమైతే బిందె జారిపడేదే!" అన్నది నడిగారు ముత్తైదువ.

"పడితే ఆమెకేం?...అసలు బిందెత్తమనడం మనదే తప్పు - మంగమ్మగారి అభిప్రాయం.

"ఓ...య్! మీయన్ని వైనాలుగాని, కొంచెం నీళ్ళు చిలికి మీదపడితే ముక్కముక్కలౌతారా!" అని ప్రయాణమైంది పండుముత్తైదువ వెంకమ్మగారు.

మళ్లీ ఒక్కసారి మూకాభినయం ప్రారంభమైంది. మూతివిరుపులు, రోషంగా బిందెలు కడిగేస్తుంటే గాజుల గలగలలు, - నేత్రసంభాషణలు - బిందెలు నీళ్లు త్రాగుతుంటే వినిపించే జలతరంగిణీ ధ్వని- నేత్రానందం, కర్ణానందంగా జరిగిపోతున్నాయి - జానకి మాత్రం మామూలుగా తనకు తగిన బిందెను నింపేసి, "వస్తానండీ!" అని మెల్లగా బయలుదేరింది - జానకి నడకలు ముందుకు సాగినకొద్దీ కథానాయికల అభినయం హెచ్చౌతోంది. చేతులు త్రిప్పడం, తలలాడించడం, జానకి నడకను అనుకరించిచూపడం, జరుగుతున్నాయి. జానకి మొదట కథానాయికలకు కనుపించిన ప్రదేశం చేరి... మెల్లగా నడుస్తోంది.

"చూశావులే ఆనాజూకు నడక" - అన్నది గౌరమ్మగారు.

"ఆ వొయ్యారం! ఆ కులుకు! ఆ జడ! అవన్నీ సినిమాలో చేరే భోగంవాళ్ళగ్గాని, మనసంసార్లకెందుకు?" అని ఏకరువు పెట్టింది శేషమ్మగారు.

"అదేందో! నడుస్తూ తప్పుల్లే చెం

★ ఆంధ్రమాతావ్రతం ★

గన్నాపై కెగట్టదు మరీ-ను”! అన్నది నడి గారు ముత్తైదువ.

“ఆ...! అమ్మగారి కాళ్లకు బండాలు పడితేగాని, ఆ నాజూకు అణగదు.” అన్నది వితంతువు.

“అందరితో కలసికట్టే నామోషీ కొమాల్సు బోరసానికి!” అన్నది గౌరమ్మ-

“మనకంటె అలస్యంగావచ్చి, ముందె ళ్తోంది చూశారూ! దాని చాకాయితనం!” అన్నది శేషమ్మ-

“మనమేనా తక్కువతిన్నది! ఎలావుం దన్నుందో పోదాం పదండి!” వితంతు వురూచ - బిందెలు ఒక్కొక్కటిగా పైకి లేచాయి - ఒక చేయి బిందెకు, మరో చేయి



S. 204-50 TL

భార్య:- ఏమండీ, దణ్ణెం మీద వున్న యీ సిల్కుచీర కట్టుకురానా, బీచికి?

భర్త:-దణ్ణెం మీదవున్న చీర తియ్యట మెందుకే? (నెమ్మదిగా)...కాకపోయినా —ఆచీర అక్కడ వుంటేనే బాగుంటుంది.

నడుముకు కట్టి, బృందావనంలోని గోపికలల్లే చక చక సాగిపోతున్నారు. సూర్య భగవాన్ ఇంకా కొంచం ముందుకు వచ్చి వీరిని చూచి నవ్వుతున్నాడు. బిందె లన్నీ ఒక్కొక్కటి జానకిని ఓరచూపులు చూస్తూ, ఒంటెల అంగలంత అడుగులేస్తూ జానకిని దాటిపోయాయి. జానకికి అంతా అయోమయంగావుంది. “అనవసరంగా వీరందరికి నాపై కక్షెందుకు?” అని మనస్సులో అనుకొంటూ నడుస్తోంది. దారిలోని రాతికూడా జానకంటే ద్వేషమే కాబోలు! ఒక వుబుసుపోని, రాయి జానకి కాలిని కరిచింది. “థన్” మని బిందె పడి పోయింది. ముందు పోయిన బిందె లన్నీ, వెనక్కు తిరిగి ఫక్కున నవ్వాయి - ఏదెట్లున్నా గౌరమ్మగారు మాత్రం గబుక్కున బిందె దించుకొని, పరుగెత్తుకొచ్చి, “దెబ్బతగిలిందమ్మా! అని లేవనెత్తింది-

“లేదండీ!...రాయి తగిలిందంతే!...

“అయ్యో! బిందెకు పెద్ద చొట్టే పోయిందే! - బంగారంవంటి బిందె -” గౌరమ్మగారి సానుభూతి.

“ఆఁ...అంత నాజూగ్గా నడిచే బిందె పోతుంది; నడుముల నొప్పులు పోతాయి - శేషమ్మగారి పరామర్శ.

“అంత అలవాటు లేకపోతే నౌకర్ని పెట్టుకోగూడదు.” మంగమ్మగారి మర్యాద.

“మీదంతా విడ్డూరంగాని, కుచ్చిళ్లెగట్టక నడిస్తే ఎందుకు పడరూ!” వితంతుగారి విమర్శ.

“ఆఁ...ఈచదువుకున్నోళ్లంతా యింతే- ఒక్కపనీ రాదు - విపని చేయబోయినా యింతే” - నడిగారు ముత్తైదువ స్రుతాభావం.

మళ్ళీ బిందెలు సాగిపోతున్నాయి. యీసారి పకపకలు - వికవికలు - పాద ఘట్టన ధ్వని, అన్నీ జానకి హృదయానికి సూదుల్లా గ్రుచ్చుకొంటున్నాయి. పరాభవ కోలాహలం మనస్సును మోస్తోంది -

రెండు అశ్రుబిందువులు వాటంతటవే చెక్కిళ్ళ క్రిందకు జారివచ్చాయి - నీరవా, నిర్నిమేష నేత్రాల్లో బిందెను పుచ్చుకొని, వెనక్కు తిరిగి మరో బిందెడు తీసికొని ఇల్లుచేరింది - భ్రమరాంబగారు చాలా ఆత్రతతో బిందె ముఖం చూచి,

"అదేం దమ్మాయీ!"

క్రిందపడ్డా నత్తయ్యా!"

"దెబ్బ తగలేదు గదా!"

"లేదులెండి!" అని ఇంట్లో కెళ్లింది గాని, కాలి మణికట్టు బెణికిందని బిందె దించాకగాని, గ్రహించలేకపోయింది.

* * *

"స్వామీజీ పదిమెట్లన్నర ఎక్కారు." గడియారాల్లో చిన్నముళ్ళు పదికేసి, పెద్ద ముళ్ళు ఆరుకేసి చూస్తున్నాయి. వూళ్లో పశువులన్నీ చెంగనా లెత్తుకొంటూ క్షేత్రాల వైపుకు పరుగెత్తుతున్నాయి. వీధిలోని ధూమ్రం పొగమంచులా లేచి సుళ్ళు తిరుగుతోంది. పశువుల పేడకోసం అమ్మలక్కలు విరుగబ్రొక్కుకుంటున్నారు. ఎలిమెంటరీ స్కూలు పిల్లలు సంచులు భుజాలపై వేసికొని వల త్రెంచుక బయటపడ్డ లేడిపిల్లలా వెనక్కు చూడకుండా పర్వెత్తి వస్తున్నారు. "కరుణాకరరావు పిల్లకాయల్తో బుర్ర బద్దలుకొట్టుకొని, చెమటలు గ్రమ్మిన ముఖంతో నీమసున్నం చేతులతో అలసి సొలసి వచ్చాడు. పాదప్రక్షాళన మొనరించి, పడకకుర్చీపై ఆశీనుడయ్యాడు. తల్లి భ్రమరాంబ పొతగుడ్డలకు ప్రాణం పోస్తోంది. శ్రీమతి కింకా తన యజ్ఞశాలలోని "పాక యజ్ఞం" పూర్తిగానట్టుందని, గత వారపత్రిక తిరగేస్తున్నాడు - గడియారంలోని పెద్దముల్లు తిన్నగా 12 దగ్గర కెళ్ళింది - టంగ్ - టంగ్. టంగ్. పదకొండుసార్లు గడియారం మ్రోగింది.

"వడ్డించానులెండి?" శ్రీమతిగారి ఆజ్ఞ; లేచాడు. కాని శ్రీమతిముఖం పరాభవ రోషాగ్నిచే సెగలు గ్రక్కుతోంది. కంఠంలో అదోరకమైన జీరను కనిపెట్టాడు. ఏదో విప్లవం లేచిందనుకొన్నాడు. బహుశా అత్తాకోడళ్లరభసేమోనని అనుమానించాడు. అపరాధపరిశోధకుడికి మల్లే అన్నీ కనిపెడుతున్నాడు. దేవి కాలిమణికట్టు బంధింపబడి వుంది. ఎదురుగా బిందె ముఖం ఏడుస్తోంది. అనుమానం కొంతవరకు పటాపంచలైంది. భోంచేస్తూ శ్రీమతి ముఖకవళికలను కొత్తపెండ్లికొడుకు కనిపెట్టినట్లు కనిపెడుతున్నాడు. కలువ పూవుల్లాంటి ఆమెకళ్ళనుండి, బిందువులు ముత్యాల్లా జారి ఆమెకటిద్వయాన్ని స్పర్శిస్తున్నాయి. పెదవులు వణకుతున్నాయి. ముఖం అర్ధగ్రహణ చంద్రుని జ్ఞప్తికి తెస్తోంది. ఆమె నాశికాగ్రం ఎర్రబడింది. మధ్య మధ్య, ఉష్ణనిశ్వాసములు బయటికివస్తున్నాయి. బాధపడే మనస్సుతో, అసంతృప్తిగా భోంచేసి, గదిలోని మంచంపైకి చేరాడు. అతని భావనా ప్రపంచంలో, అల్లకల్లోలంగా అనేకమైన వూహాలు పరువు లెత్తుతున్నాయి. పావు గంటలో తాంబూలపాత్రతో శ్రీమతి ప్రత్యక్షం—త్వరగా లేచి చేయిపట్టుకొని మంచంపై కూర్చోబెట్టాడు- "ఏం జరిగింది జానకీ?" - జానకి పొంగివచ్చే దుఃఖాన్ని దిగమ్రింగుతూంది. కాని నయనాంచలముల నుండి అశ్రుధారోదకము ఎక్కువగా ఖర్చౌతోంది - ఆగలేక పోయాడు- "చెప్పు! నీకేం బాధకలిగిందో! నే నుండగా నీకు భయమెందుకు?" జవాబులేదు......"క్రింద పడ్డందుకేనా నీకీ ఏడుపు. ఛీ ఛీ. క్రింద పడితే ఏడుస్తారా! ఏదో కాలు జారి పడుంటావ్? ఇంతమాత్రానికేనా?— జానకి తలకాయ త్రిప్పింది.

"మరెందుకీ విచారం?" మా అమ్మేమైనా అన్నదా?" మళ్లీ తలకాయ త్రిప్పింది.

"మరేంటో చెప్పు? నే తీరుస్తాగా?" జవాబులేదు. "మీవూరెళ్తావా"? తలకాయ త్రిప్పింది- "అబ్బ విసిగించకు! చెప్పకపోతే నామీద ఒట్టు? - జానకి వణికే కంఠంతో దుఃఖాన్ని దిగమ్రింగుతూ, క్లుప్తంగా చెప్పేసింది.

"ఓశ్...దీనికేనా! ఇంత రభస. నే నేందో కొంపమునిగిందనుకొన్నాను."

"ఈ పరాభవానికి ప్రతీకారం చేయాలి?" అన్నది దుఃఖరోషపూరితమైన ధ్వనిలో-

"చూడు జానకీ! ఇది బస్తీ - పల్లెగాని గ్రామం. ఇక్కడుండేవాళ్లందరు చదువులు వచ్చిరానివాళ్ళు - వీళ్ళందరి తలకాయలు మార్చాలంటే మన సాహిత్యాలేమీ అక్కరకు రావు. వీళ్ళ క్కావలసింది మంత్రాంగం—అయినా మనం వీళ్ళతో విరోధం పెట్టుకోకూడదు - విరోధం పెట్టుకొంటే నూరు కాకుల్లో ఒక కోకిల బ్రతుకే—చూడు! కొద్ది రోజుల్లో వీళ్ళ తలకాయ లెలా త్రిప్పుతానో!"

"ఎలా త్రిప్పుతారేంటి?"

"ఎలానో! ఎల్లుండి తీతాలొస్తాయి— చూస్తావుగా!"

"వూఁహూ - చెప్పాల్సిందే!"

"పిచ్చిదానా! చూడు!" చెవిలో చెప్పాడు.

"అమ్మాయీ! జానకీ!" అంటూ భ్రమరాంబ గదిలోకి వచ్చింది. జానకి సిగ్గుతో లేచింది- "పక్కింటి బామ్మగారు వచ్చింది. ఆ మొల్లరామాయణంలో మిగిలినది చదువుదువుగాని రా-మ్మా!" అని వెళ్ళిపోయింది.

"వస్తున్నా పదండత్తయ్యా!" అని ఆమె వెనుకనే సంతోషంతో వెళ్ళింది -

కరుణాకరరావు మాగన్నుగా నిద్రపోతుంటే - బయట వరండాలో నుంచి "అప్పుడు అశోకవృక్షముపైనున్న ఆంజనేయుండు సీతతో నిట్లనిగొ - వున్నాడు

★ ఆంధ్రమాతా వ్రతం ★

తెన్ను రాఘవు డున్నాడిదె......” అని విని పిస్తుంటే హాయిగా నిద్రపోయాడు.

ఈ కథాంశం జరిగిన మూడో రోజు మధ్యాహ్నం కథానాయికలు గౌరమ్మగారి వరండాలో సభచేశారు. సూర్యుడు కోపావేశంతో చూస్తున్నాడు. చెట్లలోనుండి ఒక్క పిట్టైనా బయటికి రావడంలేదు. మహిళామండలిలో నున్న స్త్రీలకౌ య

రాణులు తాటాకు విసనకర్రలతో యుద్ధం చేస్తున్నారు. అన్ని చర్చనీయాంశాల్లో ముఖ్యమైన పాకశాస్త్ర చర్చనీయాంశం ప్రారంభమైంది—"మీదేం కూరమ్మా!... వడియాల పులుసు - పొట్లకాయ పచ్చడి... కొందరు వున్నవి, లేనివి కల్పి నోరూరేటట్లు మాట్లాడుతున్నారు. ఇంతలో పచ్చీస్ పట్టా పరుగెత్తొచ్చి - రెండు టేబుల్ సమావేశంలా కూర్చున్నారు, ధస్,—...ట్రీఫ్... చేదా...మూళ్ళక్కాయ చచ్చు...నాళ్ళక్కాయపంట...ఇత్యాది నిర్వచనాల్తో, చాలా రసవంతమైన నాటకం జరుగుతోంది - మధ్యమధ్య పందాలు పడనివారు చేతివేళ్ళు పెటపెటా విరుస్తున్నారు. గవ్వలు విసిరివేస్తున్నారు - లోలోన కుళ్ళిపోతున్నారు - "హుం......ఒక్క పందెం పడదాయె?" అంటోం దొక సీమంతిని—

"నే పుట్టాక ఇంత వెధవాట ఎన్న డాడలేదమ్మా!" అన్నదొక గజకాయిని.

లేచి, చోటుమార్చి కూర్చుం దొక ముత్తైదువ - పందేలు పడేవారు లోలోన ఆనందంతో వుబ్బి తబ్బిబ్బై పోతున్నారు.

ఇంతలో జానకి కుంకుమకాయ తీసికొనివచ్చి, ముత్తైదువ లందరికీ బొట్టు పెట్టింది - "అమ్మా! మీరంతా చెప్పలేదనకుండా ఇంకో గంటకు దయయుంచి, మా యింటికి రావాలి?" "ఆంధ్ర మాతా వ్రతం" చేసికొంటున్నాను. తప్పక రావాలి!!" అని అందరకూ పేరు పేరొరసన చెప్పి వెళ్ళింది - ఆమె వెళ్ళుటతో నే-గౌరమ్మగారు –

"ఏం వ్రతమే శేషమ్మా?"

"ఆంధ్ర మాతా వ్రతమట!"

"ఇదేం విడ్డూరమే! ఈమా టెప్పుడూ వినలేదే!"

"ఏమో! నడమంత్రపు కాలం! రోజో వేషం! రోజో వ్రతం!"

"ఏ-మోనమ్మ! ఇదివర కెప్పుడన్నా, శ్రావణ మంగళవారపు నోములు, శుక్రవార పూజ, గౌరిపూజ, గుమ్మడికాయల వ్రతం, వరలక్ష్మి వ్రతం, ఇటువంటివన్నీ చూశాం, చేశాంగాని, ఈ మాయదారి వ్రత మేంటమ్మా!" అని వుపన్యాసం చెప్పింది గౌరమ్మగారు.

"అవును - ఈ మాయదారి ఆడాళ్ళకు చదువు లొచ్చినప్పటినుండి, భక్తీ-భయము ఏమీ లేవు - ఆంధ్రమాతా వ్రతమట-ఆంధ్ర మాతా వ్రతం - ఎవరమ్మా ఈమె?- అంతు తేలకుండా వుందే! ఈ దేవర పేరు? అన్నది నడిగారు ముత్తైదువ.

"అఁ...దేవర - దెయ్యం - యిదేదో నడమంత్రపు నోముగాని, దీనివల్ల పుణ్యము పురుషార్థము వుంటుందంటావా మంగ

మెయ్యదినా!" అన్నది శేషమ్మగారు.

"చూశావా! కొత్త ముత్తైదుగదా! ఆ కాళ్ళక్కడియాలు, మెట్టెలు తీసిచూడు - ఎలా మెరుగరాయిడిలా తిరుగుతుందో!" అన్నది తన భాగ్యాన్ని తలచుకొంటూ రంగమ్మ.

(55-వ పేజీ చూడండి)

ఈ మగవాళ్ళూ..?

ఆరోజు కథ రాయడానికి కూచోకపోతే ఈ అవాంతరం వచ్చివుండేది కాదేమో? ఏమయినా, అది ఒక్కటే కారణం అనడానికి వీల్లేదు. అది రిపబ్లికు 'డే' అవడం, నా భార్య క్లబ్బుకి టీపార్టీకి వెళ్ళడం, నేను యింట్లో ఒక్కడినే వుండడం, ఇవన్నీ కలసి ఎప్పుడూ మరపురాని రోజుక్రింద చేశాయి. నాటినుంచీ, కథ లెప్పుడూ రాయకూడదని, వొట్టేసుకున్నాను; తెలియనివాళ్లతో మాట్లాడకూడదనుకున్నాను. మంచి ముఖము చూసి మోమాట పడకూడదనుకున్నాను. పాలు పొంగేక నీళ్లు జల్లితే ఏం లాభం!

రిపబ్లికు ఎప్పుడు వచ్చిందో కాని, మన రాజ్యాంగ విధానంలోవున్న ఆశయాలన్నీ ఆచరణలో పెట్టింది మా ఆవిడ. సమాన హక్కులు. స్త్రీ పురుష విభేదాలు లేవు. అందరూ ఒకటే...ఇంకా ఏవోఏవో...

'నేనుక్లబ్బుకు వెడుతున్నా. ఇంట్లో వుండండి' అంది.

'ఆ' అన్నాను.

"మీతోనే. 'అలా మాడకండి. మీరు రిపబ్లికు పెరడు'కు పొద్దున్న వెడితే నేను అలా చూశానా! అలా చూస్తారేం? నాకు బైమయిపోయింది వెడుతున్నా." అంది.

"నేనూ క్లబ్బుకు వెడదామని అనుకున్నా" అన్నాను.

"సరే వెళ్ళండి" అంది చీర చెంగిళ్లు సవరిస్తూ, వీధివైపు నడుస్తూ.

"మరి ఇంట్లోనో"

"అదేమో" అంది, కళ్లు కొంచెం పెద్దవి చేసి, ఇంకో అడుగు వేస్తూ.

శ్రీ కె. శ్రీరామమూర్తి

'భేష్' అన్నాను.

రెండో రిపబ్లికు 'డే'కు ఇంత విప్లవం వస్తుందని నేను కలలోకూడా అనుకోలేదు. ఎలక్షను ఫలితాలు కూడా ఇంత షాకు ఇవ్వవు.

"మరి" అన్నాను.

చిరునవ్వుతో నన్ను ఆశడం, రిక్షా వెళ్ళిపోవడం, ఒసారే జరిగాయి. పడకకుర్చీలో జేరపడి 'ఏంప్రపంచం' అనుకుంటూ షాకు మరల్చుకోడానికి సిగరెట్టు అంటించేను. ప్రసిద్ధ రచయితలు, వాళ్ల జీవితాల్లో కొత్త అనుభవాలు కలిగినప్పుడే రసవత్తరమైన కథలూ, రచనలూ రాశేరుగదా, మనకీ ఇంత బలవత్తరమైన గుండెపోటు తగిలినప్పుడు కథరాస్తే దీనివల్ల మన కీపేరు వస్తుందని, కథ రాయడం మొదలు పెట్టేను. ఆలోచనలు దొర్లిపోతున్నాయి, కెనడా ఇంజన్లులా. సువాసనలు నన్ను చుట్టుముట్టితే మనస్సు మరల్చి కళ్లు తెరచి చిరుమంటను చూశాను. ఏలూరు తివాసీ చాలామట్టుకు బూడిదఅయి, నా గొప్పతనం ఎక్కడ పైకి వచ్చేస్తుందో అని పక్కా తెనుగుతనం పలకపోస్తూ కన్నెర్రతో నాకు హారతి ఇవ్వడానికి ప్రయత్నిస్తోంది. వెంటనే చేతిలో కలం జారవిడచి కాగితాలు విసిరేసి నేను గొప్పవాణ్ణి కాబోను. నువ్వు చల్లారు అని అభయహస్తమిచ్చి అణకువతో అణచివేసి, ఇంక ఇంట్లో వుంటే ఏమవుతుందో అని బట్టలు వేసుకొని ఇల్లు భద్రమని బంట్రోతుకు చెప్పి బయలుదేరేను. పార్కు దగ్గిరావచ్చేటప్పటికి వూళ్ళోకి వెళ్లే బస్సు రావడం, నేను ఎక్కడం, ముందు కెళ్ళండీ అని కండక్టరు కేకలు జరిగిపోయేయి. 'టిక్కెట్టు' అన్నాడు.

'ఎక్కడికని వాణ్ణి అడిగితే ఏం బావుంటుంది. పర్సుతీసి అణాన్నర ఇచ్చేను. టిక్కెట్టు వచ్చింది. అది ఇటూ అటూ చూస్తూనే వున్నాను. బస్సు జోరుగా పోతూనే వుంది, చిన్న చిన్న మకాంలు చేస్తూ.

'ముందు కెళ్లండి' అన్న కండక్టరు కేకతో నాకు చేతనం కలిగి, జరిగేను. 'థాంక్స్' అన్న మురళీనాదం వినపడడంతో, ఆమెను చూశాను. అది పరిచితముఖమే. కాని ఎవరో ఎక్కడో నిర్ధేశించలేక, మళ్ళీ చూస్తే అమర్యాద అని కొంచెం జరిగి ఖాళీ అయిన చోటులో కూలపడి కిటికీలోనుంచి అవతలికేచూస్తూ, ఆమెను చూడలేదనే సెపం రాకుండా తప్పించుకుందామనీ, తెలియకుండా చూద్దామనీ, అనుకుంటున్నా.

'నమస్కారం డాక్టరుగారూ' అందామె.

ఆ హోటల్లో సర్వింగ్ ఏమీ బాగాలేదు. ఒక పెద్ద మనిషి సర్వర్ కోసం గంటల తరబడి కనిపెట్టుకు కూర్చున్నాడు. చివరి కెప్పుడో ఒక సర్వర్ పూడిపడ్డాడు.

ఎక్కడలేని నవ్వు తెచ్చుకొని ఆయన మొఖం చేటంత చేసుకొని, "చూడు బాబూ! ఒక్కప్లేటు వుప్మా తెచ్చి పెట్టు... అన్నట్లు...యిటుచూడూ... అక్కడికెళ్లాక యోగక్షేమాలు తెలుపుతూ ఒక్క కార్డుముక్క మటుకు వ్రాయి!" అన్నాడు.

నేను మరచిపోయినట్టుగాని నా మందమతిగాని పైకి తెలియనీయకుండా, మళ్ళీ నమస్కారంచేసి పరిచయముఖం పెట్టేను.

"మీవారు రావడం లేదాండి" అందామె.

"లేదండి క్లబ్బుకు వెళ్ళింది" అన్నా.

ఆమె ఇల్లు నా పక్కవీధిలో అనీ, ఆమె M. A. అనీ, ఆమె భర్త యింజనీరు అనీ, నా భార్యకు స్నేహితురాలనీ, తెలుసుకోకలిగేను. బుర్ర ఎంత బ్రద్దలు చేసుకున్నా ఆమెను ఎక్కడ చూశానో గుర్తు రాలేదు. కొత్తగా ఈవూళ్ళో ప్రాక్టీసు పెట్టేరేమో. ఏమీ జ్ఞాపకంకు రావడం లేదు. ఇంతల్లో బస్సుఖట్టలషాపుదగ్గిర ఆగింది. నా టిక్కట్టు అంతవరకే వుండడంవల్ల దిగిపోయాను. ఆమెకూడా అక్కడే దిగింది. అయితే జనసమ్మర్దం ఎక్కువవుండడంవల్ల రెండు నిముషాలు కదలలేకపోయేం. ఏమీ తోచక బయలుదేరానంటే బాగుండదని బట్టలషాపు కన్నాను. "నేనూ అక్కడకేనండీ" అందామె. ఎదురుగా శేషను షాపు వుంటే అందులోకి దారితీసేను. మన డబ్బు చలవ పొందిన షాపువాడు; రండి డాక్టరుగారూ, రండి అమ్మగారూ' అంటూ జాయంటు ఆహ్వానం చేసేడు. నేను ఏమీ అనకుండానే, జరీ పంచలూ, పట్టు చీరలు మాముందు పడేశాడు. అప్పుడు వచ్చేయని మంచి జరీచాపు అని నాకు షాపువాడే నిర్ణయించేశాడు. ఆమె మాత్రం కొట్టులో వున్న పట్టుచీరలన్నీ తీయించి రెండు రెంగులు ఏరుకొని అంతిమనిర్ణయానికి నన్ను జడ్జీగా నియమించింది. నేనూ షాపువాడూ వాదించుకోనే పరిస్థితిలో పడ్డాం. షాపువాడు ఎరుపురంగూ, నేను మంచిగంధం రంగు తీసేము. మొత్తంమీద జడ్జీగావున్నందుకు నా రిపోర్టు ఫైనల్ అందామె; ఆంధ్రరాష్ట్రంగురించి జడ్జీ తీర్పులా తోసివేయకుండా. ఈ కాలంలో గవర్నమెంటు మధ్యవర్తులుగా జడ్జీలనువేయడం, వారితీర్పులను, అంగీకరించడం అంగీకరించకపోవడం గవర్నమెంటుకే వుందనడం మామూలైపోయింది. ఏమయినా, నాతోవున్న నారీమణి నా సెలక్షను ఫైనలు అంది కాబట్టి నాకేమీ న్యూనత జరుగలేదు. మళ్ళీ ధరదగ్గర ఆమెకీ షాపువాడికీ పేచీలు రావడం, ఫైనలుగా నేను ఎనభై ఎనిమిది రూపాయలు పదిహేను అణాలకు స్థిరపరచడం జరిగింది. ఇదంతా అయేటప్పటికి ఏడున్నర కావడం, వెంటనే పాకెట్లు తీసుకొని బస్సులో తిరుగు ప్రయాణం చెయ్యడం జరిగింది. ఆమె పార్కుముందు స్టాపులో దిగి వెళ్ళిపోయింది. 'ఎన్నో థాంక్సు అనీ, నా భార్యకు వందనాలనీ, నా టైము పాడుచేసినందుకు ఎక్స్క్యూజు చేయమనీ,' బస్సులో వున్నంతసేపూ చెపుతూనేవుంది. ఆడవాళ్లు మాట్లాడడం మొదపెట్టాలి కాని ఆ ప్రవాహానికి ఎక్కడైనా ఆపుదలవుంటుందా! అనుకుంటూ, ఓ నిట్టూర్పు విడిచి 'అమ్మయ్య' అని పార్కుదగ్గర దిగిపోయేను. మా ఆవిడ క్లబ్బునుంచి వచ్చివుంటుందా! ఇల్లు బంట్రోతుకు వదలి పెట్టినందుకు ఏమనుకుంటుందో, నా జరీ పంచల పేకెట్టు చేతిలో కనిపిస్తే మరీ ఆగ్రహానికి గురిఅవుతానేమో, డబ్బు తగలేస్తున్నానని లెక్చరు విశాలి కాబోలు అని చిత్తరమంటూ ఇల్లుచేరెను. తలుపు ఓరగా వుంటే నెమ్మదిగాతోసి, గదిలోకివెళ్ళి పేకెట్టు బీరువాలోపెట్టి లోపలికి వెళదామని గదినైపు మునివేళ్ళపై నడుస్తుంటేనే, 'ఎవరు వారు' అంటూ మా ఆవిడ రావడం, నా చేతిలో పాకెట్టు చూడడం వూడలాక్కోవడం, తాడు తెంపడం, కాగితం చింపడం ఒక్కసారి జరిగేయి. తళతళలాడుతూ ప్రత్యక్షం పేకెట్టునుంచి...... ఇంకేముంది నా కళ్ళు చీకట్లు. ఆ చీర ఓ చేతిలో పట్టుకొని నన్ను......అబ్బ ఎంత మంచివారండి...ఇంత సరీ ప్రైజు చేసేరే......అంటూ ఏవో ఏవో. నేను నిలువునా నీరయిపోయాను. తారుమారు ఎలాఅయింది. ఏమని చెప్పడం. ఎలా బోధపరచడం. ఆ సంతోషాన్ని అడ్డడానికి ఎవరితరం. ఎవరికి మనస్కొప్పుతుంది. రెండు మూడు సారులు, అది మందికాదని అని నాలుక చివరకు వచ్చింది కాని అక్కడే ఆగిపోయింది. ప్రళయాన్నీ ప్రేమనీ ఎవరు ఆకట్టుగలరు. ఎవరు ఆనకట్టు కట్టగలరు. మరునాటికి ఏదో ఆలోచన తోచక పోతుందా అన్న ధైర్యం ఆందోళనను ఓ మూలకు నెట్టింది. ఆమె జరీపంచలు చూసుకొని ఏమనుకుంటుందో. నా ప్రాణం చివుక్కుమంది. ఆమె ఇల్లు కనుక్కొని ఆ చీర ఖరీదు ఇచ్చివేసి క్షమాపణ వేడుకుందామని నిశ్చయం తప్పేటట్టు కనిపించలేదు. వేరు మార్గం ఏమీ లేకపోయింది.

మరునాడు ఆమె ఇల్లు అన్వేషణార్థము వెడదామని తయారవుతున్నా గదిలో.

"ఏమండో రావాలి రావాలి" అని మా ఆవిడ కేకలతో ఏ తేలు కుట్టిందో అని ఖంగారుతో చేతి బొత్తాలు పెట్టుకోకుండానే ఇవతలకు వద్దునుగదా, కొత్త చీర కట్టుకొని మా ఆవిడా, "బావగారూ, మీ బిల్లు ఇదిగో" అని ఆమె.

"మీరు చీర సెలక్టు చేసినందుకు 'థాంక్సు' చెప్పడానికి వచ్చిందండీ, నా క్లాసుమేటు విమల" అంటూ మా ఆవిడా, "ఏమే! మీ ఆయన ఎంత ఎక్స్పర్టు అనుకున్నావు! అని ఆమె నన్ను వుక్కిరిబిక్కిరి చేసేశారు. మళ్ళీ మాట్లాడకుండా గదిలోకిపోయి కుర్చీలోకూలపడుదునుగదా, ఎదురుగా "ఈ మగవాళ్ళా!" అన్న పుస్తకం కనిపించింది.

"ఈ మగవాళ్లేం...ఈ మగవాళ్లేం..." అని మా ఆవిడ మాటలూ, వాళ్ళ వకపకలూ, నా చెవుల్లో రింగు రింగుమంటూంటే కళ్లు మూసుకున్నాను. ★

సత్యత

11

రోజులు గడుస్తూనే ఉన్నాయి. ధర్మయ్యగారింట్లో శాంతమ్మ సంతృప్తిగానే జీవిస్తోంది.

ధర్మయ్య కర్మజీవితం చాలా నిర్దుష్టంగానూ, ఆదర్శంగానూ శాంతమ్మకు గోచరిస్తూంది. రానురాను అతనిపట్ల శ్రద్ధాభక్తులు ఆమెలో పెంపవుతూ ఉన్నాయి.

కాలం విలువ తెలుసుకున్న ధర్మయ్య కార్యక్రమాల్లో నియమం తప్పక స్నానపాన జపాదులదగ్గర్నుంచి జాగర్తగా సంచరించడంతో శాంతమ్మకు ఒక గురుభావం పాతుకుపోయింది.

నెల్లాళ్ళు గడిచినతర్వాత శాంతమ్మ, కుర్చీలో కూర్చుని ఏదో చదువుకుంటున్న ధర్మయ్య దగ్గరగా వచ్చింది.

ధర్మయ్య చూసి "ఏవమ్మా" అని అడిగాడు.

ఆమె ఏదో చెప్పాలని సంశయిస్తున్నట్లుగా అతను గుర్తించాడు. "అలా బల్లమీద కూర్చో" అన్నాడు.

శాంతమ్మ కూర్చుంది "అన్నయ్యా" అంది.

పుస్తకం ప్రక్కకు పెట్టి ఎందుకన్నట్లు చూశాడు.

"ఈ యాభై రూపాయలూ నీదగ్గరుంచు."

మడతపెట్టి చేతులో ఉంచిన పదిరూపాయల నోట్లు యివ్వబోయింది.

"ఎందుకూ?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఖర్చునిమిత్తం."

దానితో ధర్మయ్య అర్థంచేసుకున్నాడు "చెల్లెలుకు పెట్టిన తిండికి చార్జీ తీసుకొనే స్వార్థం యింకా పుట్టలేదమ్మా" మెల్లగా కుర్చీమీదనుంచి లేచాడు. "అంతగా అవసరమైతే నేనే అడుగుతాలే" పుస్తకం తీసుకు తన గదిలోకి వెళ్ళిపోయాడు.

ఉదయం స్నానమైనతర్వాత పూజాగదిలోకి వెళ్ళిన ధర్మయ్యకోసం శాంతమ్మ నిరీక్షిస్తూంది.

ధర్మయ్య వెలుపలకు వచ్చాడు.

"రవి చాలాఅల్లరిచేస్తున్నాడన్నయ్యా"

"ఏం చేయమంటావు."

"లక్ష్మితోపాటు బడికి తీసుకవెళ్ళు."

ధర్మయ్య నవ్వాడు "వాడి లక్షణాలు చూస్తే సరస్వతి వాడికి చాలా విరోధురాలుగా కనిపిస్తుంది...సరే."

ఆ రోజు పట్టి బలవంతంమీద రవిని ధర్మయ్య పాఠశాలకు తీసుకవెళ్ళాడు.

రవి వేరే కూర్చోడానికి యిష్టపడలేదు. లక్ష్మిప్రక్కనే స్థావరం ఏర్పర్చుకున్నాడు. ధర్మయ్య ఓనమాలు వ్రాసియిస్తే; శ్రద్ధగా మాత్రం తీసుకున్నాడు. కాస్సేపు దిద్దినతర్వాత చేయిలాగి పలక ప్రక్కకు గిరాటు వేశాడు రవి.

స్కూల్లో పిల్లలంతా గొల్లున నవ్వారు. కాని పలక బ్రద్దలవ్వలేదు. లక్ష్మి పలకతీసి "తప్పు. అక్షరాలు దిద్దాలి" అని చెప్పింది.

శ్రీ పినిశెట్టి శ్రీరామమూర్తి

రాము రవికేసి చూస్తున్నాడు. రవి కూడా ఒకటి రెండుసార్లు చూశాడు.

"ఏమండి మాష్టారూ ఆరోజు కారుదగ్గర కనిపించిన అబ్బాయి కదూ?" అని రాము అడిగాడు.

"అవును బాబూ మా చెల్లెలుగారబ్బాయి" అని ధర్మయ్య సమాధానమిచ్చాడు.

మాష్టారు దగ్గరబంధువు అనడంతోనే రాముకి రవిపట్ల శ్రద్ధ కలిగింది.

షార్ట్ బెల్ కొట్టారు.

పిల్లలంతా వెలుపలకు వచ్చారు.

మామూలు ప్రకారం లక్ష్మి రామూ కారు దగ్గరగా వెళ్లారు. రవికి చాలాకోపం వచ్చింది. బుంగమూతి పెట్టుకు స్కూలు ప్రక్కనే కూర్చున్నాడు.

లక్ష్మి తిరిగిచూసి 'బావా' అని పిలిచింది.

రవి మాట్లాడలేదు. లక్ష్మి పరుగునవచ్చి "కారు ఎక్కుదాం రా" అని చేయిపట్టుకలాగింది.

"వెధవ కారు నేను రాను."

ఈమాటలు రాము విన్నాడు. తన కారుని దూషించడం చాలా కష్టమనిపించింది.

"వెధవ కారూ? మళ్ళీ ఆ మాటన్నావంటేనా?" జాగ్రత్త అనే భావం వచ్చేటట్లు చూచాడు.

రవి చురుగ్గా లేచాడు "ఆ మళ్ళీ అంటాను వెధవకారు" అన్నాడు.

రాము మీదకు వచ్చాడు. లక్ష్మి రాము చేతులు పట్టుకొని "మా బావ కొట్టకు" అని ప్రాధేయపడింది. "లక్ష్మి చెప్పింది కాబట్టి ఊరుకున్నా — నే నెవర్నో తెలుసా?" భుజాలు ఎగరేసి నిర్లక్ష్యంగా నవ్వాడు.

మళ్లీ బెల్ కొట్టారు. పిల్లలంతా బిలబిలా స్కూల్లోకి వెళ్ళిపోయారు. రవి చాలా కష్టంమీద లక్ష్మి పట్టుమీద మళ్లీ క్లాసులోకి వెళ్ళి కూర్చున్నాడు. రాము అంటే మాత్రం రవికి చాలా కష్టంగానే ఉంది. ఒకటి రెండుసార్లు కోపంగా కూడా చూశాడు.

స్కూలు విడచిపెట్టారు. రవి చిన్న రాయితీసుకొని జాగర్తగా ఉంచాడు. రవికేసి చూస్తూ నిర్లక్ష్యంగా వెక్కిరిస్తూ పోతున్న రాముమీద విసరాడు ఆ రాయి.

రాము తలకు తగిలి "అబ్బా!" అన్నాడు. రవి యింటికి దౌడుతీశాడు.

ధర్మయ్య కళ్లెదురుగానే తలవని తలంపుగా ఒక క్షణంలో జరిగిపోయిందా కార్యం.

రాము నెత్తివెంబడి రక్తం కారుతూంది. లక్ష్మి ధర్మయ్య మరికొందరు పిల్లలు రాము చుట్టూ చేరారు. ధర్మయ్య కండువా చించి కట్టు కట్టాడు.

డ్రైవరు కోపం ఆపుకోలేక ఆ కుర్రవాణ్ణి పట్టుకోడానికి పరువెత్తాడు. తిన్నగా వెళ్ళి రవి ధర్మయ్యగారింట్లోకి దూరిపోయాడు.

శాంతమ్మ గుమ్మంలోకి వచ్చేటప్పటికి డ్రైవరు రొప్పుతూ రోజుకుంటూవచ్చి "వాడేడీ?" అని ఒగురుస్తూ అడిగాడు.

"ఎవరూ ?"

"ఆ - మీ కుర్రాడు...మా చినబాబు మీద రాయి విసిరాడు...రక్తం! రక్తం!.."

"రాము మీదా."

"ఆఁ!" డ్రైవరు సమాధాన మిచ్చాడు.

శాంతమ్మ మరేమీ సమాధానం చెప్ప లేదు. తిన్నగా పాఠశాలవైపు పరువెత్తింది.

డ్రైవరు యింట్లో ప్రవేశించాడు. యిల్లంతా గాలించాడు. రవి కనిపించలేదు. మంచంక్రింద దాక్కొని రవి తెలివి తేటలుగా అతని దృష్టినించి తప్పించుకోంటున్నాడు.

శాంతమ్మ రాముదగ్గర చేరేటప్పటికి రాము కూర్చొని ఉన్నాడు. శాంతమ్మకేసి చూశాడు. "మీ అబ్బాయే కదూ?" అని అడిగాడు. శాంతమ్మ తల పంకించింది.

డ్రైవరు మొత్తంమీద విజయాన్ని సాధించాడు. రవిని బలవంతంగా పట్టుకోని, ఏడుస్తున్నా రక్కుతున్నా లక్ష్యపెట్టక లాక్కొచ్చి రాముముందు పడేశాడు.

కోపంతో మండిపోతున్న రాము రవిని ఒక్క చెంపపెట్టు పెట్టాడు. శాంతమ్మ అడ్డువచ్చి ప్రాధేయతగా చూసింది.

"నువ్వు మంచిదానివి కాబట్టి ఊరుకున్నా - లేకపోతే చంపేద్దును" అని కోరెక్క "నే నెవర్ననుకుంటున్నావో - హుఁ!" అన్నాడు.

ధర్మయ్య కూడా యీ లోపానికి జమీందారుఎదుట సవినయంగా సమాధానం చెప్పడానికి లక్ష్మితోసహా వెనక సీటులో కూర్చున్నాడు. ఏడుస్తూన్న రవిని చూసిన శాంతమ్మకు జాలి కలగలేదు. అక్కడున్న చిన్నపుల్ల తీసుకోని "పెద్ద వాళ్ళను ఎప్పుడూ కొట్టవుకదా!" అని రవిని కొడుతూవుండగా రాము కారు దిగి "ఏడుస్తున్నాడు. యిక కొట్టద్దు నేనుకొట్టానుగా" అని పెద్దమనిషిలా వచ్చి సముదాయించాడు. ఆ ముద్దుమాటలు చూసిన శాంతమ్మకు ఎందుకో వుద్వేగంతో దుఃఖం పొర్లుకొచ్చింది. హఠాత్తుగా రాముని ఎత్తుకోని కళ్ళ నీళ్ళతో, హృదయాని కద్దుకుని చెక్కిళ్ళు ముద్దు పెట్టుకుంది. రాము ఆ సమయంలో ఏదో ఆనందంలో మంత్రముగ్ధుడుగా అయిపోయాడు.

"చెల్లాయి" ఈ మాట బిగ్గరగా వినిపించింది. శాంతమ్మ ధర్మయ్యకేసి చూసింది. రాముని క్రిందకు దింపింది. కళ్ళనీళ్ళతో రవిని ఎత్తుక యింటివైపు వెళ్ళిపోయింది.

తిరిగి ధర్మయ్య యింటికి వచ్చేటప్పటికి పన్నెండు గంటలు దాటింది. అంతవరకూ శాంతమ్మ భయంతోనూ క్షోభతోనూ నిండిన హృదయంతో ఎదురుచూస్తూంది.

"ఏం జరిగిందన్నయ్యా."



సరస్వతి

చిత్రకారుడు—శ్రీ ఎం. వి రామశర్మ (మద్రాసు)

యింటికి వచ్చిన ధర్మయ్యను శాంతమ్మ ఆత్రంగా అడిగింది.

నెత్తినున్న తలపాగా తీసి వాలుకుర్చీకమ్మకు తగిలించి, చమట తుడుచుకుంటూ కుర్చీలో చతికిలబడ్డాడు. "కాస్సిని మంచి నీళ్ళియ్యమ్మా" అన్నాడు. శాంతమ్మ మంచినీళ్లు తీసుకవచ్చింది. మంచి నీళ్లు తాగిన తర్వాత "ముందు లక్ష్మికి అన్నం పెట్టు" అటు యిటూ చూసి "రవి ఎక్కడ?" అని అడిగాడు.

"నిద్దరపోతున్నాడు" అని గదిచేసి చూపింది.

"నాన్నా! నువ్వు కూడా తింటేనేగాని తినను" అని మారాం చేసింది లక్ష్మి. జమీందారుగారింట్లో రాముద్వారా లక్ష్మికి ముట్టిన లడ్డుండలపొట్లం విప్పుకుంటూ వేరే మూలను కూర్చుంది.

ధర్మయ్య బరువుగా నిట్టూర్చి "రాము నిజంగా నీ పెద్దకొడుకేనమ్మా" అన్నాడు.

కాదని ధర్మయ్యకు అపనమ్మకం లేదు. కాని యీ గండాన్నుండీ, తననీ శాంతమ్మనూ ఏలా కాపాడేదో చెప్పడానికి ముందు ఆ మాటన్నాడు.

★ దత్తత ★

"అయినా నువ్వు అట్లా చేయడం బాగుండలేదు" అన్నాడు కొంత విరక్తిగా.

"ఎట్లా?" విస్మయంతో ప్రశ్నించింది.

"అట్లా ఎత్తుకోవడం, ముద్దాడటం..." అంతటిలో ఆగిపోయాడు ధర్మయ్య.

నిజమే! ఇప్పుడు శాంతమ్మ తెలుసుకుని సిగ్గుతో తల వంచుకుంది. ఆమె ఎందుకలా చేసిందో ఆలోచిస్తోంది.

"నీ కొడుకే కావచ్చు...కాదన్నట్లు ప్రవర్తించాలనికదా నువ్వొక్కడున్నది. యీలా జరిగిందని తెలిస్తే; నువ్వు ఉండటం మాట అటుంచి నా ఉద్యోగం ఏమౌతుంది?" శాంతమ్మ తల వంచుకునే వుంది. శాంతమ్మ కంటినుండి నేలమీద రెండు కన్నీటిబిందువులు పడ్డం ధర్మయ్య గమనించాడు.

"ఛా! అదేమిటి?...ఇప్పుడాలాంటిది ఏమీ జరగలేదులే...సంతోషించవలసిన సమయం" అన్నాడు.

కళ్లు తుడుచుకొని శాంతమ్మ ఏం జరిగిందన్నట్లు తల ఎత్తి చూసింది.

ధర్మయ్య యీలా చెప్పాడు.

"కారులో రాము అడిగాడు "ఆమె పిచ్చిదా మాష్టారూ" అని. కాదని చెప్పలేదు గాని 'నిన్ను చూస్తే ఆమె కెంతో ముద్దు' అన్నాను. దానికి రాము "నిజమే! ఆమెచాలామంచిది'అని సమాధానమిచ్చాడు. ఆతర్వాత మెల్లగా అడిగాను "మరి మీ నాన్నగారితో ఏం చెబుతావ్?" అని. కాస్సేపు ఆలోచించి "ఏమన్నా చెబితే ఆమె నన్ను చెడ్డవాడనుకుంటుందా?" అని అడిగాడు. నేను "చెడ్డవాడనుకోవడం అటుంచి నిజం చెబితే మీనాన్న ఆమెను ఊరినించి గెంటేస్తారేమో" అన్నాను. రాము కాస్సేపు ఆలోచించాడు. అతని మొగంలో బాధ కనిపించింది. ఎదరకు చూసి "ఏ డ్రైవర్" అని పిలిచాడు.

"సార్" అన్నాడు కారు నడుపుతూనే డ్రైవరు.

"స్కూలు దగ్గర జరిగిన గొడవ నాన్నగార్కేం చెప్పకేం?" అన్నాడు. "సార్" అని డ్రైవరు కారు నడిపించుక పోయాడు.

రాము క్రిందకు దిగగానే, ఎదురువచ్చిన జమిందారు, రాము తలకట్టు చూసి "ఏమిటి మేష్టారూ ఇది" నాకేసి చూస్తూ కోపంగా అడిగాడు.

రాము నవ్వుతూ తండ్రికి సమాధానమిచ్చాడు "మాష్టారు ఏమీ ఎరుగరు నాన్నా - ఔట్ బెల్ కొట్టినతర్వాత, పరుగు పరుగున వస్తుంటే కాలుజారి పడ్డాను, చిన్నరాయి తలకు తగిలింది... పాపం మేష్టారు కండువా చింపి కట్టు కట్టారు" అని చెప్పాడు...అప్పటికి నా ప్రాణాలు చేరుకున్నాయమ్మా" అని ధర్మయ్య కుర్చీమీదనుంచి లేచాడు.

రాముని ఆయుష్మంతుడుగా కమ్మని శాంతమ్మ హృదయం ఆశీస్సు లిచ్చింది. సంతోషంగా నిట్టూర్చి పైకిలేచి వంట గదిలోకి వెళ్ళిపోయింది.

12

ఒక్క పూటలో పాఠశాలకు స్వస్తిచెప్పిన రవి యింటి పట్టుతిరక్క రోజుకి ఒకటి రెండు తగవులు తీసుకవస్తున్నాడు. శాంతమ్మ సహనశక్తికూడా రవి దుశ్చేష్టల ముందు సన్నగిల ప్రారంభించింది.

ధర్మయ్య రాత్రిపూట రవికి చదువు చెప్పడానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు. అందుచేత రవి విషయంలో ప్రస్తుతం ఎక్కువ శ్రద్ధతీసుకోడానికి కాలాన్ని వృధాచేయదలచలేదు.

ఒకరోజు పక్కింటి మహాలక్ష్మి ఎడబిడ్డను చంకను వేసుకవచ్చి శాంతమ్మకు ఆ బిడ్డ వీపుని చూపిస్తూ—"ఇంతదుండగుణ్ని కన్నావేమిటమ్మా" అని అడిగింది. శాంతమ్మ విస్తుపోయిచూసింది. ఆ బిడ్డ వీపుమీద రక్కులు కనిపించాయి. పిల్లమెల్లగా మూల్గుతూవుంది.

"క్షమించమ్మా! చంటిపిల్లాడు. భయం చెబుతా" అని ప్రాధేయతగా అంది శాంతమ్మ.

మహాలక్ష్మి చీత్కారం చేస్తూ "ఈ పిల్ల ఏమన్నా బిడ్డలతల్లా?...ఇదిగో నమ్మో మావారసలు మంచివారుకారు.

> పిచ్చి ఆస్పత్రిలో పనిచేసే నౌకరు ఒకడు అధికారి దగ్గరకు వచ్చి, సలాం చేసి "మన ఆస్పత్రిలో నుంచీ ఎవడైనా పిచ్చాడు పారిపోయాడేమో అడగమంటూ ఎవరో వచ్చి, బయట కూకుండా రండి."
>
> "ఏం? ఎందుకుట?"
>
> "ఆ! ఆయనగారి పెళ్లాన్ని ఎవరో ఎత్తుకుపోయారంటండి. ఆ ఆసూకి ఏమన్నా సిక్కుద్దేమోనని యీడకొచ్చిన్ను."

మరి జాగ్రత్త! ధర్మయ్యగారి మొగంచూసి వెళుతున్నా" రోజుకుంటూ వెళ్లిపోయింది.

శాంతమ్మ వెళుతున్న మహాలక్ష్మిని చైతన్య రహితంగా కాస్సేపుచూసింది. తరువాత రవి గురించి జాగ్రత్తపెట్టిన పేమ్ బెత్తం మూరులోనించితీసి, అన్నంతింటున్న రవిని భయపెట్టడానికి లోపలకు వెళ్లింది.

సగం అన్నంతిని విడచిపెట్టిన కంచం తప్ప, అక్కడ రవి లేడు. పొరిగింటావిడ మాటలు విన్న రవి ఆత్రుతాన్నే దొడ్డివైపునకు ఉడాయించాడు.

శాంతమ్మ దొడ్డిలోఉన్న మామిడిచెట్టు కేసిచూసింది. పెద్దవాళ్లు ఎక్కడానికే వను కాజే ఆ చెట్టు, తప్పుచేసినప్పుడల్లా రవికి స్థావరంయిస్తుంది. ఆ కొమ్మల్లో తల్లికి కనిపించకుండా దాక్కున్నాడు.

"రవీ" అని పిలచింది శాంతమ్మ.

మనిషి కనిపించకపోయినా, ఆకులు కదిలాయి. రవి ఉన్నట్లుగా శాంతమ్మకు అదే గుర్తు.

"దిగిరా" మళ్ళీ పిలచింది.

"కొడతావూ—" రాగంతీస్తూ సన్నగా అన్నాడు.

"వస్తావా రావా"

"నేనురాను" బిగ్గరగా నిక్కచ్చిగా చెప్పాడు రవి.

"సరే" చెట్టుకేసి కోపంగాచూసి, విసుగాలోపలకు వెళ్ళిపోయింది శాంతమ్మ.

మళ్ళీ కను చీకటిపడేవరకూ చెట్టుదిగి రాలేదు రవి. అంతాపడుకు నేవరకూ అటూ

యిటూ తిరిగి రాత్రి పదిగంటలకు మెల్లగా వంట గదిలోకిచేరి ఆకలి కావడంవల్ల కంచాలు తడుముతున్నాడు.

ఒక కంచంలో అన్నం కూరలూ పెట్టి మూత వేసి ఉంచడంవల్ల, తల్లి వయసు చంకలు కొట్టుకొని కంచందగ్గర కూర్చున్నాడు.

శబ్దంవిన్న శాంతమ్మ మెల్లగా మంచం మీదనుంచి లేచింది. మంచంకిందుగా ఉన్న బెత్తంతీసి వంటగది తలుపుప్రక్కకు వెళ్ళి రవిని పొంచిచూసింది.

పరిసరాలు భయంగాచూస్తూ అన్నం తింటున్న రవిని చూసేసరికి శాంతమ్మ ముందుకు వెళ్ళలేకపోయింది. వెనక్కు తిరిగి వచ్చి బెత్తం మామూలుచోట పెట్టి, మంచంమీద కూర్చొని గట్టిగా నిట్టూర్చి మెల్లగా పడుకుంది.

రవి తన పనిపూర్తి అయిన తర్వాత పిల్లి అడుగులువేసుకుంటూ తల్లి మంచందగ్గరకు వచ్చి, నిద్రపోయిందో లేదో అని మొగంలో మొగం పెట్టి చూడ్డంలో, శాంతమ్మచేయి వెళ్లి రవిని పట్టుకుంది.

"కొట్టకమ్మోయి" యిల్లు ఎగిరేంత బిగ్గరగా అరచాడు. ఈకేక విని చదువుకుంటోన్న పేపరు ప్రక్కకుపెట్టి ధర్మయ్య ఆ గదిలోకి వచ్చాడు.

శాంతమ్మ కొట్టకుండానే "ఎప్పుడూ తగువులు తీసుకరావుకదా!" అని బెత్తం చూపి భయపెడుతోంది.

"శాంతమ్మా" అని ధర్మయ్యపిలచాడు.

శాంతమ్మ అటుచూసింది.

"రాత్రిపూట చేయి చేసుకోకమ్మ... రవిని విడచిపెట్టు" అన్నాడు. శాంతమ్మ రవి చేయివిడిచిపెట్టి" అబ్బబ్బ వీడితో వేగలేకపోతున్నా అన్నయ్యా ... ఏదన్నా దూళ్లదగ్గరన్నా పెట్టు కొస్తగొడవన్నా తగ్గుతుంది" అంది.

"ఆ మాట్లాడేను ... జమీందారుగారు దూళ్లదగ్గరే; రేప్రొద్దున్నే తీసుకవెళ్ళి వప్పచెబుతా" అన్నాడు ధర్మయ్య. ఈమాటతో రవికి చాలా కోపంవచ్చింది" వాళ్లదూళ్ల దగ్గరకు మాత్రం వెళ్లను ... ఇంకేపనైనా చేస్తా" అన్నాడు.

ధర్మయ్యకు నవ్వువచ్చింది. కానిపైకి వెల్లడిచేయిలేదు "వెధవాయి! ఎందుకు వెళ్లడో చూస్తా. రేపే నీపని చెబుతా" అంటూ వెళ్ళిపోయాడు.

శాంతమ్మ మంచంమీద పడుకుంది. రవి చాలాసేపు ఆలాగే నిలబడ్డాడు. రాము అంటేఅసలేమంట. అందులో వాళ్ళదూళ్ళ దగ్గర కాపలా అట. ఈ అవమాన భారంతోనే తల్లి ప్రక్కనే పడుకున్నాడు.

రవికి నిద్రపట్టలేదు. మెల్లగా "అమ్మా" అన్నాడు.

శాంతమ్మ మాట్లాడలేదుగాని, కళ్లువిప్పి చూసింది. "వాళ్ళ దూళ్ళ దగ్గరకు వెళ్ళను."

"అన్నయ్య ఊరుకోడు" అంటూ శాంతమ్మ యిటు తిరిగిపడుకుంది. నిజమే! ధర్మయ్య అంటే ఆ పేట పిల్లలందరితోబాటే రవికికూడా భయం. అంటే తప్పక చేస్తాడనే నమ్మకంకూడారవికుంది. ఈ ఆపత్తునుండి కాపాడమని తనకు పేర్లు తెలిసిన దేవుళ్ళందర్ని మనస్సులో ప్రార్థించుకుంటూ రవి నిద్రపోయాడు.

రవి ఉదయాన ఎప్పుడు లేచివెళ్ళిపోయాడో శాంతమ్మకు తెలీదు. నీళ్ళ బిందె క్రిందపెడుతూ మంచం కేసిచూసింది. రవిలేడు.

లక్ష్మి చిట్టిచెంబుతో మొగం కడుక్కోడానికి వీధి అరుగుమీదకు వెళుతుంటే శాంతమ్మ పిలచింది. చెంబు అరుగుమీద పెట్టి లక్ష్మి శాంతమ్మ దగ్గరగావచ్చింది.

"రవి ఎక్కడే?" శాంతమ్మ అడిగింది.

"ఏమో-నాతో మాట్లాడడంల్లేదుగా" ఈ కంఠధ్వని చాలా కష్టనిష్టూరాలతో ధ్వనించింది.

"ఏం ఎందువల్ల"

"రాముతో మాట్లాడవద్దని చెప్పాడు. ఒకే బడిలో చదివేటప్పుడు మాట్లాడకుండా ఏలా వుండనత్తా?" ఆలోచనతో నిండిన లక్ష్మి ముఖం చూసి, శాంతమ్మకు నవ్వొచ్చింది. కాని ఆపుకుంది. మళ్ళీ లక్ష్మి "అందుకే మాట్లాడకుండా ఉండలేనని చెప్పేశానమ్మా" అంది.

"అందువల్ల" శాంతమ్మ ప్రశ్నించింది.

"నాలుగు రోజులనుంచి నాతో మాట్లాడ్డల్లేదు ... మాట్లాడకపోతే నాకేం? నాకు రాము జత ఉన్నాడుగా" అంటూ కోపంగా మొగంపెట్టుక వెళ్ళిపోబోతుంటే "లక్ష్మి" అని శాంతమ్మ మళ్లీ పిలచింది. లక్ష్మిదగ్గరగా వచ్చింది,

"రాము ఏలాంటివాడు లక్ష్మి? అని శాంతమ్మ అడిగింది.

"చాలా మంచాడు. కారుమీద వాళ్లింటికి తీసికెళ్ళి అప్పచ్చులు పెడతాడు..." యింకా ఏదో చెప్పబోయి ఆగి మళ్ళీ యీలా అంది "అత్తా! నిన్నొకసారి అడిగాడు కూడాను"

ఈ మాటతో శాంతమ్మ లక్ష్మిని దగ్గరకు లాక్కొని "ఏమని అడిగాడు" అని ఆత్రంగా అడిగింది.

"మీ అత్త చాలామంచిది" అన్నాడు. శాంతమ్మ లక్ష్మి శిరస్సు ముద్దుపెట్టుకొని ఆనందస్వరంతో "నూరేళ్లూ బ్రతుకు తల్లీ" అని దీవించింది. అప్పట్లో శాంతమ్మ కళ్లు ఆనందబాష్పాలతో నిండిపోయాయి. రాము గురించి చెబితే తన్ను దీవించడమేమిటో లక్ష్మికి అర్థంగాక, కాస్సేపు ఆలాగేచూసి అక్కడినించి వీధి అరుగుమీదకు వెళ్ళిపోయింది.

వంటచేసిన తర్వాత రవికోసం శాంతమ్మ చాలాసేపు చూసింది. రవి జాడా జవాబూలేదు.

ధర్మయ్య లక్ష్మితో భోజనానికి కూర్చునేముందు "రవి ఏడీ" అని అడిగాడు.

గుమ్మందగ్గర కూర్చున్న శాంతమ్మ "రాలేదు" అని క్లుప్తంగా సమాధానం చెప్పింది.

అన్నం కలిపి నోట్లో ముద్దపెట్టుకుంటూ

★ దత్తత ★

ధర్మయ్య శాంతమ్మకేసి ఓమారుచూశాడు. ఆమె దైన్యపూరిత విషాదవదనం చూసిన ధర్మయ్య ఆమె హృదయం బిడ్డకోసం ఎంత పరితపిస్తుందో అర్థంచేసుకున్నాడు.

"అన్నంతిన్న తర్వాత వాడు ఎక్కడున్నా తీసుకవస్తాను" అని ధర్మయ్య చెప్పాడు.

ఇంటికిరాడనే అపనమ్మకం ఆమెకు లేదు. కాని తన బిడ్డవల్ల ఏక్షణాన ఏలాంటి దూషణ తిరస్కారాలు ఆమె సహిస్తూ పూరుకోవలసి వస్తుందో అనే భయమే ఆమెలో పనిచేస్తోంది.

ధర్మయ్య భోజనంచేసి చేయికడుక్కోడానికి దొడ్డిపైపునకు వెళ్ళాడు. లక్ష్మి అప్పుడే భోజనంచేసి గదిలోకివెళ్ళి పుస్తకాలు తీసుకుంటోంది.

శాంతమ్మ ఎంగిలిఎత్తి కంచాలు తీయబోతూ ఉండగా గుమ్మంలో కారువచ్చి ఆగిన ధ్వని వినిపించింది. ఆమె హృదయం భయంతో కంపించింది. కంచాలు తీసుక కంగారుగా లోపలకు వెళ్ళిపోయింది.

"మాష్టారూ?" అనిపిలుస్తూ రవిని వెనకాలపెట్టుక రాము చావిట్లోకివచ్చాడు. రాము కంఠంవిన్న లక్ష్మి చేతిలో పుస్తకంతో పరుగున వచ్చింది.

"మీ నాన్నగారు ఏరి" అని మళ్ళీ రాము అడిగాడు.

"ఏం బాబూ" చేయి తుడుచుకుంటూ ధర్మయ్య వచ్చాడు:

కంగారుగా చేతులు కడుక్కున్న శాంతమ్మ, ప్రేమపూరితమైన తన బిడ్డ కంఠస్వరంనుండి ఏలాంటి వార్తవస్తుందో అనే ఆత్రంతో తలుపు వెనకాలనుండి వింటోంది.

"రవిని మాదూళ్ళకాడ పెడతానన్నారట కదూ?"

"అవును బాబూ! చదువుకోపోతే ఏం చేయను?" అని ధర్మయ్య సమాధానమిచ్చాడు.

"చదువుకుంటానంటే దూళ్ళకాడ పెట్టరుకదూ?" అని రాము అడిగాడు.

"అబ్బే! చదువుకుంటే ఎందుకు పెడతాను"

"సరే! రేపటినుంచి స్కూలుకు వస్తాడట .. నాతో లక్ష్మితో జతగా ఉంటాడట. కూడా తీసుకరండి" రవిని అక్కడ విడిచి, వెనక్కి తిరిగాడు రాము. శాంతమ్మ దగ్గర్నుంచి వచ్చి "రామూ" అని లక్ష్మి వెనక్కి పిలచింది. రాము ఆగిచూశాడు.

"మా యింట్లో అన్నంతినవూ?" అని అడిగింది.

ఈ మాట ఎవరు ఎక్కడనించి అడిగించారో! రాము గమనించలేదు. కాని అంత పేదవాళ్ళయింట్లో తనలాంటివాడు అన్నంతినడం మంచిది కాదనే నిర్ణయం లేకపోయినా, ఎందుకో "వద్దు" అని మాత్రమన్నాడు.

"మా యింట్లో అన్నంతింటే తప్పా?" లక్ష్మి కొస్త బాధగానే అడిగింది.

"తప్పో ఒప్పో నాకు తెలీదు... కాని మానాన్నగారు ఎవరింటిదగ్గరా ఎప్పుడూ అన్నంతినవద్దన్నారు" అన్నాడు, పరిసరాలు ఎవరికోసమో అతనికళ్ళు వెతికాయి.

శాంతమ్మ వెలుపలకు రాలేదు. రావాలనీ, రాముని కళ్ళారా చూడాలనీ, ఉన్నా ధర్మయ్యఏమంటాడో అనేభయం కొంత ఆపుచేసింది.

బిడ్డకు తనచేతులారా అన్నం పెట్టాలనే, కోరిక కలిగిన శాంతమ్మ మనస్సు కొస్త నిరుత్సాహంతో వ్యథపడింది.

రాము గుమ్మందిగి కారులో ఎక్కాడు. ధర్మయ్యకూడా కారుదగరగా వచ్చాడు.

"మాష్టారూ? ... మరి" ఏదో అడగబోయాడు. కాని మాట పూర్తికాకత్రిత మే కారుస్టార్ట్ కావడంవల్ల, గుమ్మంలో తను అడగబోయే ప్రశాంతమూర్తి కనిపించడంవల్ల మాట పూర్తి చేయలేదు.

శాంతమ్మ గుమ్మంలో నిలబడి రాముని చూస్తూనేవుంది, రాముకూడా ఆమెపై తనకెందుకో ఈ అవ్యాజ అజమానం అర్థంగాక అలాగే చూస్తున్నాడు. ధర్మయ్య ఇద్దరికేసి చూశాడు. కారు కదలిపోయింది,

పిల్లల తగువుల్లో మొదటినేరస్తుణ్ని నిర్ణయించడం ఎంతకష్టమో; మళ్ళీ జతగూడిన తర్వాత ఎవరుముందు స్నేహానికి చేయిచాచారో నిరూపించడం. కూడా అంతే కష్టం.

రవికి రాము అంటే ఆనాడు జరిగిన సంఘటన దగ్గర్నుంచీ కష్టంగానేవుంది. కాని అతణ్ని చూడాలనీ, మాట్లాడాలనే మమకారం లేకుండాపోలేదు. రవి ఆత్మాభిమానం ఎంత అడ్డుపడినా, తాను చేసిన పొరపాటునకు బుద్ధిమాత్రం మధ్యమధ్య వ్యథపడుతు నేవుంది.

ఈ రోజు రవి ఊరు చివర రోడ్డు ప్రక్కన, తూముమీద కూర్చొని ఉదాసీన వదనంతో, ఎర్రగా ప్రసరించే ఎండలో, దూడలుకాసే కుర్రాళ్ళను చూస్తూ, తన భవిష్యత్తు ఉద్యోగం సంతోషదాయకమో విచారకారణమో ఊహించడానికిప్రయత్నిస్తున్నాడు.

రోడ్డుప్రక్కన కారు సడెన్‌గా ఆగిన ధ్వని విని రవి వెనక్కి చూశాడు. సంతోషంతో పైకిలేచి, కారుదగ్గరకు రాబోయి, ఏదో జ్ఞాపకంవచ్చి ఆగిపోయి, తలక్రిందకు దించుక కోపంగా చూస్తున్నాడు.

కారులో ఉన్న రాము మొదట్లో మాట్లాడదామనుకుని తరువాత అతని నిరుత్సాహ నిర్లక్ష్యభంగిమను చూసి "పోనియ్య" అని డ్రైవరు కేసిచూశాడు.

రవి కళ్ళనీళ్ళతో రాము కేసిచూశాడు. రాము కారు ఆపుచేయించి "ఇక్కడున్నావేం" అన్నాడు.

రవి మాట్లాడలేదు. రాము కాస్సేపాగి తరువాత "కార్లో ఎక్కుతావా?... మీ యింటిదగ్గరకు తీసుకవెళతా" అన్నాడు.

విరోధిద్వారా యిలాంటి ఆదరణ వాక్కులు వింటానని రవి ఎప్పుడూ అనుకోలేదు. మెల్లగా కారులో ఎక్కాడు.

రవి కారు కదలిన తర్వాత, నవ్వుతూ, నసుకుతూ, తను యిల్లువిడచి యిక్కడ ఉండటానికి కారణంకూడా చెప్పాడు.

13

శాంతమ్మ మనస్సు కొస్త కుదటపడింది. రవి ఏదో స్కూల్లోచేరి ఘనంగావిద్యార్జన చేస్తాడనే ఆసక్తికన్నా, ఇంటిదగ్గరఉండి తగువులు ఏమీ తీసుకరాడు అనే నమ్మకం కుదిరింది.

స్కూల్లో రవి ఏవన్నా తగువులు తెస్తున్నా, రాము అభిమానాన్ని సంపాదించడంవల్ల, వాటిగురించి శాంతమ్మకుగాని, రవికిగాని ఏవిధమైన బెడదా లేకుండాపోతోంది. ఇక రాత్రుళ్ళుకూడా లక్ష్మికి చదువుయందుగల శ్రద్ధవల్ల, రవికి చాలా యిబ్బందీ వచ్చిపడింది.

లక్ష్మి తీరిగ్గా పుస్తకాలు ముందువేసుక కూర్చొని "బావా!" అని పిలచేది. రానంటే; ధర్మయ్య జ్ఞాపకానికి వచ్చేవాడు. మనస్సులో కోపంతో మండిపోతూ చిరాకుగా పుస్తకాలు తీసుకొని లక్ష్మిదగ్గర కూర్చొనేవాడు. కిక్కురుమనక చదివేవాడు.

చదువులో లక్ష్మి తెలివితేటలు ముందు తాను పరాజితుడు కావడంవల్ల ఒకసారి చెంటేలున లక్ష్మిని ఛాయిచేసుకున్నాడు రవి.

ప్రక్కగదిలో ఏవో చదువుకుంటున్న ధర్మయ్యకు ఆశబ్దం వినిపించింది "ఏమిటి లక్ష్మి" అని పిలచాడు, కాని ఆమె సమా

ధానం చెప్పలేదు. ధర్మయ్య దగ్గరకు వచ్చి చూశాడు. రవి అప్పుడే పుస్తకాలు తీసుక ప్రక్క గదిలోకి పారిపోయాడు.

"కొట్టాడా?" అని లక్ష్మి నడిగాడు.

"గట్టిగా కొట్టలేదులే నాన్నా" అని సమాధానమిచ్చింది. ధర్మయ్య రవి వెళ్ళిన దారిని కాస్సేపు చూసి, యథాస్థానానికి వెళ్ళిపోయాడు.

మరునాడు సాయంత్రం వరకూ లక్ష్మి రవితో మాట్లాడలేదు. రాత్రి పుస్తకాలు తీసుకవచ్చి ఎదురుగా కూర్చున్నాడు. కాని లక్ష్మి ఏమీ పట్టనట్లుగా అటు చూడనేలేదు. కాస్సేపటి వరకూ రవి మాట్లాడక కూర్చొని మెల్లగా అన్నాడు "అలా అయితే నేను చదవను"

"నా గురించి చదువుతున్నావేమిటి?" అని మొగం పెడగా పెట్టుకొని సమాధానం చెప్పింది.

కాస్సేపాగి రవి "కొట్టానని కోపమా?" అని అడిగాడు. లక్ష్మి మాట్లాడలేదు.

"యిక ఎప్పుడూ కొట్టను లక్ష్మి" బాధగా మొగం పెట్టి అన్నాడు. లక్ష్మి అతనికేసి విమర్శనీయంగా చూచి "సరే పాఠం వప్పచెప్పు" అని అంది.

చాటునించి వీళ్ళ సంభాషణలు వింటున్న ధర్మయ్య తనలోతాను నవ్వుకున్నాడు.

ఈరోజు జమిందారు గంగాధరం గారింట్లో చాలా హడావిడిగా వుంది. రాము పుట్టినరోజు.

ప్రొద్దుటనించి రవికీ, లక్ష్మికీ తీరికలేదు. వారేమీ పనులు చేయకపోయినా, రాము కారు పంపిస్తానని చెప్పాడు. అందుచేత బట్టలు వేసుకొని, షోకు కావడంలో లక్ష్మి కాలాన్ని చాలా వృథా చేస్తోంది. రవి అప్పుడే తయారై కూర్చున్నాడు. లక్ష్మి అద్దంలో చూసుకొని, "బావుందా బావా?" అని ఇప్పటికి ఏ ఆరుసార్లో అడిగింది. ఇప్పటికే రవికి చాలా విసుగుదలగా వుంది.

సమాధానం యివ్వకుండా చావిట్లోకి వెళ్ళి గడ్డం క్రిందచేతుల పెట్టుక దీర్ఘాలోచనలో మునిగాడు. అతనికేం తోచిందో "లక్ష్మి" అని పిలిచాడు.

"ఏం" లోపలనుంచే సమాధానం చెప్పింది.

"కారొచ్చింది రావాలి" ఆకంఠ ధ్వని నిజంగా కారు వచ్చినట్లుగానే వుంది.

లక్ష్మి కంగారుగా వెలుపలకు వచ్చింది. అప్పటికి ఒక కంటికే కాటుక పెట్టుకుంది. రవి నవ్వాడు. తప్పట్లు చరిచాడు. లోపలున్న శాంతమ్మ వచ్చి చూసింది. ధర్మయ్య కూడా అరుగు మీదనించి యింట్లోకి వచ్చాడు.

"ఆ కాటుక ఎవరు పెట్టారమ్మా" అని ధర్మయ్య నవ్వుతూ అడిగాడు. లక్ష్మి తిరిగి వెళ్ళి అద్దం చూసుకుంది. "మాయమనిషి" అని తనలో మూలుక్కుంది.

ఆ వెనకాలనే వెళ్ళిన శాంతమ్మ; లక్ష్మి అరిందాలా ముడుక్కుడం చూసి పక్కున నవ్వింది. లక్ష్మి వెనక్కు తిరిగి కోపంగా చూసింది. "మీ అబ్బాయి మూలాన్నే" అంది.

శాంతమ్మ దగ్గరగా వచ్చింది. కాటుక బొట్టూ పెట్టింది, లక్ష్మిని తన ఎదురుగా నిలుపుకుంది.

"ఎవర్ని పెళ్ళి చేసుకుంటావ్ లక్ష్మీ!" అని అడిగింది. పెళ్ళంటే తెలీకపోయినా ఆ పేరు చెప్పేటప్పటికి లక్ష్మి తలవంచుకొని "ఫో అత్త" అంది.

"రామునా? రవినా?" అని మళ్లా అడిగింది.

"రౌడీ బావనే—బాబో!" అంది.

"మరి రాముని చేసుకుంటావా?" శాంతమ్మ మరీ నిలదీసి అడగడంతో, లక్ష్మి అక్కడినించి తప్పుకోలేక పోయింది. ఏం చెప్పనా అని ఆలోచిస్తూంది.

అంతలో కారు ఆగిన ధ్వని అయింది.

"అదుగో కారు వచ్చింది" అంటూ తుర్రున అక్కడనించి లక్ష్మి పారిపోయింది.

పారంపర్యంగా వచ్చే ఆనవాయితీ ప్రకారం ఊళ్ళోఉన్న పెద్దవాళ్ళనందరిని గంగాధరం ఆహ్వానించాడు. హాలంతా జనంతో కిటకిటలాడుతూంది. పిల్లలంతా ఓ ప్రక్కనూ, పెద్దలంతా మరో ప్రక్కనూ కూర్చున్నారు.

తేనీటివిందయిన తర్వాత వినోదార్థం పేరుగల నర్తకిచేత నాట్యంకూడా చేయించారు.

రాము ఎత్తయిన కుర్చీమీద అలంకారభూషితుడై కూర్చున్నాడు. అతని దృష్టి దూరంగాఉన్న లక్ష్మికేసి పోతూంది. రవి ప్రక్కనఉన్న లక్ష్మి ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ రామునిచూస్తూంది.

నాట్యం పూర్తయింది. రాముకి, వచ్చిన అతిథులు బహూకరణలు అందచేస్తున్నారు. కొస్తదూరంగా కూర్చున్న గంగాధరం చిరునవ్వుగా అన్నీ పరిశీలిస్తున్నాడు. ఆ ప్రక్కనే ధర్మయ్య కూడా కూర్చునున్నాడు.

పిల్లలుకూడా చిన్న చిన్న వస్తువులు యివ్వడం రవి చూశాడు. లక్ష్మి కేసి తిరిగి "నువ్వేం తీసుకొచ్చావ్?" అని అడిగాడు.

"ఇదిగో" అని చిన్న ఉంగరం చూపింది.

ఆ ఉంగరాన్ని రవి పరిశీలించాడు. అది బంగారానిదే!

"ఇంత ఖరీదైందే యివ్వాలా?" అని అమాయకంగా అడిగాడు.

"ఏదిచ్చినా ఫరవాలేదు" అని చెప్పి తనువెళ్ళే అవకాశంకోసం చూస్తూంది.

"నువ్వు దొంగవు" పళ్ళు బిగబెట్టి కోపంగా అన్నాడు రవి. లక్ష్మి అర్థంగాక అటు చూసింది.

"మరి నువ్వు నాతో ముందు చెప్పద్దూ" కోపంగా అడిగాడు.

"అందరూ యిస్తారేమిటే?"

"ఇది నువ్వేలా యిస్తున్నావ్"

"నాన్నగారు చేయించారు. యిమ్మన్నారు."

మళ్లా లక్ష్మి రాముకేసి చూస్తూ ఉండిపోయింది.

రవి మనస్సు ఆత్రంతో నిండిపోయింది. అందరికేసీ చూశాడు. లక్ష్మి చెప్పినట్లుగా కొందరే యివ్వడంలేదు. ఏదో తోచిన వస్తువులు పిల్లలతో సహా అంతా యిస్తున్నారు.

"లక్ష్మి" రవి పిలిచాడు.

లక్ష్మి రవి కేసి చూసింది. అతని మొగం అవమానభారంతో మలినమై చూడ్డానికి భయంగావుంది.

"నీదగ్గర డబ్బులున్నాయా?"

"ఓ పావలా ఉంది"

(43 వ పేజీ చూడండి)



విజ్ఞానవీధులు

"డాక్టర్"



116. అందం అంటే ఏమిటి?

"క్రమం అన్నది అందానికి ఎంతవరకూ అవసరం? అడుగు అడుగునా అత్యద్భుతంగా కనిపించే కొండలూ, లోయలూ, మేఘాలూ, అడవి దృశ్యాలూ మొదలైన వాటిలో క్రమం (*Order*) ఉన్నదా?" అని గొల్లప్రోలునించి దరిశిపూడి భీమేశ్వర రావుగారు అడుగుతున్నారు.

'అందం అంటే ఇదీ' అని చెప్పడము కష్టము. దేవతా విగ్రహాల్ని మన శిల్పులు సామరస్యము (*Symmetry*)ను పాటించి చెక్కినారు. ప్రకృతిలో జంతుజాలమంతా సామరస్యాన్నే చూపిస్తుంది. అడ్డకోతకి ఇటు ఒక కన్నూ, చెవీ, ముక్కుచెలమా, కొమ్మూ, వుంటే అటూ అవే అలాగే వుంటాయి. ఇది జంతుకోటిలో అతిసామాన్యము. చెట్లలో మొత్తమ్మీద కనిపించే సామరస్యమే గాని సూక్ష్మంగా చూస్తే సామరస్యము కనబడదు. లతి పాకడంలోనూ, శాఖలు పెరగడంలోనూ, మొక్కల కొండముల కిరుప్రక్కలా ఆకులు మొలవడంలోనూ సామరస్యము కనబడుతుంది. కనక సామరస్యము సౌందర్యానికి సహాయకారి అని ఒప్పుకోవాలి. తోటలలో మొక్కలూ, నికుంజాలూ, దారులూ ఏర్పరచడంలో సామరస్యాన్ని పాటిస్తారు. తాజమహలు, మీనాక్షి గోపురమూ సామరస్యము పాటించి నిర్మించినవే.

అయితే ఈ ముక్కుకి బేసరీ, ఆ ముక్కుకి ముక్కుపుడకా ధరించడము ఈనాటి అందగత్తెల అలవాటు. ఇది సామరస్యము కాదు. అజంతా చిత్రాలలోనూ, పల్లవుల శిల్పాలలోనూ చెవులకు రెండింటికి రెండు వేర్వేరు రకాల భూషణాలు అమర్చడము మామూలు. (అజంతా) బోధిసత్వ వజ్రపాణినీ, (మహాబలిపురపు) నాగినినీ చూడండి. ఇక్కడ సామరస్యము లేదు గాని 'మేళము' (*Harmony*) ఉంది. రెండు ఆభరణాలూ రూపంలో వేరైనా కర్ణాభరణాలే. అజంతాలోని జంటలను గమనించినా ఇలాంటి మేళమే కనబడుతుంది. బోధిసత్త్వుడూ రాకుమారీ, యక్షదంపతులూ, చాళుక్య సైనికుడూ భార్యా, ఒకరు నలుపైతే ఇంకొకరు తెలుపు! సంగీత మేళాల్లో ఒకరు వేణువూ, ఇంకొకరు మృదంగమూ, మరియొకరు తాళమూ, వేరొకరు వీణా పట్టి కనబడతారు. ప్రకృతిలో కనపడే కొండా, చెట్టూ, వాగూ, పిట్టా ఇలాగే మేళము సాధిస్తాయి. వాటిలో అవి చెల్లాచెదరుగా ఉండక, దేనికది క్రమస్థలాన్నే ఆక్రమిస్తూండి, మొత్తంగా సాధించే మేళమువల్ల సుందరంగా కనబడతాయి.

ఈ ఆలోచననిబట్టి, సౌందర్యమంటే ఏమిటి? అన్న ప్రశ్నకి క్రిందిరీతిని సమాధానము చెప్పాలనిపిస్తోంది. ఏ వస్తువు కా వస్తువులో సామరస్యము అందము. వస్తువుల కూడలికి మేళము అందము.

ఇక, "ఇది ఒకే వస్తువు, ఇది వస్తువుల కూడలి" అని నిర్ణయించడ మెలాగ? అనే సందేహము వస్తుంది. దీనికి సమాధానము వక్రముగా ఇస్తాను: "సామరస్యము సాధించినది ఒకే వస్తువు. మేళము సాధిస్తే, అది వస్తువుల కూడలి" అని. రచన అన్నది రచయిత చేతిలోని పని. అతడు రచించినదే కళా, సౌందర్యమూను. కనక అతని రచనకి నియమాలు దారులు కావాలి గాని సంకెళ్ళు కారాదు. వ్యుత్పన్నుడైన కళాకారుడు రచనలో కొత్తదారులు తీయగలడు. ఆ దారులలో క్రమము (*Order*) ఉంటుంది. ఆ క్రమమూ, సామరస్యమూ, మేళమూ మనకు పరిచితములు కాకపోయినా, పరిశీలించిన పక్షములో ఆ రచనలలో పై గుణాలు రెండూ కనబడతాయి.

117. ద్రవపదార్థాల్ని అణిచి తగ్గించలేమా?

'ద్రవపదార్థాలలోని అణువులు ఘనపదార్థాలకన్న విడి విడిగా నున్నప్పటికీ, ద్రవపదార్థముపై ఒత్తిడిని కలుగజేసి దాని ఘన పరిమాణమును తగ్గింపలేము. కారణమేమిటండీ?' అని తణుకునుంచి టి. వి. కిశోర్ అడుగుతున్నారు.

వాయువులను - ఆమ్లజనీ, ఉదజనీ, బొగ్గుపులుసుగాలీ, మొదలైనవాటిని-అణిచి వాటి పరిమాణమును తగ్గించగలము. గంధకద్వి ఆమ్లజనిదమూ అంగారామ్ల వాయువూ, అణిచేస్తే ద్రవాలుగానూ, ఘనపదార్థాలుగానూ మారతాయి కూడాను. అంటే సాధారణంగా గాలులను అణిచి చల్లారిస్తే ద్రవాలూ, ద్రవాన్ని అణిచి చల్లారిస్తే ఘనపదార్థాలు ఏర్పడతాయన్నమాట.

పాఠశాలలలోని ప్రయోగశాలలలో ద్రవాలను ఘనపదార్థాలుగా మార్చవలసిన అవసరముగాని, సాధనాలుగాని ఉండవు. గాలులను అణచి వాటి ధర్మాల్ని పరిశీలించవలసిన అవసరమూ, అవకాశమూ ఉంటాయి. కనక గాలులను అణచగలమనే నమ్మకము కలుగుతుంది. ద్రవాల్ని కూడా ఒత్తిడివల్ల అణచవచ్చును. పీజో మీటరు అనే సాధనంతో ద్రవాల్ని అణచి వాటి ధర్మాల్ని పరిశీలించవచ్చునూ, పరిశీలించారు కూడానూ. ద్రవాలన్నీ ఒకేరీతిగా అణగారవు. అందువల్ల వేర్వేరు ద్రవాలలో శబ్దము యొక్క వేగము వేర్వేరుగా ఉంటుంది. ఏ ద్రవములో శబ్దము అతి జోరుగా ప్రసరించగలదో ఆ ద్రవము అతి తక్కువగా అణగారుతుం దన్నమాట. ఘనపదార్థాలలో శబ్దము ద్రవాలలోకంటె జోరుగా ప్రసరిస్తుంది. కనక ఘనపదార్థాలు ద్రవాలకంటె తక్కువ అణగారతా యన్నమాట.

అయితే ద్రవాల్ని అణచడంలో ఒక చిక్కుంది. ద్రవాన్ని మూతపెట్టి ఒకచోట నొక్కితే, ఆ ఒత్తిడి ద్రవమంతటా వ్యాపించి, ఆ ద్రవ్యాన్ని పట్టి ఉంచిన

పాత్రలో వైపుని ఒత్తుతుంది. వేసవిలో సోడా బుడ్లు పగలడము ఇందువల్లనే. ఇది చూచినవారికి ద్రవము అసలు అణగారనే అణగారదనే అభిప్రాయము కలుగుతుంది. కాని అది నిజముకాదు. కొవ్వూ, లోహాములూ, ద్రవీభవించినప్పుడు పెరుగుతాయి. కనక వాటిద్రవాల్ని అణచి చల్లారిస్తే ఘనీభవించేస్తాయి.

ద్రవాలలోని అణువులకు గాలిఅణువుల కున్నంత స్వాతంత్ర్యము లేదు. కాని ఘనపదార్థపు అణువులకంటె ఎక్కువ స్వాతంత్ర్యమే వుంది. గాలిలో అణువులు మేస్తూన్న మందలోని పశువులలాగు నిర్బంధములేకుంటే తప్పుకుని దూరంగా వెళ్లిపోతాయి. ద్రవాలలోని అణువులు మైదానంలో గుంజలకి కట్టిన పశువుల వలె అక్కడక్కడ తిరిగినా, మైదానము మీదే వుంటాయి. ఘనపదార్థపు టణువులు దొడ్డిలో కట్టిన పశువుల మందలు! వాటిని కూరడము కష్టము!

నీరు ఒక్కటి మాత్రము చిత్రమైన వస్తువు. నీటిని మంచుగడ్డగా మార్చినప్పుడు దాని పరిమాణము కొంత పెరుగుతుంది. శీతలదేశాల్లోని నీటిపైపులు శీతకాలములో, లోపలి నీరు ఘనీభవించి పెరగడమువల్ల చిట్లిపోతాయి. ఇలాగే పర్వతాగ్రాలమీద నెరుసులలో నిల్చిన నీరు మంచుగడ్డగా ఘనీభవించి, రాతిని పగిల్చి ముక్కలు చేయగలదు.

చిట్టిప్రశ్నల జవాబులు

—సూదంటురాయిని అంటివున్న ఇనపపొడి సూదంటురాయిని దొర్లించినప్పటికీ దానిని పట్టుకునే ఉండడము చూచే ఉంటారు మీరు. ఆ రీతిగానే, భూమి, తనమీద వస్తువులను—జంతువులూ, మానవులూ, రాళ్లూ, గాలీ—అన్నిటినీ తనవైపు ఆకర్షించుకుని పట్టివుంటుంది గనకనే, ఇవేవీ (భూభ్రమణమువల్ల ఎగిరి) పోవు.

—రాత్రులందు సముద్రములో 'మంటలు' రేగుతాయా? మేమెరగమండీ!

—రాత్రులందు సముద్రపు ఒడ్డున 'కన్యలు' విహరిస్తూండగా, చూచారా మీరూ! చూచివుంటే 'నిజముగా సముద్రకన్యలు ఉంటారంటారా' అని మమ్మల్ని అడగనేలా?

—రాతినెరుసులలో ప్రవేశించేనాడు వ్రేళ్లు అతి సున్నితములే. క్రమంగా పెరిగి రాతిని విడగొట్టేనాటికి ఆ వేళ్లు బలిష్ఠముగా తయారౌతాయి. రాతి బలమే ఎక్కువైతే, ఆ వేళ్లు క్రమంగా (నీరు అందక) ఎండిపోతాయి.

—చంద్రుడు కూడా తూర్పునే ఉదయించి పశ్చిమాన్నే అస్తమిస్తాడు. అయితే చంద్రుడు ఉదయించే కాలము మాత్రము రోజూ ఒకటే కాదు. చంద్రుడు భూమి చుట్టూ సుమారు నెలరోజుల్లో తిరిగి వస్తూంటాడు. అందువల్ల రోజురోజుకీ చంద్రోదయకాలము 48 నిమిషాలు వెనక పడుతూంటుంది. పున్నమనాడు సాయంకాలం 6 గంటలకు చంద్రుడు ఉదయించాడనుకుంటే, అమావాస్యనాడు - పదిహేను నలభై ఎనిమిదులుఅంటే - 12 గంటల కాలము ఆలస్యముగా, అంటే ఉదయము 6 గంటలకు సూర్యుడితోపాటే ఉదయిస్తాడు. సూర్యుడి వైపు తిరిగి ఉన్న చంద్రముఖము మీదే వెల్తురుపడి, అది మనకి కనబడకపోవడమువల్ల అమావాస్యనాడు చంద్రుడు కనపడడు మనకి.

★



టీకాలు

[ఎడ్వర్డు జెన్నర్ శిలా ప్రతిమ ఆధారంగా శ్రీ దోణాదుల గోవిందరాజులు (విజయవాడ) రచించిన చిత్రం.
ప్రక్క పేజీలోని చిత్రం కూడా వీరిదే]



మాతాశిశువులు

తానొకటి తలిస్తే

★

శ్రీ కలవలపూడి వెంకటరమణయ్య

పల్లవరంబను గ్రామంలో
పాపయ శాస్త్రను పండితుడు
భార్యా పుత్రులతో కూడి
చేస్తున్నాడు కాపురము.

ధనమూ, పొలమూ, ఆస్తంటూ
ఏమీ లేవూ పాపయకు
ప్రొద్దున వూళ్లో. కెళ్లడము
సంసారము పోషించడము.

పెండ్లయి ఏడేండ్లే అయినా
పుత్రులేడుగురుసంతానం
ఏటా బాలింతాయమ్మ
ఏం చేస్తా డాతని ఖర్మ!


దిక్కుతోచలే డాతనికి
మొక్కుకున్నాడు దేవునికి

తనపని బిడ్డల కొదిలేసి
వెళ్లిపోయాడు తను కాశీ.

సంవత్సరంపాటు [illegible]
సేవించిన ఒక బిడ్డయినా
తగ్గుతాడనే ఆశలతో
తన్మయం బొందె యాత్రలతో

తిన్నగాను మరువత్సరము
తిరిగొచ్చెను తన గ్రామము
మొదలిడెను యాయవారము
పోషించను, సంసారము.

మామూలుగ కొన్నాళ్లకు
వచ్చెను గర్భం భార్యకు
చక్కగ కన్నది ఆజనని
చక్కని కవలల నిద్దరిని!!



జంతుకోటిలో మానవలక్షణాలు

(గత సంచిక తరువాయి)

చేపలు నిద్రపోతాయా? గుర్రాలు నిజంగా నిల్చునే నిద్ర పోతాయా? ఈలాంటి అనుమానాలు అందరికీ వస్తాయి. నిద్రావస్థలో మానవుడు పొందే పరిణామా లేమిటో తెలుసుకోవటానికి కూడా జంతువుల నిద్రావస్థను గూర్చిన పూర్తి పరిజ్ఞానం సంపాదించవలసిన అవసరం శాస్త్రకారులకి కలిగింది. అందుకోసమై వారు ఎన్నో పరిశోధనలు జరిపారు.

అనేక తరహాల జంతువులు మనుష్యులకి మల్లే వొళ్లు తెలియని నిద్రపోలేవు. వాటికి చేతనైనది, మగతనిద్ర పోవటం మాత్రమే. అందులోనూ పిల్లి, కుక్క, కప్ప, కోడి లాంటి వాటికి యీమగత చాలా సునాయాసంగా వచ్చేస్తుంది. చేపలు మన కందరికీ అర్థమయ్యే పద్ధతిలో నిద్రపోవు కానీ, నిద్రావస్థకు తుల్యమైన అనుభూతిని అవి అప్పుడప్పుడూ పొందుతూనే వుంటాయి.

ప్రాణికోటి నిద్రావస్థలను గూర్చి విశేషంగా పరిశోధనలు జరిపిన డా॥ బెన్‌డర్ అనే ఒక శాస్త్రవేత్త, నిద్రలలో స్థూలంగా రెండు రకాలు వుంటాయని తేల్చాడు. మొదటిరకం నిద్ర-మనుష్యులు, స్తన్యంతాగి వృద్ధి పొందే జంతువులు పోయే నిద్ర. ఈనిద్ర పోవటమనేది రోజుకి ఒకటి రెండు సార్లే జరిగింది. ఒక్కొక్క నిద్ర కొన్ని గంటలకాలం పట్టుతుంది. రెండోరకం నిద్ర అల్లాక్కాదు. పిల్లి నిద్ర మాదిరిగా అరగంటకో సారి చొప్పున ఐదేసి నిమిషాలు కునుకు తియ్యటం(ముసలమ్మల్లాగా!)

మొసళ్లు, నీటిగుర్రాలు (హిప్పోపొటామస్) నీళ్లల్లో తేలుతూనే నిద్రపోతాయి. ఆనీళ్లు గోరువెచ్చనీళ్లు అయితే మరీ సుఖంగా నిద్రపోతాయి. మూడో తరగతి రైలు ప్రయాణీకుల్లాగా, యివి ఒకదాని వీపుమీద ఒకటి తలలు ఆనించి నిద్రపోతూ వుంటాయి.

గుర్రాలు, ఏనుగులూ నిల్చునే నిద్రపోతాయని డా॥ బెన్‌డర్ అభిప్రాయ పడ్డాడు. ఇటీవల యుద్ధాలలో వుపయోగ పడే 600 గుర్రాల విషయంలో వాటి నిద్రావస్థ ఎలాంటిదో, కొందరు శాస్త్రవేత్తలు పరీక్షగా చూశారు. ఆ గుర్రాలన్నీ నిల్చునే నిద్రపోయాయట. అందులోనే గుర్రం కట్టేసిన రాటకుపైగా అడ్డదూలం ఏదైనా ఒకటివుంటే, దానిమీద ముట్టెలు ఆనించిపెట్టి, అవి మరీ సుఖంగా నిద్రపోయేవి. కానీ మంచి నిద్ర పోదల్చుకొన్నప్పుడు మాత్రం ప్రతిగుర్రమూ నేలమీద పడుకొని తీరింది.

సర్కసు కంపెనీ తాలూకు 34 ఏనుగుల నిద్రావస్థలను కొందరు శాస్త్రవేత్తలు పరిశోధించి చూచారు. ఎప్పుడు చూసినా వాటిలో 29 ఏనుగులు నేలమీద పడుకొని గుర్రుపెట్టుతూ నిద్రపోయేవి. మిగిలిన 5 ఏనుగులు మాత్రం నిలబడే మగత నిద్రపోయేవి. నిలుచుని నిద్రపోతున్న యీ ఐదింటిలో ఏదో ఒకటి నేలమీదికి ఒరిగిపోగానే, అంతవరకూ నేలమీద పడుకొని గుర్రుపెట్టుతున్న ఏనుగుల్లో ఒకటో రెండో లేచి నిల్చునేవి. ఎన్నిమార్లు

★ జంతుకోటిలో మానవలక్షణాలు ★

చూసినా యీపద్ధతి ఆరక పోవటంతో-నిలుచుని వున్న ఐదు ఏనుగులూ కాపలాకోసం అల్లా నిలబడి వున్నాయని నిర్ధారణ చేసుకొన్నారు, ఆ శాస్త్రవేత్తలు. సర్కస్ కంపెనీలో చేరిపోయాక వీటికి యింకా అలాంటి కాపుదల వుండవలసిన అవసరంలేక పోయినప్పటికీ, వాటికి అనాదిగా వుంటున్న అలవాటు అంత తేలికగా వదుల్చుకోలేక, అల్లా చేస్తాయి.

జంతుకోటి అంతట్లోకి ఏనుగులు పెద్దగా గుర్రపెట్టగలవు. అంతలావు శరీరం కలిగివున్న కారణంచేత వాటికి ఒకసారి నేలమీద పడుకొంటే మళ్లీ లేచి కాళ్లమీద నిలబడటం చాలా కష్టం. అందుకని అవి సామాన్యంగా పడుకొని లేచేటప్పుడు దగ్గిరగా ఏదైనా పుట్ట వుంటే దాన్ని ఆధారం చేసుకు పైకి లేస్తాయి. పుట్ట ఏదీ దగ్గర లేకపోతే, లేవటానికి తగినంత వూపు, పడుపు చిక్కేదాకా నేలమీదనే అటునుంచీ యిటు, యిటునుంచీ అటు పడి దొర్లుతాయి.

నిద్రలో ఘీంకరించే దుర్గుణం ఒకటి, ఏనుగులకి మిక్కుటంగా వుంటుంది. దీన్నిబట్టే ఏనుగులకి సింహ స్వప్నాలు వస్తుంటాయని మనవాళ్లందరూ అనుకోవటం జరిగింది. నిద్రలో యివి అరిచే అరుపులకి కారణం, వాటికి కలల్లో సింహం కన్పించటమే కాకపోయినా, వాటికేవో పీడకలలు వస్తూ వుండటమేనని మాత్రం గట్టిగా చెప్పవచ్చు. కాలికి గొలుసు కట్టివున్నప్పుడు మాత్రం, ఏనుగులు నిద్రలో అంతగా అరుపులు అరవవట. అంటే-వాటికి అంతగా పీడకలలు రావు కాబోలు. గొలుసు కాలికి చుట్టూ తగులుతున్నంతసేపూ, తాను వున్నది నట్టడవిలో కాదనీ, తనకంత ప్రమాదం రాబోదనే ధీమా ఒకటి దాని మనస్సుకు బాగా అంటిపెట్టుకొని వుంటుంది. అందుచేత పీడకలలు కూడా అంత ఎక్కువగా రావు. మావటి వాళ్లు యీవిషయం కనిపెట్టి ఏనుగు కాళ్లకి ఎల్లప్పుడూ యినుపదో, గడ్డిదో ఏదో ఒక గొలుసు తగిలించి వుంచుతారు.

స్తన్యం తాగి వృద్ధిపొందే వర్గానికి చెందిన జంతువుల్లో యించుమించు ప్రతిదీ నిద్రలో కలలు కంటుందని డా॥ బెకర్ అంటాడు. అందుకు తార్కాణంగా ఆయన, నిద్రపోయే జంతువులు అప్పుడప్పుడూ ఎవరిమీదనో కలబడుతున్నట్లు కాళ్లు, దవడలు ఆడిస్తూ చేసే చేష్టలు, వుదహరిస్తాడు. నిద్రలో కుక్కలు సన్నగా మొరగటమూ, ఏడవటమూ చేస్తుంటాయి. ఆ సమయానికి వాటికి ఏవేవో - తీయనివో, పెగటువో కలలువచ్చి వుండాలి.

చాలా రకాల జంతువులు పడుకోవటానికి ముందు మెత్తటి చోటు కోసం వెదుక్కొంటాయి. 'ఏప్' అనే పెద్దరకం కోతిమాత్రం మనలాగే ప్రతిరాత్రీ పక్క వేసుకొని మరీ పడుకొంటుంది. ప్రతిరాత్రీ కొన్ని కొమ్మలూ, ఆకులు విరుచుకువచ్చి వాటితో పక్క అమర్చుకొని పడుకొని నిద్రపోతుంది. 'ఒరాంగ్-టాంగ్' అనే రకం కోతికూడా యిలాగే పక్క వేసుకు పడుకొంటుంది. ఐతే యిది పక్క వేసుకోవటం చెట్లకొమ్మల మధ్య. రెండుగాచీలిన గట్టికొమ్మలు చూసి, వాటిమీద అడ్డంగా చిన్న చిన్న కొమ్మలు పడేస్తుంది. ఆకులు చిగుళ్లుఆపక్కకు నడిమధ్యను వచ్చేటట్లు జాగ్రత్తపడి, అప్పుడు వెల్లకితలా కాళ్లు బార చాపుకు పడుకొంటుంది. ఏ అర్ధరాత్రి వేళనో ఆకొమ్మలు కాస్తా పుటుక్కుమని విరిగిపోయే ప్రమాదం వుంటుందని దానికి బాగా తెలుసు. ఎంత నిద్రలో అయినా సరే ఒకచేత్తో విడవకుండా పైకొమ్మను పట్టుకొనే వుంటుంది.

(ఇంకావుంది)

ఉపాధ్యాయుడు:- (విద్యార్థితో) మీఅమ్మ నిన్ను ఎప్పుడైనా కొడితే ఏం చేస్తావురా?

విద్యార్థి:- అమ్మ చూడకుండా బాల్చీ బావిలో పారేస్తాను సార్.

ఉపాధ్యాయుడు:-ఛా! ఛా!! అల్లా చెప్పిన వెధవ ఎవడ్రా?

మరొక విద్యార్థి:-మీ అబ్బాయేనండి!

—శ్రీ పి. రామారావు (రామచంద్రపురం)

సూర్యంగాడి కవిత్వం

పిల్లల నాటిక

శ్రీ నిట్టల విజయభాస్కర్

[తెరఎత్తగానే ఒక చిన్న గది కనిపిస్తుంది. గది మధ్యలో ఒక టేబులు: దానికి రెండు ప్రక్కలా రెండు కుర్చీలు ఉంటాయి. ఆ రెండు కుర్చీలలోను ఎదురెదురుగా సూర్యం, అతని స్నేహితుడు రామం, కూర్చొని ఉంటారు. సూర్యం వయస్సు, 12 సం॥, రామం వయస్సు 14సం॥లు]

సూర్యం:-ఒరే రామం! నేనొక పని చేద్దామను కొంటున్నానురా.

రామం:- ఏం పనిరా అది సూర్యం - దొంగపనేనా?

సూ:-ఛా! అల్లాంటివి కాదురా! నేను కూడా ఒక రచయితనై పోదామను కుంటున్నానురా!

రా:-ఓ...దానికేం? నిక్షేపంగా కావచ్చు.

సూ:- నిక్షేపంగా కావచ్చునని నువ్వు చెప్పేదేమిటోయ్ - నాకే తెలుసు!

రా:- అయితే మరి నాతో ఎందుకు చెప్పేవు?

సూ:-నాకో సందేహ మొచ్చి..

రా:- ఓహో, అదా? అయితే చెప్పు ఆధర్మ సందేహ మేమిటో.

సూ:- ఏమిటంటే... ఓం ప్రథమంగా కథ వ్రాయడమా; లేక, ఏదైనా పద్యం వ్రాయడమా అని.

రా:- నాకూ అంతగా తెలియదురా!

సూ:- మహా తెలియడానికేముందిలే ఇందులో. ఏదో నీకు తోచింది చెప్పు.

రా:- అయితే చెప్పెయ్యమంటావా?

సూ:-ఊఁ, చెప్పు!

రా:- నిజంగా, నాఉద్దేశ మేమిటంటే-కథకన్నా పద్యమే సులభం ఎందుచేతనంటావేమో. పద్యమైతే ఏవో నాలుగు పంక్తులు రాసి అక్కడ పడేస్తే తీరిపోతుంది. కథ అయితే,-ఎల్లా లేదన్నా ఒక రెండు పేజీలయినా వ్రాయాలి.

సూ:-అవున్రోయ్! నువ్వు చెప్పినట్లు పద్యమైతే-ఏ నాలుగు పంక్తులతోనో ఒదిలిపోతుంది. పద్యం రాయటానికేముందిరా? వెధవ పద్యం! మన తెలుగు పుస్తకంలో లేదూ- "అక్కరకు రానిచుట్టము" అనే పద్యం; అల్లాంటి పద్యమేదో ఒకటి వ్రాసేయవచ్చును.

రా:-అల్లా అనుకుని, ఎందులోనైనా చూచి కాపీ మాత్రం కొట్టకురోయ్. తరవాత కొంప మునుగుతుంది.

సూ:- ఛా! ఛ! అల్లాంటి పనెందుకు చేస్తారా? నాకవిత్వం అంటే ఏమో అనుకుంటున్నావేమో? చూస్కో రేపు ప్రొద్దుటికి ఎల్లాంటి పద్యం వ్రాసుకొస్తానో!

రా:- పద్యం అంటే వ్రాస్తావు గానీ, మరి దానిని పత్రికకి పంపడానికి పోస్టు ఖర్చులకి డబ్బెక్కడ తెస్తావ్?


సూ:- డబ్బులెన్ని కావాలేమిటోయ్, మహా! ముప్పై మూడుఅణాలుంటే ఎక్కువ. మధ్యాహ్నం మాఅమ్మ పడుకొన్నప్పుడు ఏదో మస్కా వేసి ఒక పావలా సంపాదిస్తే సరిపోతుంది.

రా:-అయితే రేపు నీ రచన పత్రికకి పంపి తీరతావన్నమాటేగా...?

సూ:-మరేమిటనుకొన్నావోయ్, మన తడాఖా?

రా:-(వేళా కోళంగా) ఒకవేళ ఆపత్రిక వాళ్లు ఆపద్యం తిరిగి పంపేస్తేనో?

సూ:-(ధాటీగా) ఎందుకు తిరిగి పంపుతార్రా? ఈ రాత్రికే మా నాన్నగారి పెన్ను తీసుకొని ఒక మాంఛి తెల్లకాగితంపైన వ్రాసి పచ్చని కవరులో పెట్టి పంపేసంటే పత్రికలో పడటమేకాదు - దానితస్సదియ్యా-పారితోషికం కూడా వస్తుందోయ్!



షేక్స్పియర్ కవి ఆంగ్లములో రచించిన "మర్చెంటు-ఆఫ్-వనీన్"కు తెలుగు అనువాదమైన "ధనలోభి" అను నాటకమును ప్రదర్శించిన శ్రీ శారదా ప్రాథమికోన్నత పాఠశాల (మాంబళం) విద్యార్థి బృందం (19-4-53) ముందటివరుస మధ్యనున్నది. డి. ఉపేంద్ర సాయిప్రసాద్ (న్యాయాధిపతి) —

సూర్యంగాడి కవిత్వం

రా:-అల్లాగా? నిజంగానే వస్తుందన్న మాట

సూ:- చూడు! తప్పకుండా వచ్చి తీరుతుంది.

రా:- అది సరేగాని, ఇప్పటికే చాలా పొద్దుపోయింది. మాఅమ్మ కొడుతుంది వస్తా.

(తెర)

(మర్నాడు ప్రొద్దున్న సూర్యం వాళ్లయింట్లో - సూర్యం తండ్రి భద్రంగారు రుసరుస లాడుతూ రంగంమీదికి వస్తారు.)

భద్రం:- ఒరేయ్ సూర్యం! సూర్యం; నిన్నే! మాట్లాడవేంరా వెధవా! నా పెన్ను పాళీ ఎవర్రా విరగ్గొట్టింది?

సూ:-(భయంగా) ఏ...మో... నాకు తెలియదు.

భ:- ఛా! వెధవా, తెలియదంటావ్! నిన్నరాత్రి యాకలంతో నువ్వేదో రాస్తూండగా మీఅమ్మ చూచిందట. నిజం చెప్పు, లేకపోతే చంపేస్తాను.

సూ:-అ...అమ్మ చూసిందా? ఎ...ఎ...ఎప్పుడు చూసింది?

భ -ఓరి దొంగ వెధవా! పాళీ విరగ్గొట్టి, పైగా బొంకుతున్నావా? (అని సూర్యం జుట్టు పట్టుకు ముందికి వంచి వీపుమీద నాలుగు దెబ్బలు తగలనిస్తాడు)

సూ:- కొట్టకండీ! నాన్నగారు! నిజం చెబుతాను ఆగండీ, అబ్బ! అమ్మా! (అంటూ ఏడుస్తాడు)

భ:- ఊ! చెప్పు ఎవరు విరగ్గొట్టేరు?

సూ:- మరి ... ని ... నిన్న సాయంత్రము చూచి వ్రాత వ్రాస్తూంటే విరిగి పోయిం......

భ:- అల్లాగా? నేను ముందే అనుకున్నాను ఈ త్రాష్టపు వెధవే చేసివుంటాడని. వెధవేషాలూ; నువ్వూను! ఐదవక్లాసు వెలగబెట్టుతున్నాడో లేదో, వీడికి పెన్ను కావాసి వచ్చింది: పెన్ను!

(సూర్యం- ఎక్కి ఎక్కి ఏడుస్తూంటాడు)

భ:- పైగా ఏడుస్తున్నావా? ఇక ఎప్పుడైనా, నాపెన్ను తీశావంటే...జాగ్రత్త!! తెలిసిందా

(తెర)

(సూర్యం క్లాసురూమ్)

మేష్టారు:-అందరూ లెఖ్ఖలు చేశారురా? ఒక్కొక్కళ్లే హోంవర్కు పుస్తకాలు పట్టుకొచ్చి టేబుల్ మీద పెట్టండి (అందరూ పుస్తకాలు తీసికెళ్ళి టేబుల్ మీద పెడతారు. సూర్యం పుస్తకం పైనే ఉంటుంది. ఆ పుస్తకం తెరచి చూచి...)

మేష్టారు :-ఒరేయ్ సూర్యం నించోరా! ఏమిట్రోయ్, ఇదేనేమిటి నీ హోంవర్కు? (అందరికి వినిపించేలా పద్యం బిగ్గరగా చదువుతాడు.)

"పాము కప్పను మింగెన్
పామును ముంగిసకొరికెన్
ముంగిసని పందికరచెన్
పందిని ఎద్దుకుమ్మెన్.

—రచన
"సూర్యం"

ఓహోహో! ఏం కవిత్వంరా !! (అని పకపక నవ్వుతాడు. మేష్టారుతోపాటు క్లాసులోని పిల్లలందరూ గొల్లుమని నవ్వుతారు మేష్టారు సూర్యాన్ని దగ్గిరికి పిలిచి ఆ కాగితం వాడికి యిచ్చేస్తాడు. సూర్యం

వేలవేసిన మొఖంతో తిరిగి వచ్చి తన సీట్లో కూర్చుంటాడు).

(అదే బెంచీమీద కూర్చొన్న రామంతో, సూర్యం)

సూ:-ఒరేయ్ రామం; నీమూలంగానేరా నన్ను చూసి అంతా నవ్వుతున్నారు.

రా:-బాగావుందిరోయ్ వరస! నీ రచన చూచి వాళ్లు నవ్వడం ఏమిటి, ఆనవ్వడం నా మూలంగా జరగుతున్నదనడమేమిటి?

సూ:-అదికాదురా! నా రచన నీకు చూపిద్దామని బడికి తీసుకు వచ్చేను. తీరా అది లెఖ్ఖల పుస్తకంలో పెట్టి మర్చిపోయాను. మేష్టారి కళ్ళ పడింది. అదీ నే నన్నది.

రా:-నిజంగా నా కోసమే పట్టుకొచ్చావా? అరే వెధవ బుర్ర; ఆ మాత్రం జ్ఞాపకం లేదురా?

సూ:-ఏం చేస్తాముర బాబూ? అదంతా మన ఖర్మ!

రా:-అయినా నేనొక విషయం చెబుతాను నీకు కోపం రాదుకదా?

సూ:-కోపం ఎందుకూ? చెప్పు అదేమిటో.

రా:-ఏమీ లేదు కాని, నీ రచన అంత బాగోలేదేమోరా?

సూ:-(గంభీరంగా) బాగా ఉండక పోవటమేమిట్రా? ఆ వరస, ఆ పదాలు, అంతా బాగుంటేను! ఈ లెక్కలు చెప్పుకునే మేష్టారికి ఏం తెలుసురా, పద్యాల విషయం? అస్తమానం ముక్కుపొడుం పీల్చటం తప్ప! నీకే తెలుస్తుందిలే నా రచన పత్రికలో పడ్డాక!

రా:- ఆ పద్యం ఏదీ ? - మళ్ళీ నన్నొకసారి చూడనీ.



సూ:- (సంచీలోనుంచి తీసి రామానికిస్తూ) దీన్ని యింత అందముగా వ్రాయడం కోసం, మా నాన్నగారి పెన్ను పాళీ కూడా విరగ్గొట్టేనురా. ఎంతకష్టపడి రాసేనో నీకేం తెలుసు!

రా:-(మళ్ళీ చదివి, వస్తున్న నవ్వాపుకుంటూ) సరే నీ యిష్టం. బెల్లయింది. ఇంటికి పోదాం పద.

(తెర)

(సూర్యంఇంట్లో. బియ్యం బస్తాకి దగ్గిరగా సూర్యం, వాడి తమ్ముడు పాపిగాడూ నిలబడి వుంటారు.)

సూ:-ఒరేయ్ పాపిగా! నువ్వు వసారాలో కూర్చొని అమ్మ రాగానే గట్టిగా దగ్గు. వెంటనే నేను ఇవతలికి వచ్చేస్తాను. తెలిసిందా? మర్చిపోయేవు గనుక!

పాపి :-ఓ...అల్లాగే మరి నాకు

(42-వ పేజీ చూడండి)

సూటులోని కిటుకు

ఎలిజబత్ మహారాణిగారిపట్టాభిషేకమహోత్సవానికి ఇంగ్లండుకు రావలసినదంటూ శ్రీ కదన జనక మదనమోహన బాల సూర్య చంద్ర ప్రకాశరావు బహద్దర్ మన్నె సుల్తాన్ జమీందారు వారి కాహ్వానం వచ్చింది.

మహారాణీ వారి వద్దనుండి ఆహ్వానమంటే మాటలా మరి? ఆ ఆహ్వాన పత్రికను అయిదుసార్లు చదివించుకొని, విని, ఆ ఆనందంతో గంతులు వేశాడు జమీందారుగారు. ఆ ఆనందాతిరేకంతో ఆయన బుఱ్ఱ కొద్దిగా పనిచేయసాగింది. ఇంగ్లండు యెలా వెళ్లాలి? ఏయే నజరానాలు తీసుకొని వెళ్లాలి? ఏ డ్రస్సు వేసుకోవాలి? వెనుకొకసారి రౌండు టేబుల్ కాన్ఫరెన్సుకని ఆహ్వానిస్తే గాంధిమహాత్ముడు కొల్లాయి గుడ్డ కట్టుకొని వెళ్లాడట. అది చూచి అక్కడివారంతా నవ్వారట. అలాంటివాడు తగుదునమ్మా అని ఇంగ్లండు వెళ్లడానికి తయారుకావడ మెందుకు? నలుగురిలో నగుబాట్లు కావడమెందుకు? మరి,మనం వెళ్లామంటే అలా వెడతామా? హే! దొరల పక్కలో సూటు, బూటు వేసుకొని వెళ్లుతాం. నిజమే కానీ, నాకు సూటులేదు. ఇప్పుడు సూటొకటి కుట్టించాలి. ప్రపంచంలో యింతవరకు యెవరూ కని, విని యెరుగనటువంటి సూటు కుట్టించాలి. పట్టాభిషేకమహోత్సవానికి వచ్చిన వారంతా నా సూటుచూచి ఈర్ష్యపడాలి, వాళ్ళ ఈర్ష్య నాకు గర్వకారణం కావాలి' అంటూ ఏవేవో, అంచెలు అంచెలుగా ఆలోచనలో అల్లుకు పోయాడు.

జమీందారుగారి వయస్సు యాభై సంవత్సరాలు. ఎత్తు నాలు గడుగుల రెండంగుళాలు. చుట్టుకొలత 132 అంగుళాలు. బట్లర్ యింగ్లీషు మాట్లాడుతాడు. పైచరణం క్రిందికీ, కింది చరణం పైకి పెట్టి తలా తోకా లేకుండా యేవో సంస్కృత శ్లోకాలు చదువుతాడు.

'రవి'

ఆ శ్రుత పాండిత్యంతో పండితులను పిలిపించి సాహిత్యగోష్టులు జరుపుతాడు. ఎదుటివారివాదన యెంతటి సత్యమైనా, దానిని ఆయన కాదంటే కాదు; అవునంటే అవును. అంతే దానికి తిరుగులేదు. ప్రజల్ని పీల్చి పిప్పిచేసి వసూలు చేసినధనం కోట్లకు కోట్లు కోశంలో మూలుగుతున్నది.

"దొర తలుచుకుంటే దెబ్బలకు కొదువా?" అన్నట్లు తన సెక్రటరీని చైనా పంపించి అక్కడనుంచీ మంచి పట్టు తెప్పించి దానిని బెనారస్‌లో నేయించాడు. పగటిపూట సూర్యకాంతికి ఆ గుడ్డ మిడిసిపడుతోంది. ఫ్రాన్సునుండి ఒక నిపుణుని పిలిపించి బొంబాయిలో 'వైట్ వే లెయిడ్ లా' అనే ఇంగ్లీషు ఫరములో సూటు కుట్టించాడు. ఢిల్లీ నుండి పదిమంది బుటారీ పనివారిని పిలిపించి, దానిమీద నవరత్నాలతో బుటారీ పని చేయించాడు. ఈ బుటారీ పని చేయడానికే సుమారు మాసం రోజులు పట్టింది. ఈ మాసం రోజులు తన సిబ్బందిని యీ పనివారి చుట్టూ కాపలా పెట్టాడు. చివరకు యెలాగైతేనేం సూటు తయారయింది. తయారు కావడంలో అల్లాగిల్లా కాదు-సూట్ల చరిత్రలోనే అద్వితీయంగా తయారైంది!!

బయలుదేరవలసిన కాలం సమీపిస్తున్నకొద్దీ జమీందారు గారికి ఆదుర్దా యెక్కువైంది. తన ప్రయాణానికని ఒక ఇటలీఓడను యేర్పాటు చేసుకొని ఆ ఓడలో యీ సూటు కోసమని ఒకగదిని ప్రత్యేకించాడు. సూటును యెవరూ దొంగిలించకుండను, చేతులు వేసి పాడుచేయకుండా వుండేందుకు గాను, స్కాట్లండు యార్డు పోలీసులను పిలిపించి దానికి కాపలా పెట్టాడు. ఎటు పోయి ఎటువస్తుందోనని అమెరికా నుండీ ఒక మహా డిటెక్టివ్‌ని గూడా పిలిపించాడు. దీనికంతా అయిన ఖర్చు - మొత్తం రెండు కోట్ల యాభై యెనిమిది లక్షల రూపాయలు.

ఇంతకూ తను ఇంగ్లండుకుపోతే అక్కడ యెలా నిలబడాలో, ఎలా కూర్చోవాలో అక్కడ పద్ధతు

లేమిటో తనకు తెలిసి చావవాయె! అందుకని బొంబాయిలోని వైట్‌వే లెయిడ్‌లా కంపెనీ ద్వారా ఇంగ్లండు నుంచీ ఒకాయనను పిలిపించి, తన 'ఎటికేట్' మినిష్టరుగా నియమించాడు. ఎటికేట్ మినిష్టరుగారి పనేమిటయ్యా అంటే, స్వారస్యపు త్రాడు పట్టుకొని జమీందారు గారిని ఆడించడం. మరోపని లేదు.

జమీందారుగారు యెక్కిన ఓడ 'బొంబాయిరేవు వదలింది. అంతవరకు సూటుని కండ్లతోనైనా చూడని ఎటికెట్ మినిష్టరు గారు, ఓడలో సూటుని చూచి, రాజాగారితో "ఈ సూటుని మీరు ఇంగ్లండులో వేసుకోరా"దన్నాడు.

"కారణం?"

"ఎటికెట్‌కి విరుద్ధం"

"అయితే రౌండు టేబుల్ కాన్ఫరెన్సుకి వచ్చినప్పుడు గాంధీగారు గావంచా యెలా కట్టుకొన్నాడయ్యా?"

"అవును. ఆయన నారు గావంచా కట్టుకొన్నారు."

"మరి అది ఎటికేట్ విరుద్ధం కాదా?"

"మీరు ఫలానా, ఫలానా బట్టలు వేసుకొని కాన్ఫరెన్సుకి రావాలని బ్రిటిష్ గవర్నమెంటు ఆయనతో ముందుగా 'ట్రీటీ' యేమీ చేసుకోలేదు. ఒకవేళ అలాంటినియమ నిబంధనలు పెట్టినా ఆయనగారు లొంగేఘటం కాదు. అందుకే ఆయనను మహాత్ముడన్నారు. బ్రిటిష్‌శాసనాలకుఆయనగారు లొంగడు."


"నేను కూడా కాస్త పరువు ప్రతిష్టఉన్న అతిథినే నయ్యోయ్. నా జమీందారీ...నా ఐశ్వర్యం..."

"ఇవి యెన్నున్నా నీవు మా మహారాణీగారి అడుపాజ్ఞలలో నుండవలసినవాడివే!"

"అయితే కావచ్చు. నేనొక సామంతరాజునే కావచ్చు. నేనిలాంటి సూటు వేసుకొనకూడదని మహారాణీగారితో యెలాంటి ఒడంబడికా చేసుకోలేదే?"

"చేసుకోకపోవచ్చు. కాని యిది ఎటికెట్‌కి విరుద్ధమని చెప్తున్నాను. నేనిక్కడకు రాబోయే ముందే మీరు యింగ్లండులో నున్నంతకాలం వేసుకోడానికని మీసూట్లకు యింగ్లండులోని ఒక షరంకు ఆర్డరు యిచ్చి వచ్చాను. మనం ఓడ దిగగానే రేవులో వాటిని మన కందచేస్తారు."

"నే నొప్పుకోను. ఈ సూటు





అవూ; దూడ

చిత్రకారుడు : శ్రీ ఎన్. యువరాజ్ (మద్రాసు)

★ సూటులోని కిటుకు ★

వేసుకొంటే పట్టాభిషేక మహోత్స వంలో పాల్గొంటాను-తప్పదు!"

"వీలు లేదు!"

"ఎందుకు వీలు లేదు?"

"ఇది ఎటికేట్ కి విరుద్ధమని మొదటే చెప్పాను."

"అయినప్పటికీ నేను యీ సూటు వేసుకొంటే ఏమవు తుందంటావ్?"

"ఇంగ్లండులో వాళ్లంతా నిన్ను పిచ్చివాడి క్రింద జమకడతారు."

"నావంటి జమీందారుని పట్టుకొని అలా మర్యాద లేకుండా మాట్లాడుతారా?"

"మర్యాద కాదండి. 'ఎటికేట్' ఇంగ్లండు సభ్యతగల దేశం. అక్కడంతా ఒకేరకమైన దుస్తులు ధరిస్తారు."

"నేనీ సూటు వేసుకోకపోతే యీ పట్టాభిషేక మహోత్సవానికి వచ్చినట్లు మీ ఇంగ్లండు ప్రజలకెల్లా తెలుస్తుంది?"

"దానికేముంది మా మహా రాణీగారిని పొగుడుతూ ఒక ఘనమైన ఉపన్యాస మివ్వండి."

"మరి యీ సూటో?"

"చెప్పతున్నాను కదండీ-ఇది ఎటికేట్ కి విరుద్ధమని!"

"జమీందారుగారికి కోప వచ్చింది. ఆయనగారి ఉత్సాహ మంతా పొయింది. ఒక్క నిట్టూర్పు విడిచి "అయితే నేను లండను రావడం వృథా" అన్నాడు.

"ఎందుకనీ?"

"లండనులో నేనీ సూటు వేసు

కోకపోతే నేను రావడం వృధా కాక మరేమిటి?

"పోనీ మీరొక్క పని చేస్తారా?"

"ఏమిటి?"

"లండను నుండి తిరిగి రాగానే మీ సంస్థానంలో గొప్ప విందొకటి యేర్పాటుచేసి, అప్పుడు మీరీ సూటు వేసుకోండి."

"అప్పుడు మాత్రం ఎటికేట్‌కి విరుద్ధం కాదా?"

"మీ భారత దేశంలో యీ ఎటికేట్ పట్టింపులు లేవు."

"అవును నిజమే. నా సంస్థానంలో నాయిష్టం వచ్చినట్లు నడుచుకొంటాను. అభ్యంతర మేమిటి? ఎవరైనా నోరెత్తితే చమడాలు వొలుస్తాను."

"నిరభ్యంతరంగా వొలిచెయ్యండి!"

జమీందారుగారి ఆనందానికి మేర లేక పోయింది.

లండను నుండి తిరిగి రాగానే రాజాగారు దర్బారు యేర్పాటు చేశాడు. రాజులకీ, మహారాజులకి, పెద్ద పెద్ద ఉద్యోగస్తులకీ ఆహ్వానాలు పంపించాడు. ఢిల్లీనుండి సంగీత విద్వాంసులను, కాశీనుండి నాట్యకత్తెలను పిలిపించాడు. సంస్థానమంతటా పచ్చ పచ్చని తోరణాలతో మేళ తాళాలతో కలకలలాడుతోంది. ఇక రేపు దర్బారు జరుగుతుందనగా జమీందారుగారు సూటు వేసుకోవడమెలాగా అని 'రిహార్సల్సు' మొదలెట్టాడు. ఎలానో నాలుగైదు గంటలు తంటాలుపడి సూటులోకి దూరాడు. ఇంతా చేస్తే అది బిగుతైంది. ఆయనకు ఊపిరాడలేదు. వెంటనే బొంబాయి కంపెనీ వారికి వైరు చేశాడు.

"అయ్యా! అందులో మాదేమీ పొరపాటులేదు. ఆ నిపుణుడు చెప్పిన

(42-పేజీ చూడండి)

పేరుల తీరు

వేం అయిదుగు రన్నదమ్ము లం. అందరిలోనూ చిన్నాడిని నేనే! అవసరం వచ్చినప్పుడు అన్నలందరూ నన్ను "తమ్ముడూ" అని మహా మురిపెంగా పిలుస్తూ, వెల్లించి పన్లు చేయించుకుంటూంటే, "తమ్ముడుగా వుపయోగించుకొందుకు నాకెవ్వరూ లేక పొయ్యారే" అని దిగులుగా వుండేది. ఒకొక్కసారి యీసంగతే అమ్మానాన్నా దగ్గర చెప్పుకొని యేడ్చేవాణ్ని కూడా. దానికి మా నాన్న నవ్వేవారు. మా అమ్మ మొట్టికాయ తగిలించబోయేది.

కథ యిట్లా సాగుతూండగా ఒకరోజు మాయింట్లో అందరూ చాలా హడావుడిగా తిరుగుతున్నారు. ఎవరో మంత్రసానులు రావటం, మా అమ్మ "అయ్యో, అమ్మో" అని గదిలోనుంచీ కేకలు వేస్తూ యేడవటంజరిగింది. అదంతా చూస్తూంటే నాకు మొదట్లో యేమీ అర్థం కాలేదు.

కొంత సేపయ్యాక నాయనమ్మ నాదగ్గరికొచ్చి "నీకు చెల్లిపుట్టిందిరా, చిట్టి నాయనా!" అంది.

తమ్ముడికి బదులు చెల్లెలు పుట్టినందుకు కొంత విచారం వెళ్లబుచ్చాను. "ఎవరైతేయేం, చేదా? నిన్ను 'అన్నయ్యా' అని పిలవటమేగా నీకు కావలసింది?" అంది నాయనమ్మ.

అయిదుగురు మొగపిల్లలు తరువాత ఆడపిల్ల పుట్టినందుకు అందరూ సంతోషంగా వున్నారు: నేనుకూడా వాళ్లతోటే కలిసిపోయాను. ఆకారణంచేతనే చెల్లెలి బారసాల జోరుగా చెయ్యాలనుకున్నారు, నాన్నకూడా!

శ్రీ పి. ఎస్. మూర్తి

బాలసారె రోజున యింట్లో అంతా హడావుడిగా వున్నారు. నాయనమ్మా, అమ్మమ్మా దొడ్డమ్మా, అత్తయ్యా, అంతా వంటల్లో మునిగారు. బాలసారె ధర్మమా అని, నాకు మానాన్న కొనిపెట్టిన కొత్తబట్టల సందట్లోనూ పిండివంటలు తినోచ్చు గదా అన్న సంబరంలోనూ నేను మునిగి వున్నాను.

బాజాలు వచ్చేయి. విభూతికట్లు దట్టించేసుకొని శాస్త్రిల్లుగారు వారి శిష్య బృందంతో సహా విచ్చేశారు.

పీటలమీద అమ్మా నాన్నా కూర్చొని వున్నారు. చెల్లాయి అమ్మ ఒడిలో పడుకొని యీ గొడవతో తనకేమీ సంబంధం లేనట్లుగా నిద్రపోతోంది. శాస్త్రిల్లుగారు మంత్రపు ధ్వని కొంచెం తగ్గించి నాన్నతో "యేం పేరు పెడతారండీ" అన్నారు.

"యేంపేరే?" అన్నాడు నాన్న అమ్మవైపు తిరిగి.

"మా అమ్మ పేరు పెడుదామండీ" అంది అమ్మ.

ఆవిడ పేరు చిన్నమ్మ

"మాఅమ్మపేరు కూడా కలిపితేనో?" అన్నాడు నాన్న:

'సరే' అంది అమ్మ: ఆవిడ పేరు "వెంకమ్మ". ఇంతలో పప్పురుబ్బుతున్న దొడ్డమ్మ ఆచేతుల్తోనే ఒచ్చి, అమ్మ చెవిలో యేదో వూదింది:

"ఏమండీ పాపం-మాఅక్కయ్యకి బిడ్డలూ పాపలూ యెవ్వరూ లేరు కదా! ఆవిడపేరు మాత్రం యెవరు పెట్టుగుంటారండీ?" అంది అమ్మ నాన్నతో.

"సరేలే" అన్నాడు నాన్న.

ఆవిడపేరు పెద్ద నరసయ్యామ్మ అక్కడికి చెల్లిపేరు "చిన వెంకట పెద్ద నరసయ్యామ్మ" దాకా పెరిగింది.

"సరి అంటే సరి" అనుకునే సరికి మాచిన్న అత్తయ్యా వచ్చి "ఆయన పోనే పొయ్యారు, నాపేరూ, నా గోడూ యెవరికొవాలి" అంటూ వెళ్లబోసుకుంది నాన్న దగ్గర.

"సరేలే! దీనికెందు కింతపోరు" అన్నాడు నాన్న.

ఆవిడపేరు. "వీరమ్మ"

"చినవీర వెంకట పెద్ద నరసయ్యమ్మ" దాకా పెరిగిన చెల్లాయి పేరు, శాస్త్రిలుగారు బియ్యంలో రాయించటానికి, వుపక్రమించుకూండగా నాయనమ్మొచ్చి—

"ఒరే! అబ్బాయీ! మాఅమ్మ వచ్చిపోయి ఏలోకాన్నుందో కాని, మారేళ్లా పసుపూ కుంకుమతోటే బతికిందిరా! మహా యిల్లాలు! ఆవిడపేరు కూడా కలిపితే నిత్యేసంలా వుంటుంది." అంది; నాన్నని సంబోధిస్తూ.

ఆవిడపేరు "బుల్లెమ్మ"

"ఓవర్‌లోడు" వేసిన బస్సులా చెల్లాయిపేరు "చినవీర వెంకటబుల్లి పెద్ద నరసయ్యమ్మ" దాకా పాకింది.

సరి అంటే సరి అన్నారందరూ. మూరెడు పొడుగైనా లేని చెల్లాయికి బారెడు పేరు తగిలించేశారు.

"విధవ బస్సు దారి మధ్యలో పాడయిపోయింది లేకపోతే నామకరణ సమయానికి చేరుకొనే దాన్నే! అయినా నాపేరు వాడి కూతురికి పెట్టుగోవాల్సిన ఖర్మ వాడికేం కాలిందిలే?" అంటూ వెక్కిణ్ణించే నస పెట్టుతూ వచ్చింది- మానాన్న పెద్దక్కయ్య:

నేను యీ గొడవేమీ పట్టించుగోకుండా చెల్లి ధర్మమా అని ఒండిన పప్పుభక్ష్యాలు బాగా పట్టించేసి తమలపాకులు లాగించాను.

శాస్త్రిలు గారు కూడా నాకు మల్లేనే తంటాలుపడి తిన్నంత తిని పెద్దమాట నెత్తిపైన పెట్టుగొని సమదారి పట్టేరు, చెల్లెలుమీద నాలుగు అక్షింతలు జల్లేసి. శాస్త్రిలుగారు తంటాలు పడలేక వదిలేసిన బావతు సరుకులు వారి శిష్య బృందం చక్కబెట్టేసి వారి గురువుగారన్ను సరించారు.

దినాలు చాలా గడిచేయి. చెల్లెలికి యిపుడు అయిదో యేడు. అక్షరాభ్యాసం నాడు మాఅమ్మా నాన్నా పీటలమీద కూర్చున్నప్పుడు అయిదేళ్ల క్రితం జరిగిన చెల్లి బారసాల గుర్తొచ్చింది.

చెల్లికి మాటలు వచ్చింది మొదలు దానిపేరుని పట్టుకొని అందరూ తాటిబెంకని పీకినట్లు పీకేస్తున్నారు. అమ్మ "చిన్నమ్మా" అంటే, నాయనమ్మ "బుల్లి వెంకమ్మా" అంటుంది. అత్తయ్య "వీరమ్మా" అనిపిలిస్తే, దొడ్డమ్మ "పెద్ద నరసయ్యమ్మా" అని పిలుస్తుంది.

ఈవిధంగా మా యింట్లో ఓ 'ఎలక్షను బూతు' తయారైంది: నాన్నవైపు వారంతా ఆఖరుకి "బుల్లి వీర వెంకమ్మ" అని వుమ్మడిగా కూడపలుకుకొని పిలవటం మొదలు పెడితే, అమ్మవైపు వారంతా "చినపెద్ద నరసయ్యమ్మ" అని పిలవటం మొదలు పెట్టారు.

మాచెల్లెలు ఈపేర్ల గొడవేమీ పట్టించుగోలేదు: బళ్లో మేష్టారు 'చిన వీర వెంకట బుల్లి పెద్ద నరసయ్యమ్మా, హాజరు పలుకమ్మా' అంటే చెల్లాయి "ఊ" అనేది.

ఆఖరుకి చెల్లి పెళ్లి కూడా అయిపోయింది. పెళ్లిలో మాబావ పేదిమలు త్రిప్పుకొంటూ పేరు చెప్పేవాడు నానా అవస్థపడుతూ.

కాపురానికి వెళ్లిన రెండు సంవత్సరాలకి చెల్లీ బావా వచ్చేరు మాయింటికి. అందరి ముందూ "పొన్నమ్మా! కొంచెం నీళ్లు తీసుకురా!" అన్నాడు; మాబావ చెల్లిని వుద్దేశించి.

"అదేమిటోయ్ నిత్యేసంలాంటి పేరు వుండగా 'పొన్నమ్మా' అంటావు?" అని మాఅమ్మ అడిగింది.

"ఏంలేదు: మా నాయనమ్మ పేరుపెట్టమంది మాఅమ్మ: అందుకని మీఅమ్మాయిపేరు మార్చేసి, 'పొన్నమ్మా' అని పిలుస్తున్నాను." అన్నాడు.

ఇది విని మాయింటిల్లిపాదీ వారు నోరునొక్కుకొన్నారు; గుడ్లనీరుక్కేవారు గుడ్లనీరు పెట్టారు. ★

పది, పన్నెండేళ్ల కుర్రాడొకడు పెద్ద అంగట్లోకి పరుగెత్తుకు వచ్చాడు.

"ఏం కావాలి?" అని అడిగాడు అక్కడవున్న నౌకరు ఒకడు.

"మానాన్న గారిని పెద్ద ఆంబోతు ఒకటి వెంటబడి తరుముతోంది."

"ఎక్కడ?"

"ముందు నా కెమెరాలో ఫిల్ము లోడ్ చేయండి, ఊ!! త్వరగా..."

సూటులోని కిటుకు

(39-వ పేజీ తరువాయి)

లెఖ్ఖల ప్రకారమే మేము కుట్టా మని" జవాబిచ్చారు ఆకంపెనీ వాళ్లు.

వెంటనే నిపుణున్ని పిలవండన్నారు. నిపుణుడు విమానంలో వచ్చి వాలాడు. ఆయన కంటికి అగుపించగానే రాజాగారు మండి పడ్డారు- "ఏమిటయ్యా యిదంతా: ఇంతగా మోజుపడి నేను సూటు కుట్టిస్తే, ఆయనగారేమో అది లండనులో వేసుకోవడానికే పనికి రాదన్నాడు. పోనీ నాసంస్థానంలో నైనా వేసుకొందామా అంటే, బిగుతైంది. ఇంత ఖర్చుపడి నిన్ను ఫ్రాన్సునుండి పిలిపిస్తే నీవు చేసే పనియిదా?" అని గసాయించి అడిగేశాడు.

"అయ్యా! నాదేం పొరపాటు లేదు. అయినా-ఏదీ యిప్పుడు వేసు కోండీ సూటు?" అన్నాడు నిపుణుడు.

జమీందారుగారు తంటాలుపడి మరల సూటులోకి దూరి "చూడ వయ్యా యెంత బిగుతైందో" అన్నాడు.

నిపుణుడు జమీందారు గారిని ఎగా దిగా చూచి "అయ్యా! తమరు సూటు తిరగవేసి తొడిగా" రన్నాడు.

జమీందారుగారు గంట సేపు తిప్పలుపడి సూటు సరిగా తొడిగి "సెబాస్" అంటూ విమానంమీద చెయ్యి వేశాడు.

ఎంతఖర్చు అయితే నేం? ఎన్ని తిప్పలు పడితే నేం?-నవ రత్నాలు పొదిగిన సూటు వేసు కొని జమీందారుగారు విందుకు వెళ్లగలిగేరు. అంతే చాలు! ★

సూర్యంగాడి కవిత్వం

(35-పేజీ తరువాయి)

కూడా డబ్బులిస్తావా? లేకపోతే నేచెప్పేస్తాను.

సూ:-ఇస్తాలేరా బాబూ! నువ్వు మాత్రం అమ్మ రాగానే దగ్గాలి; లేకపోతే మన దొంగతనం బయట పడిపోతుంది.

పాపి:-రెండు శేర్లుకన్నా ఎక్కువ తియ్యకురోయ్. మళ్లీ అమ్మకి గుర్తు తెలిసిందంటే ఒళ్లు వాచేలా కొడు తుంది!

సూ:-అలాగేలే! నువ్వుమాత్రం జాగ్రత్త సుమా (పాపిగాడు వసారాలోకివెళ్లిపోతాడు. సూర్యం బస్తాలోనుంచి బియ్యం తోడుతుం టాడు. రెండునిమిషాలు పోయాక సూర్యం తల్లి - సీతమ్మగారి-కంఠం తెర అవతలనుంచీ వినిపిస్తుంది.)

సీతమ్మ:-సూరిగాడేడిరా, పాపీ?

పాపిగాడి గొంతుక:- (దగ్గుతూ) అల్లా వీధిలోకి వెళ్లిపోయాడే అమ్మా.

సీ:-అదేమిట్రా? కాఫీ అయినా తాక్కుండా వెళ్ళిపోయాడు. (అంటూరంగంమీదికి వచ్చేస్తుంది)

సీ:-(ఆశ్చర్యంగా) సూరిగా డిక్కడే వున్నాడే! ఆ సంచీ ఏమి టిరా?

సూ:-ఆ!...ఏం లేదు, ఏమీ లేదు! పు...స్త...కా...లు.

సీ:-ఎందుకల్లా భయపడుతావు? ఏమిటో చూడనీ.

సూ:-ఊహూ! ఏమీ లేదంటు న్నాగా, ఏమీ లేదే!!

సీ:-ఏమీ లేదూ! అయితే చూడ నీయవేం? (అంటూ సంచీలాక్కుం టుంది)

సీ:- ఓరి దొంగ వెధవా! పైగా ఏమీ లేదంటావేమిరా? అయ్యో! అయ్యో! రెండు శేర్ల బియ్యం!! దొంగతనం చేద్దామనుకుంటున్నా వురా? ఉండు; నీ పని మీ నాన్న గారితో చెప్పి...

సూ:-అమ్మా...అమ్మా నాన్న గారితో చెప్పొద్దే! ఇంకెప్పుడూ చెయ్యనే, అమ్మా, అమ్మా.

సీ:- తప్పకుండా చెబుతాను, చెప్పి నిన్ను చావగొట్టించక పోతే అడుగు! ఎన్నాళ్ళనుంచి చేస్తు న్నావో ఇల్లాగ, అయ్యో రామా!

(భద్రంగారు ప్రవేశం)

భద్రం:-ఏమిటే అది?

సీ:- వీడు ఎంత గొప్పపని చేశాడో, ఇదిగో చూడండి! రెండు శేర్ల బియ్యం దొంగతనంగా పట్టుక పోతున్నాడు (అంటూ సంచీ చూపి స్తుంది)

భ:- నిజంగానా? ఓరి దొంగ వెధవా! ఎన్నిసార్లు కొట్టినా బుద్ధి రాదేమిరా నీకు? ఛా! వెధవా నీ బ్రతుక్కి సిగ్గులేదట్రా (అంటూ ప్రక్కనున్న చేతికర్ర తీసుకొని పదిదెబ్బలు తగలనిస్తాడు)

(తెర)

(రామం ఇంట్లో)

రా:-ఏంరా సూర్యం వచ్చేశు?

పంపేవా పత్రికకి ?

సూ:- లేదురా! మా తమ్ముడి మూలంగా కొంప మునిగిందిరా!

రా:- ఏం? ఏంజరిగిందేమిటీ?

సూ:- ఏం జరగాలో అదే జరిగింది. పద్యం పత్రికకి పంపాలంటే పోస్టు ఖర్చులు కావాలి కదురా ? అందుకని యింట్లో బియ్యం పట్టుకుపోయి అమ్మి డబ్బులు సంపాదిద్దామని ప్లాను వేశాను. బియ్యం తీస్తూ పాపిగాడ్ని అమ్మరాగానే దగ్గమన్నాను. వాడు మెల్లిగా దగ్గేడుట కానీ నాకు వినిపించలేదు. దొంగతనం బయట పడింది.

రా:-నిజంగా? అయితే పంపలేదన్నమాట?

సూ:- పంపలేదు. అయినా - ఇంక పంపనుకూడా! వెధవ కవిత్వం కోసం పోతే రెండుసార్లు వీపు శుద్ధి అయింది. నాకొద్దురా బాబూ ఈ కవిత్వం! ఈ కవిత్వానికి పదివేల నమస్కారాలు !!

రా:-ఆ విషయం ఇదివరకే నేను చెప్పితే నీకు నచ్చలేదు, ఇప్పుడైనా తెలిసిందా ? (తెర)

★

★ దత్తత ★

(25-వ పేజీ తరువాయి)

"ఇటు తే" చేయిచాచాడు. లక్ష్మి భయంగా అతనిచేతులో డబ్బులు పెట్టింది.

రవి డబ్బులందుకొని, జనాన్ని తప్పించుకొని, కంగారుగా వీధిలోకి వెళ్ళిపోయాడు.

గేటుదాటి రవి బజారువేపు పరుగెడుతున్నాడు. బజారు చాలాదూరముంది. తిరిగివచ్చేటప్పటికి అంతా వెళ్ళిపోతారేమోనని భయంగాకూడా ఉంది. అందుకే మరీ తొందరగా వెళ్ళబోతుంటే; గొప్పు తగిలి క్రిందపడిపోయాడు. బట్టలు కంకర రంగుతో డాగులుపడ్డాయి.

చాకులు అమ్ముతూ దోవవచ్చే ఒక సంటిమనిషి, రవిని లేవదీశాడు. రవి దృష్టి చాకులుమీద పడింది. లక్ష్మి అన్న "ఏదైనా సరవాలేదు" అనేమాట గుర్తుకొచ్చింది. ఆనందంగా చాకులు కేసిచూస్తూ "ఎంత" అని అడిగాడు.

"ఇది రూపాయి. ఇది అర్థరూపాయి, యిది పావలా" అని మూడు రకాలు చూపాడు.

తన దగ్గరఉన్నది పావలాయే! పావలా ఖరీదైన చాకుతీసి, పరిశీలించాడు. ఖరవాలేదు బాగానే వుందనుకున్నాడు. "నేను తీసుకుంటా" అన్నాడు.

"డబ్బులు" చేయిచాచాడు.

రవి జేబులో చేయిపెట్టాడు. లక్ష్మి యిచ్చిన పావలాలేదు. ముఖం వెలవెలపోయింది.

"నీకు యివ్వ లేదూ?" అనుమానంగా అడిగాడు రవి.

"చావుంది..."వాడు నవ్వాడు. "చాకు యిటియ్యి" కోపంగా చూస్తూనే చేయి చాచాడు.

"నేనివ్వను?" బింకంగా అని గిర్కున తిరిగి జమిందారు యింటివేపు పరుగెత్తాడు.

చాకులమ్మే వాడికి అసలే కాలుకుంటి; కుర్రవాడి ప్రవర్తన చాలా ఆశ్చర్యంగా తోచి కదలలేక అక్కడే నిలబడి నేలకేసి చూశాడు. రవి పడినచోట పావలా కనిపించింది. చేత్తో తీసుకొని "బతేకుర్రాడు" అని అనుకున్నాడు.

రవి జమిందారు హాలులో చేరేసరికి జనం చాలామంది వెళ్ళిపోయారు. రాము అక్కడే కూర్చున్నాడు. లక్ష్మి కొత్త దగ్గరగావుంది. రవి రొప్పుకుంటూ రొజుకుంటూ రావడం దూరానున్న జమిందారు చూశాడు. ఆశ్చర్యంగా పైకిలేచాడు. మలినమైన గుడ్డతో వచ్చే ఆ కుర్రవాణ్ని జమిందారు ఎప్పుడో ఎక్కడో చూసినట్లు గుర్తు. అదే ఆలోచిస్తున్నాడు.

"రా మూ! యిప్పుడు వెళ్ళి కొనుక్కొచ్చా" అంటూ చాలా విజయాన్ని సాధించినవాడిలా మడతవిప్పిన ఆ చాకు రాముచేతులో పెట్టాడు.

ఆ చాకుచూసి ప్రక్కనున్న వాళ్ళంతా గొల్లుననవ్వారు. రాముకూడా నవ్వాడు. రవికి ఇదేమీ అర్థంగాక ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

"ఎవరబ్బాయిది" ఈ గంభీరకంఠధ్వని విని అంతా అటు చూశారు. జమిందారు నిలబడిఉన్నాడు.

రవి చూడ్డమేగాని సమాధానం యివ్వలేదు.

"నీపేరు" మళ్ళీ అడిగాడు జమిందారు.

"రవి" స్పష్టంగా సమాధానంచెప్పి తల వంచుకున్నాడు.

ఈపేరు విన్న జమిందారు కాస్సేపు స్తంభించిపోయాడు. ధర్మయ్య కూడా మెల్లగా అక్కడికి వచ్చాడు.

"ధర్మయ్యగారూ ... యీ అబ్బాయీ ..." జమిందారు ఏదో అడగాలనుకుంటూనే! ఇక అడగలేకపోయాడు.

"మా చెల్లెలుగారబ్బాయి" అని నెమ్మదిగా ధర్మయ్య అన్నాడు. ఈ మాటతో జమిందారుకి మరీ ఆశ్చర్యం కలిగింది.

"మీ చెల్లెలుపేరు"

"శాంతమ్మ"

జమిందారు యిక మాట్లాడలేదు. సంశయ నివృత్తికి ముందుఉన్న ఆందోళన ఆశ్చర్యం అతనిలో లేవు. మెల్లగా మ్లానహాసంచేసి "ఈశుభసమయంలో చాకు బహూకరించాడేమిటి" అని అన్నాడు.

"ఏదివాన్నాలో కుర్రవాడికి తెలీక..." ధర్మయ్యమాట యింకా పూర్తికానిక్రితమే జమిందారు నవ్వాడు.

"విషయం తెలిసినా వెల్లడిచేయని శక్తి మీకుంటే; ఎంత కాలమైనా కుర్రవాడు, మీరు సుఖంగా జీవించగలుగుతారు వెళ్ళిరండి" ధర్మయ్య భుజంపై ఈ మాటలంటూ మెల్లగా చరిచి రాముని తీసుకొని లోపలకు వెళ్ళిపోయాడు జమిందారు.

ఈ మాటలు అసందర్భ అర్థరహితంగా ఉన్నట్లు విన్నవాళ్ళకు కనిపించినా - దానిలో ఏలాంటి విషపూరిత సత్యం దాగి వుందో జమిందారుకీ, ధర్మయ్యకు మాత్రమే తెలుసు.

రవి లక్ష్మితోబాటు ధర్మయ్య మెల్లగా నడిచి యింటికి చేరుకున్నారు.

(ఇంకావుంది)



[illegible] "బంగారుభూమి"లో అంజలీదేవి.



మోడరన్ థియేటర్సువారు సేలంలో తయారుచేసిన "దిజంగిల్" ఇంగ్లీషు చిత్రంలో
రాడ్ కామిరాన్, మేరీ విండ్సర్, సీజర్ రోమిరో.

మొదటిప్రపంచయుద్ధానికి ముందు సినిమా పరిశ్రమ ఫ్రాన్సులోను, ఆతరవాత ఇటలీ, స్వీడన్ మొదలైన దేశాల్లోను అభివృద్ధి చెందింది. ఆ యుద్ధంలో యూరప్ దేశాలన్నీ చేతులు కాల్చుకున్న తరువాత సినిమా పరిశ్రమ అట్లాంటిక్ సముద్రం దాటి అమెరికాలో, కాలిఫోర్నియాలో అడుగుపెట్టింది. ఈ పరిశ్రమకు అప్పటికీ ఇప్పటికీ హాలీవుడ్ శాశ్వత రాజధానిగానే వుంది.


అయితే సినిమాను బట్టల పరిశ్రమ, ఉక్కుపరిశ్రమ మొదలైనవాటి జాబితాలో చేర్చకుండా, ఒక కళగా రూపుదిద్దిందీ, పెంపొందించిందీ అమెరికా కాదు, యూరప్ దేశాలే. అమెరికన్ సినిమా ఎప్పటికప్పుడు బాక్సాఫీస్ సూత్రాలకు కట్టుబడి, దాని కవసరమైనంతవరకే మారుతూ వచ్చింది కాని, అంతకంటే ఎక్కువ లోతుకు పోలేదు. చార్లీచాప్లిన్‌ను మినహాయిస్తే అమెరికన్‌సినిమా మానవ సంస్కృతికి చేసిన దోహదం దాదాపు శూన్యమనే చెప్పాలి.

సినిమాను తతిమా ఏ కళా అందుకోలేని ఔన్నత్యానికి తీసుకుపోయి గొప్ప కళగా తీర్చిదిద్దిన ఖ్యాతి రష్యన్ దర్శకుడైన ఐజెన్‌స్టీన్‌కే దక్కుతుంది. సినిమా కళపైన, దాని చరిత్రపైన ఆసక్తిగల ప్రతివారూ ఆయన చేసిన కృషిని కొంతైనా తెలుసుకోవడం అవసరం.

సెర్గీ ఐజెన్‌స్టీన్ యూదు జాతివాడు. 1898 లో రీగా నగరంలో జన్మించాడు. రష్యన్ విప్లవంనాటికి 19 ఏళ్ల యువకుడు. వాస్తుశాస్త్ర విద్యార్థిగా ఉండేవాడు. మాస్కోలో మొదటిసారిగా ఒకస్టంటు-చిత్రం చూసి, సినిమా ఎంత గొప్పకళ కాగల అవకాశమున్నదో గ్రహించాడు. వెంటనే సినిమా రంగంలోకి దూకాడు. అతని మొదటి-చిత్రం "స్ట్రయిక్". పడుచుతనపు ఉత్సాహంలో ఐజెన్‌స్టీన్ ఈ చిత్రంలో రకరకాల ఎక్స్పెరిమెంట్లు చేశాడు. అంతకు పూర్వం రష్యాలో సినిమాకూడా నాటకపద్ధతుల్లో నిర్మించబడేది. సినిమాకు సినిమాటిక్ లక్షణాలను, అంటే సాధ్యమైనంత సహజత్వాన్ని ఆపాదించటానికి ఐజెన్‌స్టీన్ ప్రయత్నించాడు. కాని ఈ ప్రయత్నాలు పూర్తిగా ఫలించలేదు. ఆ చిత్రం మిగతా సామాన్య చిత్రాల జాబితాలో చేరిపోయింది. అయితే ఈ మొదటి చిత్రంలో కలిగిన అనుభవాలను అతను జాగ్రత్తగా ఉపయోగించుకుని, తరవాత చిత్రాల్లో కొత్తదారులుతొక్కి కొత్త విజయాలు సాధించాడు.

"యుద్ధనౌక పోటెమ్కిన్"

1925 లో ఐజెన్‌స్టీన్ తయారుచేసిన "పోటెమ్కిన్" అనే చిత్రం జర్మనీలో విడుదల అయి, ఆటంబాంబులాగ బద్దలైంది. అతి స్వల్పకాలంలో యూరప్ అంతటా ఈ చిత్రం పేరు పాకింది. వివిధ నగరాల్లో ఈచిత్రం ప్రదర్శించినప్పుడు మామూలు ప్రేక్షకులు, సినిమా దర్శకులు, నిర్మాతలు మాత్రమే కాక, ఇతర కళాకారులు, మేధావులు సైతం నిర్ఘాంతపోయి చూశారు. ఈ చిత్రం యాభైనిమిషాలు మాత్రమే నడుస్తుంది. ఆ కాసేపటిలోను తాము చూసేది మానవమాత్రుడు నిర్మించిన చలనచిత్రమా, లేక ఏదో ఇంద్రజాలమా అని ఆశ్చర్యపడ్డారు. నయాగరా జలపాతంలాగ దృశ్యం



"ది జంగిల్" లో రాడ్ కామిరాన్, మేరీ విండ్సర్.

[illegible] చరిత్ర

తరవాత దృశ్యం క్రూరంగా, నిర్దయగా భూమి బద్దలై విచ్చుకున్నట్టు ప్రేక్షకులను ముంచివేసింది. అప్పటికి ఆ చిత్రదర్శకుడైన ఐజెన్‌స్టీన్‌కు 27 ఏళ్ళు!

"పోటెమ్కిన్" చిత్రం 1905 లో జరిగిన మొదటి రష్యన్ విప్లవంలోని ఒక సంఘటనను కథావస్తువుగా వాడుకున్నది. దేశమంతటా విప్లవం కోరలు సాచి చెలరేగింది. ఒడెస్సా అనే రేవు పట్టణంవద్ద పోటెమ్కిన్ అనే యుద్ధనౌక ఉన్నది. అందులోని సైనికులు తమకు కుళ్లిపోయిన ఆహారం పెడుతున్నారనే కారణంమీద, అధికారులపై తిరుగుబాటు చేశారు. యుద్ధనౌకపై ఎర్ర జెండా ఎగరేశారు. దాన్ని చూసి ఒడెస్సా పట్టణంలోని ప్రజలంతా ఉద్రిక్తులై విప్లవ ప్రదర్శనలు లేవదీశారు. ఇటు యుద్ధనౌక, అటు ఒడెస్సా పట్టణం ఒకే విప్లవశక్తితో విజృంభిస్తాయి. చివరకు జార్ చక్రవర్తి సైనికులు వచ్చి విప్లవం అణచివేస్తారు.

హాలీవుడ్ ప్రమాణాలనుబట్టి చూస్తే ఈ చిత్రం న్యూస్‌రీలో, డాక్యుమెంటరీయో అవుతుంది, గాని కథాచిత్రం కాజాలదు. (ప్రసిద్ధ హాలీవుడ్ డైరక్టరు ఎర్నెక్ట్ లూబిట్ష్ సరిగ్గా ఈ మాటే అన్నాడు.) ఇందులో అసత్యమేమీలేదు. ప్రేయసీ ప్రియుల విరహాలు, చోరులు, జారులు— ఈ బాపతు విషయాలుంటేనే కథా చిత్రం అయేట్లయితే ఇది కథా చిత్రం కాదు. యథార్థంగా జరిగిన ఒకానొక చారిత్రక సంఘటననే చిత్రిస్తుంది. అయితే ఆచిత్రించటంలో చూపిన వైదగ్ధ్యంవల్ల అది కళాఖండం కాగలిగింది.

ఉవ్వెత్తుగా లేచి విరిగే సముద్ర తరంగంతో ఈ చిత్రం ప్రారంభమవుతుంది. అంటే కథావస్తువు విప్లవం అని మొదట్లోనే సూచించబడిందన్నమాట. విప్లవానికి కారణమైన కుళ్లిపోయిన ఆహారం చూపించబడుతుంది. కుళ్లి, మురిగి, పురుగులు పట్టిన ఆహారం తెరనిండా ఆక్రమించుకుని కనిపిస్తుంది. ఈ ఆహారం ఆనాటి రష్యన్ సాంఘిక వ్యవస్థకు చిహ్నం అయినా కావచ్చు.

తరవాత యుద్ధనౌకలోని కొందరు సైనికులు తమ్ముపీడించే అధికార్లపై తిరుగుబాటుచేస్తారు. అధికారులు మిగతా సైనికులను తిరుగుబాటుదారులపైకి ఉసిగొలుపుతారు. కాని వారు కూడా తిరుగుబాటుదారులతో ఏకమైపోతారు. యుద్ధనౌకలో తిరుగుబాటు జరిగిందనే వార్త ఒడెస్సా అంతటా వ్యాపిస్తుంది. ప్రజలు ప్రదర్శనలు చేసుకుంటూ రేవువద్దకు చేరుకుంటారు. ఆ ప్రజాసమూహాన్ని చూసి యుద్ధనౌకలోని సైనికులు, వారితోపాటు యుద్ధనౌక కూడా సంతోషంతో ఒక్క ఊగు ఊగిపోతారు. ఇంతలో జార్ సైనికులు వందలకొలది ఆయుధపాణులై రేవు దగ్గిరికి వస్తారు. ఒడెస్సారేవు మెట్లపై సమావేశమైన వేలకొలది ప్రజలపై తుపాకి వర్షం కురిపిస్తారు. పిల్లలు, తల్లులు, వృద్ధులు వేలకొలది జనం విశాలమైన ఆ మెట్లనుండి చీమలు రాలినట్టు టపటప రాలుకుంటూ పడిపోతారు. బహుశా ఇంత అద్భుత దృశ్యాలు సినిమాచరిత్ర అంతా గాలించినా కనిపించవు.

"పోటెమ్కిన్" చిత్రంలో కల్లా ఒడెస్సారేవు మెట్ల సీక్వెన్సు అతి ప్రధానమైనది. ఇక్కడ ఐజెన్‌స్టీన్ చూపించిన ఎడిటింగ్ ప్రతిభ సాటిలేనిది. ముందు తుపాకులు పేల్చుకుంటూ వచ్చే జార్ సైనికులు, తరవాత మెట్లపై చెల్లాచెదరుగా రాలిపోయే వేలకొలది జనం, మళ్ళీ సైనికులు, మళ్ళీ జనం, మధ్యలో కంటిపై గాయం తగిలిన ఒక ముఖం క్లోజప్, మళ్ళీ సైనికులు—ఈవిధంగా కొన్ని నిమిషాల సేపు ఊపిరాడని ఉద్వేగం కలుగుతుంది.

ఈ చిత్రంలో ఐజెన్‌స్టీన్ పేరుపొందిన

నటీనటులను ఎవరినీ ఉపయోగించలేదు. అసలు నటీనటులే ఇందులో లేరు. అందరూ ఎమెచూర్ పాత్రధారులే. కథానాయకుడు కూడా ఎవడూ లేడు. కథలో ముఖ్యపాత్ర అంటూ లేనిదే సినిమా ఎలా సాధ్యమవుతుందని ప్రశ్న రావచ్చు. ఈ చిత్రంలో యుద్ధనౌక 'పొటెమ్కిన్' ముఖ్యపాత్ర ధరిస్తుంది. అది విప్లవానికి చిహ్నం. కనుక అదే 'కథానాయకుడు.' విప్లవం సాగించే ప్రతి సైనికుడు, ప్రతి వ్యక్తీకూడా కథానాయకుడే. కథకు ఏకైక నాయకుడు (హీరో) అంటూ లేకుండా ప్రజానీకాన్నే నాయకుడుగా చిత్రించటంలో ఐజెన్‌స్టీన్ ఒక కొత్తదారి తొక్కాడు.

ఈ చిత్రంలో అవలంబించబడిన టెక్నిక్‌ను గూర్చి మరొక రష్యన్ దర్శకుడు పుడోవ్కిన్ ఇలా అన్నాడు: "ఈ చిత్రంలోని అంశాలను నవల్లో మాదిరిగా మాటలతో వర్ణించటానికి సాధ్యం కాదు. నాటకంలో మాదిరిగా స్టేజిమీద ప్రదర్శించటానికి వీలు లేదు. తెరమీద చూపించటానికి మాత్రమే సాధ్యపడుతుంది." అంటే సినిమా, నాటకంకంటె, నవలకంటె భిన్నమైన కొత్తకళగా రూపొందినదన్న మాట.

ఈ చిత్రంలో నిస్సందేహంగా కమ్యూనిస్టు ప్రచారం ఉన్నది. జార్ ప్రభుత్వపు నిరంకుశత్వం, పీడితప్రజల తిరుగుబాటు, పోరాటం, ఓటమి, యుద్ధనౌక విజయగర్వంతో ఒడెస్సా రేవుదాటి వెళ్లిపోవటం- ఇవన్నీ సోవియెట్ ప్రభుత్వవైఖరికి అనుగుణంగానే చిత్రించబడ్డాయి. ఈ కథావస్తువుపై ఏమాత్రం సానుభూతి, ఇష్టం లేని పశ్చిమ యూరప్ ప్రేక్షకులుకూడా ఈ చిత్రం చూచినప్పుడు పూర్తిగా తన్మయులు కాగలిగారు. అంటే కమ్యూనిస్టు వ్యతిరేకులచేత కమ్యూనిస్టు ప్రచారాన్ని కూడా దిగమింగించగలిగినంత శక్తితో కథావస్తువు చిత్రించబడిందన్న మాట. అందుకే బెర్లిన్‌లో కొన్నాళ్ళు ప్రదర్శించబడిన మీదట ఈ చిత్రం చాలా ప్రమాదకరంగా ఉందని భావించి జర్మన్ అధికారులు కొన్నికొన్ని భాగాలు కత్తిరించివేశారు. ఈ చిత్రానికింత శక్తి రావటానికి కారణం ఐజెన్‌స్టీన్ అనుసరించిన ఎడిటింగ్ పద్ధతే. అసలు సినిమాకళకు ఆధారం నటీనటుల నటన కాదని, ఎడిటింగేనని, ఈ ఎడిటింగ్ స్క్రిప్టు మొదలు పెట్టినప్పటినుంచి పాట్లు అతికించటంవరకూ అవిచ్ఛిన్నంగా జరగవలసిందేనని మొదటగా చాటి చెప్పినవాడు అతడే.




కుటుంబ పోషణకోసం బూట్ పాలిష్ చేస్తున్న ఆనంద్

రోహిణీ వారి "బీదల ఆస్తి" లో మాస్టర్ కుందు.

"పొటెమ్కిన్" తర్వాత ఐజెన్‌స్టీన్ తీసిన చిత్రం "పాత-కొత్త" (దిఓల్డ్ ఎండ్ దిన్యూ). రష్యాలో సమష్టి వ్యవసాయపద్ధతి (కలెక్టివ్ ఫార్మింగ్) నెలకొల్పాలని స్టాలిన్ ప్రయత్నించే రోజులవి. దీన్నే ఐజెన్‌స్టీన్ కథావస్తువుగా తీసుకున్నాడు. చిత్రం పూర్తవటానికి మూడేళ్లు పట్టింది. స్టాలిన్‌తో సహా పొలిట్‌బ్యూరో సభ్యులందరూ ఈ చిత్రం ప్రివ్యూ చూశారు. కొన్ని మార్పులు చెయ్యాలని స్టాలిన్ సూచించాడు. ఎందుకంటే ఈ చిత్రం నిర్మాణంలో ఉన్న మూడేళ్లలోను సమష్టి వ్యవసాయ సమస్యల్లో కొన్ని కొత్తపరిణామాలు వచ్చాయి. చిత్రంలో కథ వీటికి అనుగుణంగా లేదు. అందుచేత మార్పులు చేసి, కొత్తగా ఒక రీలు చేర్చి విడుదలచేశారు. స్టాలిన్ ఎంత నిశితమేధాశక్తి గలవాడో అప్పుడు గ్రహించానని ఐజెన్‌స్టీన్ అన్నాడు.

ఈ చిత్రం విడుదలకాకముందే అతడు 1927 లో మరొక చిత్రం తయారు చెయ్యాల్సివచ్చింది. రష్యన్ విప్లవపు పదవ వార్షికోత్సవం దగ్గరపడుతోంది. ఆ సందర్భానికిగాను రాత్రింబగళ్లు పనిచేసి "అక్టోబర్" అనే చిత్రం నిర్మించాడు. అక్టోబర్ (1917) విప్లవం ఇందులో చిత్రించబడింది. ఈ చిత్రం "ప్రపంచాన్ని ఊపివేసిన పది రోజులు" (టెన్ డేస్ దట్ షుక్ ది వర్ల్డ్) అనే పేరుతో యూరప్‌లో విడుదల అయి మరొక గొప్ప సంచలనానికి కారణమైంది.



రోహిణీ వారి "బీదల ఆస్తి" లో సూర్యకాంతం, దొరస్వామి.

★ తెలుసుకోదగిన జీవిత చరిత్ర ★

విదేశయాత్ర

ఈ రెండు చిత్రాల తరవాత ఐజెన్‌స్టీన్ తన కెమేరామన్ ఎడ్వర్డు టిస్సే, అసిస్టెంటు దర్శకుడు అలెగ్జాండ్రోవ్‌లను వెంటబెట్టుకుని యూరప్, అమెరికా సంచారానికి బయల్దేరాడు. అవి కొత్తగా టాకీచిత్రాలు వెలువడుతున్న రోజులు. అంతవరకూ రష్యాలో సైలెంటు చిత్రాలే నిర్మించబడుతున్నవి. శబ్దచలన చిత్రాల టెక్నిక్ పరిశీలించి నేర్పుకునేందుకు రష్యన్ ప్రభుత్వం ఐజెన్‌స్టీన్‌కు ఒక ఏడాది సెలవు ఇచ్చి విదేశాలకు పంపించింది. బయలుదేరటానికి ముందే, 1928 లో ఐజెన్‌స్టీన్, పుడోవ్కిన్, అలెగ్జాండ్రోవ్ ముగ్గురూ కలిసి ఒక ప్రకటన చేశారు. ఈ ప్రకటనలో సెల్యులాయిడ్‌పై శబ్దాన్ని కూడా ఎక్కించటంలో వచ్చే కొత్తలాభాలను ఆహ్వానించటమే కాక ఒక ముఖ్యమైన సూచన కూడా చేశారు: శబ్దాన్ని అనుసరించి బొమ్మ, బొమ్మను అనుసరించి శబ్దం సింక్రనైజ్ చేసుకుంటూ ఫిలిం తీస్తే అది నాటకంలాగ తయారవుతుంది కాని సినిమా కానేరదు. శబ్దాన్ని, బింబాన్ని సింక్రొనైజ్ చెయ్యగూడదు. రెంటినీ వేరువేరుగా ఉపయోగించి ఒకే ఎఫెక్ట్ తెప్పించాలి. అప్పుడే సౌండు రికార్డింగ్‌కు సార్థకత చేకూరుతుంది. అంటే శబ్దానికి కూడా మాంటేజ్ పద్ధతి ఉపయోగించాలన్న మాట.

ఐజెన్‌స్టీన్ ముందు ఫ్రాన్సు, స్విట్జర్లెండు మొదలైన దేశాల్లో పర్యటించాడు. తరవాత లండన్‌లో ఫిలిం సొసైటీవారు ఏర్పాటుచేసిన సభల్లో తన సిద్ధాంతాలను గూర్చి ఉపన్యాసాలిచ్చాడు. ఆ సమయంలోనే హాలీవుడ్ పారమౌంటు కంపెనీవారు అతన్ని తమ దేశానికి ఆహ్వానించారు. సుప్రసిద్ధ అమెరికన్ నవలా రచయిత థియొడోర్ డ్రీజర్ రాసిన "అమెరికన్ ట్రాజెడీ" అనే నవలను పారమౌంటువారు కొనుక్కుని, ఆ నవలను సినిమా తీసిపెట్టవలసిందని ఐజెన్‌స్టీన్‌కు కంట్రాక్టు ఇచ్చారు. కొల్లలుగా ధనం ఆశ చూపి అతన్ని బుట్టలో వేసుకుని శాశ్వతంగా తమ వద్దనే ఉంచుకుందామని పారమౌంటువారు ఆశించారు. కాని అనేక ఇతర యూరపియన్ డైరెక్టర్లలాగ ఐజెన్‌స్టీన్ ధనానికి, అమెరికన్ గ్లామర్‌కు దాసుడు కాలేదు. అతడు పక్కా మార్క్సిస్టు. నిశ్చలమైన వ్యక్తిత్వం కలవాడు. పారమౌంటు వారి కంట్రాక్టుకు ఒప్పుకున్నాడు. "అమెరికన్ ట్రాజెడీ"ని సినేరియోగా రాయటానికి ప్రారంభించాడు.

డ్రీజర్ ఈ నవలలో అమెరికన్ సమాజ వ్యవస్థను అతి నిశితంగా విమర్శించాడు. మానవుడి దౌర్బల్యాలకు, దోషాలకు కారణం ఆర్థిక వ్యవస్థలోని లోపాలేగాని మానవుడు స్వతహాగా దుష్టుడు కాదని ఈ నవలలోని సిద్ధాంతం. (ఆకథ అంతా ఇక్కడ రాయటానికి అవకాశం లేదు.) ఈ కథను పారమౌంట్ కంపెనీ యజమానులు చదివి పూర్తిగా అర్థం చేసుకోకుండానే దాని ఫిలిం హక్కులు కొనేశారు. ఐజెన్‌స్టీన్ ఈ కథలోని సిద్ధాంతాన్ని యథాతథంగా సినేరియోలోకి తీసుకొచ్చాడు. ఈ సిద్ధాంతం అమెరికన్ పెట్టుబడి దారీ వ్యవస్థకే గొడ్డలి

పెట్టేలాంటిది. అటువంటిదాన్ని పెట్టుబడి దారులైన పారమౌంట్ యజమాను లెలా ఆమోదిస్తారు? సినేరియోను మార్చివేయాలని ఐజెన్‌స్టీన్‌ను పురమాయించారు. మారిస్తే అసలు రచయిత డ్రీజర్‌కు అన్యాయం జరుగుతుందని ఐజెన్‌స్టీన్ వాదించాడు. పారమౌంట్ వారు తమ కంట్రాక్టు రద్దు చేశారు. ఐజెన్‌స్టీన్ గుడ్‌బై కొట్టి బయటికి వచ్చివేశాడు. ఆతరవాత పారమౌంట్ వారు మరొక దర్శకుడిచేత సినేరియో రాయించి "అమెరికన్ ట్రాజిడీ" ఫిలిం తీయించటం, ఆఫిలిం చూసి డ్రీజర్ తన కథను ఖూనీ చేశారని, ఐజెన్ స్టీన్ రాసిన సినేరియోయే సరియైనదని పారమౌంట్‌వారితో వాదించటమూ, చివరికి ఉభయులూ కోర్టు కెక్కడమూ, వరసగా జరిగాయి. (ఈకథనే పారమౌంట్‌వారు ఇటీవల *A Place in the sun* అనే పేరుతో మళ్లీ సినిమా తీశారు.)

ఐజెన్‌స్టీన్ పారమౌంటునుండి బయటికి వచ్చి మరొక ప్రఖ్యాత అమెరికన్ రచయిత అప్టన్ సింక్లేర్‌తో కలిసి చిత్ర నిర్మాణానికి పూనుకున్నాడు. అప్టన్ సింక్లేర్ డబ్బు సమకూర్చేట్లు, ఐజెన్‌స్టీన్ డైరెక్టు చేసేట్లు ఒప్పందం. కథావస్తువు మెక్సికో చరిత్ర. మెక్సికో ప్రాచీన చరిత్రనుంచి నేటి చరిత్రవరకూ అంతా వస్తువుగా తీసుకున్నాడు. స్క్రిప్టురాసి దాని ప్రకారమే తూచా తప్పకుండా సినిమా నిర్మించటం ఐజెన్‌స్టీన్ కెప్పుడూ అలవాటులేదు. అప్పటికప్పుడు ఏ భావం తోస్తే ఆ భావమల్లా ఉపయోగించుకునే వాడు. (నిజమైన క్రియేటివ్ ఆర్టిస్టులంతా ఇలాగే చేస్తారేమో.)

ఐజెన్‌స్టీన్ మెక్సికోవెళ్లి అనేక చారిత్రాత్మక శిథిలాలను, ఆదిమవాసులను, వారి జీవనవిధానాన్ని సెల్యులాయిడ్ పైకి తీసుకురాసాగాడు. కొన్ని లక్షల అడుగుల ఫిలిం తయారైంది. ఇంకా సేకరించవలసినది కొన్ని లక్షలుంటుంది. దీనికి అంతూ పంతూ ఉన్నట్టు తోచలేదు. సింక్లేర్ డబ్బు చాలా ఖర్చయిపోయింది. అతనికి విసుగుపుట్టి కంట్రాక్టు రద్దుచేసి, తయారైనంతవరకూ ఫిలిమును స్వాధీనం చేసుకున్నాడు. ఐజెన్‌స్టీన్ అయితే ఇన్ని లక్షల అడుగుల ఫిలింలోనూ ఏ యెనిమిదివేల అడుగులో మాత్రమే ఉపయోగించుకుని ఒక కళాఖండం తయారుచేసి, మిగతాది




శోభావారి "పరోపకారం"లో గుమాస్తా వైకుంఠంగా రేలంగి, జమీందారుగా సి. ఎస్ ఆర్.

పారవేసేవాడు. కాని అతనికి ఆ అవకాశం చిక్కలేదు. సింక్లేర్ మరొక ఎడిటర్‌ను నియోగించి, మరొక ఫిలిమ్ తయారు చేయించుకున్నాడు. ఈ ఫిలింలోని దృశ్యాలన్నీ ఐజెన్‌స్టీన్ తీసినవే అయినప్పటికీ, ఎడిట్ చేసింది మరొకరు కనుక అతడు అనుకున్న భావాలేమీ ఇందులోకి రాలేదు. ఈ ఫిలించూసిన విమర్శకులంతా ఐజెన్‌స్టీన్‌ను పూర్తిగా పనిచెయ్యనిస్తే ఎంత గొప్పచిత్రం తయారయ్యేదో అని చింతించారు. దానిపేరు "థో వివా మెక్సికో."

ఐజెన్‌స్టీన్ అమెరికాలో ఉండగా చార్లీచాప్లిన్ మొదలైన ప్రఖ్యాత సినిమా వ్యక్తులతో పరిచయం కలిగింది. హాలీవుడ్‌లో మోషన్ పిక్చర్ అకాడమీ వారొక సన్మానసభ ఏర్పాటు చేశారు. అందులో ఐజెన్‌స్టీన్ ఉపన్యసిస్తూ 'క్లోజప్' అనేది ఎందుకు ఉపయోగిస్తారో వివరించాడు. హాలీవుడ్‌వారు క్లోజప్ అదివరలో తరుచు ఉపయోగిస్తున్నా దాని ప్రయోజనం వారికి గ్రాహ్యం కాలేదు. మొదటిసారిగా దాని ప్రయోజనం ఫలానా అని తెలిసి వారు ఆశ్చర్యపడ్డారు. వారికి మాత్రం తెలియదా అని ఐజెన్‌స్టీన్ ఆశ్చర్యపడ్డాడు. తరవాత ఒక జర్నలిస్టు వచ్చి కొంటెగా "మీ సోవియట్ రష్యాలో ప్రజలకి నవ్వటం తెలుసా?" అని అడిగాడు. ఐజెన్‌స్టీన్ అంతకంటే కొంటెగా "తెలుసు. ఈ సభనుగూర్చి చెబితే తప్పకుండా నవ్వుతారు," అన్నాడు.

(సశేషం.)



శోభావారి "పరోపకారం"లో జి. వరలక్ష్మి, ముక్కామల మున్నగు వారు.

సినిమా వార్తలు

హాలీవుడ్ యూనిట్ సహాయంతో మోడరన్ థియేటర్సువారు (టి. ఆర్. సుందరం) తయారుచేసిన "ది జంగిల్" ఇంగ్లీషు చిత్రం ఈనెల 8 న మద్రాసులోను, కొన్ని తమిళకేంద్రాల్లోను విడుదల అయింది. జూన్‌లో బహుశా ఆంధ్ర దేశంలో కూడా విడుదల కావచ్చు. ఇందులో హాలీవుడ్ నటీనటులు మేరీ విండ్సర్, సీజర్ రోమిరో, రాడ్ కామిరాన్, నటించారు. డైరెక్టరు విలియం బెర్క్. ఫొటోగ్రఫీ క్లైడ్ డి విన్నా. ఒక చిన్న సంస్థానంలోని గ్రామాలపైకి ఏనుగుల గుంపులు దాడిచేయటం అలవాటు చేసుకుంటాయి. వీటి బారినుండి ప్రజలను రక్షించటానికి సంస్థాన యువరాణి (మేరీ విండ్సర్), ఆమె సిక్కు సలహాదారు (సీజర్ రోమిరో), ఒక అమెరికన్ వేటగాడు అడవులలోకి వెడతారు. అక్కడ యువరాణికోసం సిక్కు, అమెరికన్ పగస్వరం విరోధులవుతారు. ఈ దృశ్యాలన్నీ దక్షిణ ఇండియాలోని కీకారణ్యాలలోను, మైసూరు సంస్థానంలోను, కావేరీ నదివద్ద తీశారు. మైసూరు మహారాజా తన స్వంత అంగరక్షకులను కూడా ఈ ప్రొడక్షన్ బృందంవారికి సహాయంగా ఇచ్చారట.

*   *   *

ఎమ్. జి. ఎమ్.వారి మరొక పెద్ద టెక్నికలర్ చిత్రం "ఐవన్‌హో" ఇటీవల మిడ్‌లాండ్‌లో విడుదలఅయింది. రాబర్ట్ టేలర్, ఎలిజబెత్ టేలర్, జోన్‌ఫాన్‌టైన్ జార్జి శాండర్స్ మొదలగు వారు నటించారు. డైరెక్టరు రిచర్డ్ థార్ప్. 12 వ శతాబ్దంనాటి ఇంగ్లండులో జరిగినట్టుగా సర్ వాల్టర్ స్కాట్ రాసిన "ఐవన్‌హో"నవల ఆధారం చేసుకొని ఈ చిత్రం తీయబడింది. నవల చదివి ఈ చిత్రం చూసినవారికి కొంత ఆశాభంగం కలుగుతుంది. ఎక్కువ భాగం చప్పగావుంది. నార్మన్ రాజుల రోజుల్లోని వివిధక్రీడలు, ద్వంద్వ యుద్ధాలు కూడా సినిమాలో జరిగినట్టుగా నే వున్నాయిగాని అంతకంటే రక్తికట్టేట్లు లేవు. "కోవాడిస్" తో పోల్చి చూసినా ఇది దానితో తూగలేదనిపిస్తుంది.

*   *   *

మహారాష్ట్ర దర్శకుడు దత్త ధర్మాధికారి "మహాత్మ" అనే కొత్త చిత్రం తయారుచేశాడు. ఇది ఈనెలలో విడుదల కావచ్చునట. హిందీ, మరాఠీ, ఇంగ్లీషులలో ఇది తయారైంది. భారత జాతీయతను పూర్తిగా ప్రతిబింబించే ఈ చిత్రంలో ప్రసిద్ధనటుడు జాగీర్దార్, డేవిడ్, మదన్ మోహన్ మున్నగువారు నటిస్తున్నారు. వసంత్ పావర్, రామ్ వాధవ్‌కర్ సంగీత దర్శకులు.

*   *   *

బ్రిటిష్ ఫిలిమ్ ఎకాడమీ వారు 1952 లో ఉత్తమ చిత్రంగా "సౌండ్ బారియర్" అనే బ్రిటిష్ చిత్రానికి బహుమతి ఇచ్చారు. ఆ చిత్రంలో నటించిన సర్



ఎమ్. జి. ఎమ్. వారి "ఐవన్‌హో"లో జోన్ ఫాంటైన్, రాబర్ట్ టేలర్

రాల్ఫ్ రిచర్డ్‌సన్‌కు ఉత్తమ బ్రిటిష్‌నటుని బహుమతి ఇచ్చారు. ఉత్తమ బ్రిటిష్ నటిగా "స్ట్రీట్ కార్"లో నటించిన వివియన్ లీకి బహుమతి ఇచ్చారు. ఉత్తమ విదేశీయ నటుని బహుమతి "వివా జపాటా"లో నటించిన మార్లన్ బ్రాండోకు ఇచ్చారు. నటుడుగా, నిర్మాతగా చార్లీ చాప్లిన్‌కు ప్రత్యేక ప్రశంసా పత్రం ఇచ్చారు.

* * *

దక్షిణభారత సినీ టెక్నీషియన్ల సంఘం తాలూకు పదో వార్షిక సర్వసభ్య సమావేశం ఈనెల 3 వ తేదీన రామ్‌నాథ్‌గారి అధ్యక్షతన జరిగింది. దక్షిణభారత ఫిలిం వాణిజ్య మండలి, దక్షిణభారత స్టూడియో యజమానుల సంఘం, సినీ టెక్నీషియన్ల సంఘం ఈ మూడింటినీ సమావేశపరచి ఫిలిం పరిశ్రమ సమస్యలనుగూర్చి చర్చలు జరపాలనీ, ఉత్తమ టెక్నీషియన్లకు బహుమతులివ్వాలనీ తీర్మానాలు చేశారు. సినీ టెక్నీషియన్ల కొత్త అధ్యక్షుడుగా శ్రీ ఎ. కృష్ణన్, ఉపాధ్యక్షులుగా శ్రీ ఎన్. కృష్ణస్వామి, కె. కె. సహదేవన్, గౌరవ కార్యదర్శులుగా శ్రీ రజనీకాంత్, ఎమ్. ఇ. నగరాజన్ ఎన్నుకోబడ్డారు.

* * *

వలభైవిళ్లనుండీ చలనచిత్రాల్లో పని చేస్తున్న సర్ అలెగ్జాండర్ కోర్డా ఇండియాలో రెండు చిత్రాలు నిర్మిస్తున్నాడు. "టైగర్ టైగర్" అనేది ఒకటి; "తాజమహల్" అనేది మరొకటి. ఈ రెండవ చిత్రం త్రీడైమన్షన్స్‌లో తీయాలని ఆయన సంకల్పం. సినిమా కళలో త్రీ డైమన్షనల్ విధానంవల్ల అద్భుతమైన పరిణామాలు కలుగుతా యనుకోవటం భ్రమ అనీ, మొదట్లో కొన్ని రోజులు ప్రజలు విరగబడి చూసినా తరవాత అందులోని కొత్తదనం పోతుందనీ, ఆయన అభిప్రాయపడుతున్నాడు. టెక్నికలర్ వచ్చిన తరవాత మామూలు చిత్రాలు వెలువడుతున్నట్లే, త్రీ. డైమన్షనల్ చిత్రాలు వచ్చిన తరవాత కూడా ఆవిధానానికి పనికిరాని కొన్ని కథలను మామూలుగానే తీయవలసి వస్తుందనికూడా ఆయన అభిప్రాయపడుతున్నాడు. ★



"ఐవన్‌హో"లో రెబెక్కా పాత్రధారిణి ఎలిజబెత్ టేలర్.

శ్రీ డి. వి. ఎ. ఆచార్య వ్రాసిన "చిత్రజగతి" గ్రంథానికి తెలుగు భాషాసమితి ద్వారా మద్రాసు ప్రభుత్వంవారు ఇటీవల పారితోషికం ఇచ్చారు. ఆచార్యగారికి చిత్ర నిర్మాణంలో యథార్థ అనుభవం లేకపోయినా, చిత్రజగతిపైగల అభిమానం, ప్రేమకొద్దీ అనేక ఉద్గ్రంథాలు చదివి, స్వయంగా అనేక స్టూడియోల్లో చిత్ర నిర్మాణం పరిశీలించి, అనేకచిత్రాలుచూసి ఈ 353 పేజీల బృహద్గ్రంథం వ్రాశారు. చలనచిత్రాలు ఎలా ఆవిర్భవించాయో, టాకీచిత్రా లెలా ప్రవేశించాయో, చిత్రాల్లో ఎన్నిరకాలున్నాయో, ఫొటోగ్రఫీలో ఏయే వింతలు విశేషాలున్నాయో, అసలు చిత్రనిర్మాణంలో అనుసరించవలసిన పద్ధతు లేమిటో వివరంగా తెలుసుకోగోరే వారికి ఈ పుస్తకం చాలవరకు ఉపకరిస్తుంది. వీలైనంత సరళంగా రాయటంవల్ల విషయంకూడా సుబోధకంగానే వుంది. సినిమా పరిశ్రమలోని ముఖ్యాంగాలైన డిస్ట్రిబ్యూషన్, ఎగ్జిబిషన్‌లను గూర్చి కూడా రచయిత సాకల్యంగా చర్చించారు. దీని వెల 3-8-0; హిగిన్‌బాదమ్స్ వారికి రాసి తెప్పించుకోవచ్చును. ★

ఒక సినిమాతార మరొక సినిమాతారతో:- మీరీమధ్య ప్రచురించిన "నావెండి తెర అనుభవాలు" చదివానండీ. చాలా బావుంది—ఎవరు రాసి పెట్టారో గాని!

రెండో సినిమాతార:- అల్లాగా? నావ్యాసం చదివినందుకు చాలా సంతోషం—మీకెవరు చదివి పెట్టారో గాని!!

* * *

పోలీసు:- ఎన్ని గుండెలురా నీకు! పట్టపగలే దొంగతనం చేస్తున్నావ్!

దొంగ: రాత్రుల్లు నాకు భయంసార్. చీకట్లో దొంగలుంటారు.

ప్రశ్నలు..సమాధానాలు

శ్రీ సి. హెచ్. శ్రీనివాస రావు—జమ్ షెడ్‌పూర్.

తెలుగు చిత్రాలకి, టెక్నికలర్‌లో తీయ టానికి ఇంకా అవకాశం దొరకలేదా?

—మామూలు చిత్రాల్లో సాధించలేని ఘనత టెక్నికలర్‌లో మనం సాధించగల మని మీకు నమ్మకం ఉన్నదా?

*　　　*　　　*

శ్రీ నిష్ఠల అప్పలనర్సయ్య—చోడవరం.

"ఆడబ్రతుకే మధురం" అని కొందరు, "ఆడపుట్టుకే అపరాధం" అని కొందరు శెల విస్తున్నారు. పై రెంటిలో ఏది నిజం?

—మొదటిది మగవారూ, రెండోది ఆడ వారూ అంటారు. కనుక నిజం ఆ రెండిటి మధ్యస్థంగా ఉంటుంది.

*　　　*　　　*

శ్రీ గరిమెళ్ళ సత్యమూర్తి—పాలకొల్లు.

సినీతార "పండరీబాయి" పై మీ అభి ప్రాయమేమిటి?

—"గుమాస్తా" లో మాదిరిగా సరియైన పోర్షను ఇస్తే చక్కగా నటించగలదు. కాని ఇటీవల "వాళపిరుందవల్", "మణి దన్" అనే రెండు అరవచిత్రాలు చూసిన మీదట ఆమెకు నిర్మాతలు ప్రయోజనం లేని పాత్రలిచ్చి, సరిగా ఉపయోగించుకో వటం లేనట్లు తోస్తున్నది.

*　　　*　　　*

శ్రీ ఎస్. సుబ్బారావు—కాకినాడ.

అంజలీ పిక్చర్సువారి "పరదేశి" అంత కష్టపడి తీసినా డబ్బు రాకపోవుటకు గల కారణము తెలుపగలరా?

—కష్టపడటానికి, డబ్బు రావటానికి ఒక్కొక్కసారి సంబంధం ఉండదు. దేని దోవ దానిదే.

*　　　*　　　*

శ్రీమతి ఎమ్. వి. ఎస్. రత్నకుమారి—హైదరాబాద్.

క్లోజప్ అంటే ఏమిటి? అది చిత్రా లలో ఎప్పుడు వాడుతారు?

—కెమేరాను ఫొటో తియ్యవలసిన వస్తువుకు బాగా దగ్గరగా తీసుకువచ్చి షూట్ చేస్తారు. అలా షూట్ చేసినదాన్ని తెరపై ప్రొజెక్టు చేసినప్పుడు ఆ వస్తువు అసలు సైజుకు కొన్ని రెట్లు పెద్దదిగా కని పిస్తుంది. దాన్నే క్లోజప్, క్లోజ్ షాట్ అంటారు. దీనివల్ల ఏ వస్తువైనా ప్రేక్షకు లకు అతి ప్రధానమైనదిగా కనిపించేట్లు చేయవచ్చు. ఒక ముఖం, లేక కళ్లు, లేక చేతులు, ఒక రివాల్వరు, ఒక ఉత్తరం ముక్క దేనైనా దాని ప్రాధాన్యమును బట్టి, అవసరాన్నిబట్టి క్లోజప్‌లో చూపించ వచ్చు. మొట్టమొదటగా క్లోజప్ ఉపయో గించినది అమెరికన్ దర్శకుడు డేవిడ్ గ్రిఫిత్ అంటారు. మొదటిసారిగా ఒక ముఖం క్లోజప్ తెరమీద చూసి విమర్శకులు సైతం "కాళ్లేవీ? చేతులేవీ" అని ఎగతాళిచేశారట. కాని ఈరోజున క్లోజప్ లేనిదే సినిమాయే లేదు.

*　　　*　　　*

శ్రీమతి కొమ్మూరిలత—నిడుదవోలు.

జయంతీవారి 'బంగారుభూమి' పెరల్ ఎస్. బక్ రాసిన '*The Good earth*' అను నవలను అనుసరించి తీస్తున్నదేనా?

—కాదు; "బంగారు భూమి"కి ఏదో తమిళనవల ఆధారమని వినికిడి.

*　　　*　　　*

మిస్. వి. రాజ్యలక్ష్మి-విజయనగరం.

సినిమాలో చేరాలని అభిలషించు విద్యా ర్థినీ విద్యార్థులకు మీ రిచ్చు సలహా ఏమిటి?

—సినిమాలలో తేలిగ్గా ధనం సంపాదించ వచ్చునని, తేలిగ్గా కీర్తి ఆర్జించవచ్చునని, సినిమాప్రపంచం స్వప్నలోకంలా వుంటుం దని అపోహలు పెట్టుకోవద్దనీ; "కళాసేవ" చెయ్యాలని నిజంగా ఆవేదన ఉంటే సినిమావంటి ఉత్తమ సాధనాలు ఇంకా వున్నాయనీ.

*　　　*　　　*

శ్రీ డి. వెంకురెడ్డి—కోవూరు.

మంత్రాలన్నింటికి మొదట "ఓం" అని ఉంటుంది ఎందుచేత? అసలు "ఓం"అంటే అర్థం ఏమిటి?


—ఓం "ఇత్యేకాక్షరం బ్రహ్మ"-అనే వాక్యమును అనుసరించి "ఓం" అను యీ ఒక్క అక్షరమే బ్రహ్మయై యున్నది అని పూర్వులు నిర్ణయించారు. "అ, ఉ, అం" అను మూడు స్వరములను కలిపి సంధిచేయు టవల్ల "ఓం" అనే ఒక్క స్వరం ఏర్పడిం దన్నారు. ఆ మూడు స్వరములు సత్వ రజ స్తమో గుణములకు చిహ్నాలు. సత్వ, రజ, తమో గుణములు మూడున్నూ ఈ జగత్తులో కన్పిస్తున్నాయి.

—(1) తనలో ఉన్న శక్తిని ఖర్చు పెట్టకుండా నిల్వచేసికొని అంతర్ముఖంగా మరింత శక్తిసంపన్నం కావడం. ఇది సత్వ లక్షణం.

—(2) లేదా తనలో ఉన్న శక్తిని ఖర్చుపెట్టి దానిని బహిర్ముఖం చేస్తూ ఈ విధంగా బహిర్ముఖం చేయబడేటటువంటి శక్తి క్రమబద్ధమైన నిగ్రహమునకు గాని, నిర్మాణమునకుగాని వినియోగపడితే, అది రజోగుణం. కాని, అలా కాకుండా, బహి ర్ముఖం చేయబడేటటువంటి శక్తి ఆత్మ చైతన్య నిర్మూలనకు వినియోగపడే యెడల, దానిని తమోగుణం అంటారు.

ఈ మూడు విధములైన లక్షణములే త్రిమూ ర్తులుగా చిత్రింపబడినవి. ఈ త్రిమూర్తుల రూపంలో ఉన్న తత్వాలు ఒక్కటే పర తత్వంయొక్క భిన్న లక్షణాలు అయి ఉన్నవి. త్రిమూర్తులకు అతీతమైన ఆ పర తత్వాన్ని "ఓం" అన్నారు. ఇది ఓంకార మంత్రంగా ఏర్పడింది. ప్రతి మంత్రానికి ముందు యీ ప్రణవాక్షరమైన "ఓం" ఉచ్చరించవలెనని ఓంకారమత సూత్రంగా ఏర్పడింది.

★



శ్రీ అంబట ఎంకటనారాయణప్పగారు అనంతపురం జిల్లా, బుక్కపట్టణం మేజర్ పంచాయితీ బోర్డు అధ్యక్షులుగా ఎన్ను కొనబడినారు.

★ జీవితపు ఆఖరిసోపానాలు ★

(11-వ పేజీ తరువాయి)

దాడు. నీటి అలల్లాగ డబ్బు వస్తూ ఉంటుంది. పోతూయుంటుంది. పొయ్యేటప్పుడు వెంటబెట్టుకొని పోతామా. బ్రతికిన నాల్గురోజులు అందరికీ మంచివాడనిపించుకొని పోవలెగాని ఈ డబ్బువలన లాభమేముందండి" అని వేదాంతిమార్గములో పడ్డవాడిలాగ పై పాటనంతా వల్లించివేశాడు పేరయ్య.

ఇతను చేస్తున్న పనులకూ చెప్తున్న మాటలకు మధ్య ఎంత భేదం ఉందో రామారావు తెలుసుకోలేకపోయాడు. ఆ మాటలు వింటున్నంతసేపూ తన శరీరంమీద పాములు, జెర్రులు పారాడుతున్నట్లుగా బాధపడ్డాడు. తాను అనుకొన్న ఉద్దేశ్యము ఆయన నోటిమీదగుండానే చెప్పిస్తామనుకొని

"నన్నేం సహాయం చేయమంటారు?" అని అడిగాడు రామారావు.

"మీ ఇంట్లోని రెండు ఓట్లు నాకే వచ్చేట్లుగా......" అన్నాడు పేరయ్య.

"క్షమించండి" నన్ను ఇంతకుపూర్వమే లింగయ్యగారు అడిగారు. సరేనని వాగ్దానం చేశాను. కనుక......

"ఆ చేస్తే ఏమిలెండి."

"నా మనస్సు ఒప్పుకోదండి" కనుక ఏమి అనుకోవద్దు అని నిక్కచ్చిగా చెప్పేడు.

అందుకు పేరయ్య ప్రళయకాలరుద్రుడిలాగ "నీవు సత్యసంధుడివైతే మేము కాకపోయ్యామా?" అంటూ ఎగిరిపడ్డాడు.

అక్కడ ఇంకొక క్షణమయినా కూర్చోవడానికి మనసొప్పని రామారావు "వెళ్ళి వస్తానండి" అని చెప్పి బయటపడ్డాడు.

ఈ అనవసర ప్రసంగంలో కాలము వ్యర్థ పుచ్చితినని మనస్సులో బాధపడుచూ అందరూ నిద్రపోవుటచే ఎక్కడను పాలు కొరకక భారమయిన మనస్సుతో కాళ్ళీడ్చుకుంటూ ఇల్లుచేరాడు.

ఇంటివద్ద పిల్లాడు పాలకొరకు ఏడ్చి ఏడ్చి నిద్రపోయాడు. శాంత మాత్రం అప్పుడే ఊరినుంచి వచ్చిన కొడుకుతో మాట్లాడుతూంది. రామారావు ఇంటికివచ్చి కుమారుని చూచి "ఏరా! గోపీ. ఇవ్వాళ వచ్చావ్? వంట్లో కులాసాగా లేదా? శెలవులప్పుడే ఇచ్చారా? బడి చాలించుకొని ఎందుకు వచ్చావు?" అని సారు గారి డిస్ట్రిక్టుబోర్డు హైస్కూలులో చదువుచు ఇంటికి వచ్చిన గోపిమీద ప్రశ్నలవర్షం కురిపించాడు.

కాదు, నాన్నా జీతం కట్టడానికి డబ్బు పంపమని ఎన్ని జాబులు వ్రాసినా పంపకపోతేను నా పేరు ఇవ్వాళ బడిలోనుంచి కొట్టివేశారు. కనుక తీసుకొనిపోయి లేటు ఫీజుతో కూడ కడదామని వచ్చాను అన్నాడు.

ఆ మాటలు వినడంతోనే రామారావు మొదలునరకిన తరువువలె మంచంమీద కూలబడ్డాడు.

"ఏమండీ, ఇందాక ఇంకా జీతాలు రాలేదని చెప్పినారుగదా. పిల్లలు కట్టే జీతాలు వసూలు చేసే పన్నులు ఇవన్నీ జిల్లాబోర్డువారు ఏమి చేస్తున్నారండి" అని ప్రపంచ పరిస్థితి తెలియని అమాయకపు శాంత తన భర్తను అడిగింది.


భార్య అమాయకత్వానికి రామారావు నవ్వుకొని "పిచ్చిదానా, వచ్చే ఆదాయాన్ని సక్రమమైన మార్గంలో ఎప్పుడు ఖర్చు పెడతారో అప్పుడుబాగుగా సరిపోతుంది. అలా చేయని నాడే చాలకపోవడం లోటు కనిపించడం జీతాలుఇస్తాం ఇస్తాం అంటూ మనబోటి వాండ్ల జీవితాలను పీల్చడం జరుగుతుంది. మిమ్మల్లను అందరిని సుఖపెడతామని చెప్పి అమాయకపు ప్రజలవద్దనుంచి ఓట్లు తీసుకొని పెద్దలై గద్దె లెక్కి అధికారం స్వీకరించి పేదు గొప్ప పేదు పేద అనే భేదంలేకుండా పేద ప్రజలను పీల్చి పిప్పిచేసి పన్నులు వసూలు చేసి, వారి బిడ్డలకు చదువు చెప్పతామని జీతముల ద్వారా డబ్బు గుంజుతూ అట్లా సకాలములో కట్టలేని మనబోటి దరిద్రుల పిల్లలను బడినుంచి తొలగిస్తూ వసూలు చేసిన డబ్బంతా ఎవరికి దొరికినముటుకు వారు దిగమ్రింగి వారి క్రిందనే గొంతు చించుకొంటూ పనిచేస్తున్న నాబోటి వారికి పనిచేసిన 3 నెలలకు గూడ జీతము లివ్వకుండా డబ్బు లేదని చేతులు తిరగ వేస్తున్నారు. అట్లా దిగమింగుతుంటే డబ్బు ఎక్కడనుంచి వస్తుంది." అని రామారావు తన కంఠ శోషను అంతటిని తన భార్యముందు వెలిబుచ్చి ఆ హృదయ వేదనతోనే నిద్రించాడు.

మరునాడు ప్రొద్దున తన పెండ్లి సమయంలో అత్తగారు ఇచ్చిన 40 రూ॥ల వెలగల వెండిగ్లాసు అవసరానికి రూ 10 లకు తెగనమ్మి కుమారునికి ఇచ్చి ఊరికిపంపాడు. ఇట్లాగే ఇంట్లోని సామాన్లు ఒక్కొక్కటి మార్వాడి ఇంటి ముఖం పడుతున్నాయి.

రామారావు కరువు పక్షిలాగ నోరు తెరచుకొని జీతం కొరకు ప్రతిరోజు పోస్టు ఆఫీసు చుట్టు తిరుగుచు ప్రతిరోజు వస్తులు మాడుతూ కాలం వెళ్ళబుచ్చుతున్నాడు. గంటలు రోజులు, నెలలు గడచిపోతున్నై. కాని పైవారికి దయరాదు, దయావస్తేగాని జీతాలు రావు. జీతాలు వస్తేగాని జీవితాలు గడవవు.

గ్రామంలో ఎన్నికలు పూర్తి అయినై. ఫలితాలు తెలిసినై. కాని పేరయ్యమాత్రం ఓడిపోయాడు. తాను ఓడిపోవడానికి స్కూలుమాష్టరు గూడా కొంతకారణం అనుకొన్న పేరయ్య తన పలుకుబడినంతయూ ధారబోసి రామారావును అక్కడనుంచి సుమారు 100 మైళ్ళ దూరములోనున్న గ్రామానికి మార్పించాడు.

రామారావు స్కూలుకు పోగానే ఆస్కూలు హెడ్మాష్టరు పిడుగులాంటి వార్త తెచ్చిన ఆయన ట్రాన్స్ఫరు కాగితం



★ జీవితపు ఆఖరిసోపానాలు ★

చేతికిచ్చాడు. మరునాడేపోయి జాయిన్ కావలెనని ఉంది. రామారావు గుండె నీరైపోయింది. ఒంటి మీద కారుతూన్న చెమటతో చినిగిన చొక్కా అంతా తడిసిపోయింది. ఇది పేరయ్య చేసిన పని అనుకున్నాడు. న్యాయానికి కాలం గాదని మనస్సుకు నచ్చచెప్పాడు. సాయంత్రానికి ఇంటికి బయలుదేరాడు.

మనస్సులో రైళ్ళు పరుగెత్తుచున్నట్లుగా వుంది. బ్రతుకే భారమై పోయింది గదా అనుకొన్నాడు. 100 మైళ్ళ దూరంలో నున్న గ్రామానికి భార్యాపిల్లలతో చేతిలో చిల్లిగవ్వలేని నేను ఎట్లా పోయేది. ఎట్లా పోగలను. అనుకుంటూ కాళ్ళను రోడ్డు మీద ఈడుస్తున్నాడు. దారిలో పేపర్లో "విశాఖపట్టణంలో ఉపాధ్యాయుని ఆత్మహత్య" అన్నది చదువుకొని తనకంటె అతడు ఎన్నోరెట్లు గొప్పవాడు. ధన్యుడు. అనుకొంటూ ఇల్లు చేరాడు.

ఇంటివద్ద శాంత ఇంట్లో మిగిలి ఉన్న అరసోలెడు బియ్యం అన్నంవండి అదే పాయసంలాగా భావించి తృప్తిపడు మూలానికి పీక్కొనిపోయిన కండ్లతో చిరునవ్వుతో స్వాగతమిచ్చింది. కాని రామారావు దానిని సంతోషంతో స్వీకరించలేకపోయాడు.

శాంతకు భయమేసింది. రామారావు లోనికి పోయి మంచంమీద కూలబడ్డాడు.

"ఏమిటి అలాగున్నారు?" అని భయపడుతూ శాంత అడిగింది.

"ఏముంది. ఏమీ లేదు అతడెంత ధన్యుడు." అన్నాడు రామారావు ఖిన్న హృదయంతో ఆకాశం వేపు చూస్తూ.

"ఎవరండి?"

"నాలాంటి ఒక ఉపాధ్యాయుడు. సంవత్సరాదరోజు తన భార్యాబిడ్డలను సంతోషపెట్టలేకపోతున్నానుకదా! అని సముద్రానికి బలియైనాడు. ఎంత ధన్యుడు. అట్లాగే నేను గూడ......"

"అదేమి మాటలండి? కష్టములు కలకాలం ఉండవుగదా? ఎప్పటికైనా మంచి రోజులు వస్తవిలే!" అని అన్నది శాంత అతని మాటకు అడ్డం వచ్చి.

"మనకా, పిచ్చిదానా! ఇంకేం మంచి రోజులు. పొయ్యే రోజులు రావాల్సిందే. ప్రస్తుతానికి ట్రాన్సుఫరు వచ్చింది" అంటూ జేబులోంచి కాగితం తీసి చూపించాడు రామారావు వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ.

శాంత మౌనం వహించింది.

రేపు ప్రయాణానికి దమ్మిడీ లేదు. ఇంట్లో అమ్మడానికి సామాన్లు లేవు. ఎట్లా పోను. అని రామారావు వారియొక్క అధోగతిజీవితాన్ని మరల ఒకసారి భార్యముందు జ్ఞాపకంచేసి నిద్రపోయాడు.

శాంతకు నిద్రపట్టలేదు. ఆలోచించింది. మెడలో మిగిలిన మంగళసూత్రం చేతికి తగిలింది. స్త్రీకి నిజాయితీ, పాతివ్రత్యం, పతిభక్తి ముఖ్యం అనుకొన్నది. వెంటనే ఇంట్లో డబ్బాలో మిగిలిన పసుపుకొమ్ము మెడలో ధరించింది. తెల్లవారింది.

తెల్లవారగనే భర్తకు ఎదురుగా పోయి "దీనిని అమ్మి ప్రయాణానికి సిద్ధముకాండి లేకపోతే ఉద్యోగం పోతుంది" అంటూ భర్త చేతిలో తన మం-గ-ళ-సూ-త్రం ఉంచింది ఆ ఉద్యోగమునే నమ్ముకొన బట్టే ఇంతదూరం వచ్చిందని తెలుసుకొనలేని అమాయకపు శాంత.

రామారావు భార్య మాటకు "వద్దు" అని చెప్పుదామనుకొన్నాడు. కాని నోరు రాలేదు. చూస్తుండగనే కళ్ళల్లో నీరు తిరిగినై. వాటితోనే దాన్ని కడిగి పవిత్రం చేశాడు. కాని దాన్ని తీసుకొని బజారు వైపు నడవక తప్పింది కాదు. ★

భర్త: రాత్రి నాకు కాలి మీద పాముకాటు వేసినట్లు కలవచ్చిందే!

భార్య:-అయ్యయ్యో!... ఈమూలిక దగ్గిర పెట్టుకు పడుకోండి. ఏపామూ మిమ్మల్ని కరవదు.

★ సంతానం ★

(10-వ పేజీ తరువాయి)

లేరో అని ఏడవటం తప్పితే ఏముంది చెప్పండి. అంతో మన ఖర్మ తప్ప ఇంకేమీ లేదు. పాపం శాంతమ్మగారికి ఎంతమంది వున్నా ఏం చేశారో చూడండి ఆమెను. ఏదో వుద్ధరిస్తారనుకుంటాం గాని తీరా వాండ్లవల్ల కలిగే సుఖానికన్నా దుఃఖమే ఎక్కువ కనబడ్డది. ఎన్నడో జరగబొయ్యే దానికని ఇప్పట్నుంచీ ఏడవటం ఎంత తప్పో యిప్పటికన్నా తెలిసివచ్చిందాండీ. ఇన్నాళ్ళూ పిల్లలు లేరే అని అఘోరించడం ఎంతో తప్పయింది అసలు మన బంధువులంతా మనకు పిల్లలు లేరనిగాదండీ విచారించడం. వీళ్ళకు పిల్లలు లేరే వీండ్లు హాయిగా వుంటున్నారే, వీండ్లకు కష్టాలు లేవే అని లోలోపల అసూయపడుతూ పైకిమాత్రం మన కేదో కొరతవున్నట్లు చూపించి మనలను ఏడిపించటం తప్ప. అంతే నంటారా' అన్నది కమల.

'అంతే కమలా, నిజంగా అంతే. యీ అఘోరించేవాండ్లే రేపాక వేళ మనకే గనక పిల్లలు వుడితే యింకా అఘోరిస్తారనుకో' అన్నాడు రామం.

'నిజంగానే?' అన్నది కమల.

'చూస్తావుగా' అన్నాడు రామం. ★

★ ఆంధ్రమాతావ్రతం ★

(17-వ పేజీ తరువాయి)

"అఁ...లేనివాళ్ళు లేక ఏడుస్తుంటే - వున్నవాళ్ళ కిదో మాయరోగం" అన్నది గౌరమ్మగారు.

"ఇటువంటోళ్లు ఇంకా పదిమంది వూళ్లో వొస్తే - ఆ వెధవ బస్తీ అలవాట్లన్నీ, మనోళ్ళకూడా వొచ్చినట్లే!" అన్నదొక గ్రామాభ్యుదయ పేరంటాలు-

"పదిమందిగావాలా! నలుగురుచాలు; కుండెడు తేనెను పాడుచేయడాన్కి ఎన్ని నీళ్ళు కావాలి? - అన్నది రంగమ్మ-

"అయినా! వెళ్లొద్దాం పదండి?"-అని బిల్లును పాస్సుచేసింది గౌరమ్మగారు-

"నీకు పొద్దు పోవటల్లే! గౌరమ్మా! ఎందుకు ఆదరిద్రపు గొట్టింటికి?-" అన్నది శేషమ్మ-

"ఏమో! చెప్పింది - అదేందో కొంచం తెల్సుకొంటేపాయె-"

"ఏంటి తెలుసుకొనేది?- నా శ్రాద్ధం?-"

"అదెటువంటి దైతే మనకెందుకు? ఆ వ్రతమేంటో! ఆబడాయేంటో! మనం కూడా కొంచం చూస్తేసరి - బాగలేక పోతే ముఖాన్నె తియ్యనివిసాలుగు చీవాట్లు పెడదాం!"

"సరే; పోదాం పదండి!..." బొమ్మలన్నీ ఎవరిగూటికి అవి చేరాయి-

*   *   *

ఏడువారాల సొమ్ముల్తో, రూపాయిలంత కుంకుమబొట్టులతో- పక్కా రంగుచీరలు ధరించి, ఆంధ్రత్వం మూర్తీభవించిన, దేవతలవలె బయలుదేరారు కథానాయికలు- దారిలోనే ఒకరిచెవిలో మరొకరి గుసగుసలు - మూకాభినయం - కాళ్ళమెట్టియల ఘల్ ఘల్ ధ్వనితో, జానకి ఇల్లు చేరారు - ఇల్లు చిన్నదైనా ఆరోగ్యకరంగా వుంది. ఒక గోడప్రక్క నాలుకాళ్ళ పీటపై ఆంధ్రమాత పటం పెట్టివుంది. దానికి చుట్టు బంతిపూల దండలుచుట్టారు. జానకి అందరి కాళ్ళకు పసుపుబూసి, గంధం రాసింది. ఒక్కొక్కరికి వరుసగా బొట్లుపెట్టింది. కొందరు స్థూలకాయ పేరంటాళ్లు ఆపసోపాలు పడుతున్నారు. కొందరు చూపుల సంభాషణలు సాగిస్తున్నారు. "పౌరోహితుడే డమ్మా" గౌరమ్మగారి ప్రశ్న-

"ఈ వ్రతానికి పౌరోహితు డవసరం లేదండీ!"

"అయ్యో - నా బతుకా! పౌరోహితుడులేని వ్రతమేంటమ్మా?"

"కథచదివి - మంగళహారతి ఇవ్వటమే - ఈ వ్రతసిద్ధాంతం!"

"అయితే కానివ్వమ్మ - త్వరగా వెళ్లాలి!"

"అఁ...ఇదిగో మొదలుపెడుతున్నానుగా!" ఒక బైండు పుస్తకం తెచ్చి, దానికింత గంధం, కుంకుమతో పూజచేసింది— తరువాత పుస్తకం తెరచి, గొంతు సవరించుకొని, చిలుకద్వాదశి పాట బాణీని మొదలెట్టింది—

* శ్రీకరమ్ముగ తెల్గు-చెలియ వినవమ్మా!
ప్రాకటమ్ముగ వీర-భామినుల గాథ
ముక్కోటి బిడ్డలకు-మోదమైనట్టి
ఘురిపంపు తల్లి ఈ-మన ఆంధ్రమాత
గోదావరీ కృష్ణలే-దేవి కెపుడు
మోదమ్ముతో కంఠ-హారమ్ము లగును
మొల్లమ్మ, మల్లమ్మ-ముగుద నాగమ్మ!
మాంచాలి, రుద్రమ్మ-మరి బాలనాగు.

...   .

...   .

పాడుతోంటే, వింటూ పురమాత లూగుతున్నారు. రుద్రమ్మ కార్యాలు ఏకరువు వినిపిస్తోంటే, పండు ముత్తైదువుల కూడా పరవశం ఎక్కిపోతోంది - నాగమ్మ చాకచక్యం వింటున్నకొలది, ముక్కులపై వేళ్లు వాటంతటవే నాట్యం చేస్తున్నాయి. మల్లమ్మ కవితా నైపుణ్యానికి ఆనందాశ్రువులు వాటంతటవే రాలిపోతున్నాయి. మల్లమ్మ పతిభక్తి వింటుంటే—సతీ, సావిత్రులు, జ్ఞప్తికొస్తున్నారు...... మొత్తం పాటొకగంట పట్టింది - చివరస్థాయి కొస్తుంది -

మంగళం జయ ఆంధ్ర-మాత జయమమ్మా!
మన్నించి మమ్ములను-మరి లేలవమ్మ!!

ఈ గంట కూడా ఆ ముత్తైదువలు, ఆంధ్రదేశమంతా తిరిగి తిరిగి, పతివ్రత లందరిని చూశారు - ఎలాగైతేనేం - పాటయ్యే సరికి మళ్లీ అందరు భావసామ్రాజ్యంనుండి బయటికొచ్చారు—

"ఎంత మంచికథమ్మ జానకీ! ఇవన్నీ నిజంగా జరిగాయంటావా?" గౌరమ్మగారి విమర్శన—!

"అయ్యో! ఎంత మాటండీ! ఇవి జరిగి ఇంకా రెండుమూడొందలేండ్లైనా కాలేదు!

"అలాగా! ఏమో! మేము చదివామా! చూశామా! వంటింటి రాచ్చిప్పల్లో ఎప్పుడూ వంటేంటో సంసారాలేంటో!

"అదేమిటి బామ్మగారూ! మన ఆంధ్రదేశంలో, ఎందరు వీరవనితలు పుట్టారు! ఎన్నెన్ని త్యాగాలు చేశారు! ఒక్కొక్క వీరవనితను గూర్చి చెప్పాలంటే - ఒక్కొక్క రాత్రి గడిచిపోతుంది - మన ఆంధ్రమాత చల్లని తల్లి - పూర్వంనుంచి, గొప్పగొప్ప కవులు, కవయిత్రులు, శిల్పకారులు, తత్వశాస్త్రజ్ఞులు, గానవిశారదులు, మొదలగు మహనీయుల నెందరినో కని, పోషించిన గొప్ప పేరంటాలు - మనందరం ఈనాటి వరకు ఆమె చల్లని చూపుల చలువపందిరి క్రిందే జీవిస్తున్నాం - అట్టి తల్లి పూజ చేస్తేనే - మనం పతితుల మయ్యేది... వుపన్యాసధోరణిలో మాట్లాడింది - అందరూ పరమానందంగా విన్నారు.

"ఏదీ! పేరంటాళ్లెవరైనా మంగళ హారతి యివ్వండి - ఫలహారాలు పుచ్చుకొందాం" అన్నది జానకి.

అందరు ఒకరి మొహాలు ఒకరు చూసుకొని, నిర్విణ్ణులయ్యారు.

"ఆ కాస్తా నీనోటనే కానీయమ్మ" గౌరమ్మగారి ఆజ్ఞ.

తాంబూలంతో హారతి కర్పూరం వెలిగించింది - ఆమెకు తోడు మరో నల్గురు ఆ పళ్లేన్ని పట్టుకొన్నారు - జానకి తన శ్రావ్యకంఠంతో - "మాకొద్దీ జమీందార్ల పొందు" అన్న బాణీలో మొదలెట్టింది.

* మంగాళ హారతి యిదిగో! ఓ...
ఆంధ్రాభాషా తల్లి, అఖిలాంధ్ర
భారతి ||మం||

(1) ముత్యాలపల్లకిలో ముద్దూగకూర్చుండి
మురిపముగ రాయాలతోను,
విజయనగరవీథు లందునాను
వేగనూరేగి దేశాలలోను
తెలుగూ వారికినీవు-వెలుగూ దెచ్చావమ్మ ||మం||

(2) కవితిక్కనాయింట కన్నెపడుచు
వయ్యి -
కవిబ్రహ్మ యనిపించినావు
భక్తపోతన్నగారింటిలోను
పరుపులెత్తి భాగవతమ్ములోను
భక్తిముక్తిగాంచి-ప్రణుతికెక్కావమ్మ ||మం||

(3) హంపి,విజయానగర, అమరావతిలోన - అందాలు చిందింపజేసి,
వజ్రవైడూర్యముల తులదూగి
ఆంధ్రవాఙ్మయము పెంపొందజేసి,
దేశభాషల్లలో-తేజారిల్లావమ్మ...
మం...

(4) కృష్ణాగోదావారి, కుంకుమబొట్లూను
కుదురుగా కొనటూను పెట్టి.
కస్తూరిమారి గంధంబుబూయ
ఆంధ్రమహిళాలు హారాతులివ్వ.
పేరంటముకూ నీవు -
మాయింట్లకూ రమ్మ...మం...

"ఆ...హా! మంగళారతి ఎంత మధురంగా వుందమ్మా! గౌరమ్మగారి ప్రశంస—

"మరి చదువుకొన్నమ్మాయిలంటే ఏమనుకొన్నా, గౌరమ్మత్తా!" శేషమ్మగారి పొగడ్త—

"మనం కూడా ప్రతిరోజూ అన్ని విషయాలు జానకివద్ద తెలుసుకోవచ్చు"—మంగమ్మగారి బిల్లు ప్రవేశం—

"ఇటువంటివాళ్లు గ్రామానికిద్దరుంటే చాలు! గ్రామాలే బాగుపడతాయ్!" వడిగారు ముత్తైదువ అభిప్రాయం—

"చిన్నవయస్సైనా బుద్ధిమంతురాలు!" ఒండుము త్తైదువ ఆశీస్సు—

కొబ్బరిముక్కల ఫలహారం తలాకొంచెం పంచుకొన్నారు. అందరూ ఆంధ్రమాత పటానికి నమస్కారాలు చేసి, అక్షతలు వేసి, కొబ్బరిముక్కల మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నారు. కొందరు తిరుగుముఖంపట్టారు... "వస్తామమ్మా!" దయయుంచుము!" ఒక్కొక్కరే వీడ్కోలు తీసికొంటున్నారు.

"నాదేముంది — ఆ జగజ్జననీ దయ..." అని సమాధానమిస్తోంది జానకి—కోడలు పొందుతున్న పొగడ్తలు వింటూ భ్రమరాంబగారు ఆనంద వార్ధిలో ఓలలాడుతున్నారు—ప్రసార సమాప్తి — ఎవరిదారిలో వారు గృహప్రవేశం అయ్యారు తర్వాత. కరుణాకరరావు లోపలగదిలోనుండి బయటికొచ్చి ఒక్క నవ్వు జానకిపై విసరి — తన పడకకుర్చీపై బైఠాయించాడు. వచ్చే నవ్వును ఆపుకొంటూ — పైటచెరగు నోటికి అడ్డంగా పెట్టేసి దగ్గరకొచ్చింది జానకి.

"ఎలావుంది మనమంత్రం?"

"మనదేముంది. అంతా ఆంధ్రమాత కరుణాకటాక్షం!—

"అమ్మ! దొంగా!" అని బుగ్గపై చిటికేశాడు.

"వుండండీ! అంతా మోటుసరసం!—మరీను—"

"ఇంకేం ఇక రోజూ సందడే — సందడి—ఇక నేను జ్ఞాపకముంటానబ్బా!"

"మీరు మరీ—ను, అన్నీ వేళాకోళాలు—"

"వేళాకోళాలే గాని, చూశావా! స్త్రీ ప్రకృతెంత చిత్రమైందో!"

జానకి చిరునవ్వుతో వంటగదిలోకి వెళ్ళింది — తన పాకశాస్త్రం తిరగెయ్యడానికి—

కరుణాకరరావు 'రాదే చెలీ- నమ్మరాదే చెలీ-' అని ఈలపాట మొదలెట్టాడు.

★

★

(5-వ పేజీ తరువాయి)

రించేనాడు. ఒకనాడు చక్కని చిన్న గుల్ల కత్తిని సాపులో చీకటిపడినతర్వాత ఎవరూ చూడకుండా కొని తెచ్చుకొన్నాడు. దానిని ప్రయోగించి ఉపయోగించడం ఎట్లాగో తెలిసికొనుటకై ఏ మంగలినైనా అడిగితే అతని కులవృత్తి ఇతనికి కపటం విడిచి మనసు విప్పి నేర్పడని నిశ్చయించాడు. ఏదైనా గ్రంథంలో యీ సునిశితమైన విద్యను చదివి నేర్చుకోవాలంటే అట్టి గ్రంథం ఏదిన్నీ అతనికి లభించలేదు. అందువల్ల అన్యథా శరణం నాస్తియని, తనకుతానే స్వయంబోధకుడై అద్దం ముందర బెట్టుకొని గది తలుపులు బిగించి గడ్డానికి సబ్బురుద్ది ఆత్మక్షౌరం ఆరంభించాడు. ఒక అరగంట సేపు తంటాలుపడ్డాడు. కత్తి పట్టుకొనే వాటం తెలియక, గడ్డంనిండా గాట్లుపడి అతి ఘోరంగా క్షతగాత్రుడైనాడు. ఇంతకూ గడ్డం ఒక చెంపమాత్రమే అకటా వికటంగా కూరపనసకాయ చెక్కినట్లుగా కన్యాపచ్చా క్షురం చేసికొనడం అయింది. మహాభారతం రచింపబూనిన నన్నయభట్టు, అరణ్యపర్వంలోకి వచ్చిన తర్వాత మతి చెడి అరణ్యమధ్యంలోనే ఆగిపోయినట్లుగా "ఒక చెంప గనుపింప" అతని క్షువరం అర్థాంతరన్యాసాలంకారంగా, అంతటితో ముగిసింది.

ఇది మనవల్ల కాదు అని నిశ్చయించుకొని, ఒక తువ్వాలుగుడ్డ తలమీదనుండి మెడక్రిందుగా గడ్డంచుట్టూ గట్టిగాచుట్టి వీధిలోకి బయలుదేరి రావిచెట్టుక్రింద కూర్చుండిన మంగలి సమావేశంలో ఉన్న (పండిత మండలిలోఉన్న) ఒక మంగలిని, పిలుచుకొని యింటికి వెంటబెట్టుకొని వెళ్ళాడు. సుబ్బారావు అతనిముందర తన తల ముసుగు తువ్వాల తీసి మంగలి గిన్నెలో ఉదకం పూరించి, యీ విధంగా అన్నాడు. "ఎవడో చేతకాని మంగలి కుర్రవాడు వచ్చి నానా అవకతవకగా క్షువరం చేసి, గాట్లు పెట్టి గీట్లు పెట్టి చిత్రవధ చేశాడు నన్ను. అంతటితో నా ప్రాణం విసిగి వాడిని పంపివేసి నిన్ను పిలుచుకొనివచ్చాను. నీవైనా కొంచెం జాగ్రత్తగా యీఅపసవ్యఅపరకర్మనుఅపర సవ్యముగా కడతేర్చు" అన్నాడు. ఆ మాటలకు మంగలి వెంకటస్వామి ఆగ్రహావేశుడై అగ్గి నిప్పు అయినాడు. "ఎవడండీ ఆ మంగలి వెధవ? మీలాంటి పెద్ద మనుష్యులకు క్షువరం చేయడానికి చేతకాని వెధవకు చేతు లెట్లా వచ్చాయండి? వాడు మనిషి అంటారా? దున్నపోతు అంటారా? అన్నం తింటున్నాడా? గడ్డి తింటున్నాడా? వాడు అమ్మకు అబ్బకూ పుట్టిన వాడేనా? తెలియని గాడిద కొడుకులు తెలియనట్టుండాలి. మంచికత్తి ఒకటి కొనుక్కోగానే మంగలి అవుతాడండీ! కత్తి పట్టుకోలేని వెధవ లందరూ దేశంలో వెలిసినందువల్లనే మనదేశం మనకు క్షువరమైంది. అటువంటి ఛడివాలను మీరు చెప్పు దీసికొని పళ్లు రాలగొట్టవలసింది" అని బహుప్రకారంబుల కుపండిత దూషణంబొనర్చి, ఇష్టదేవతా ప్రార్థనం బాచరించి, నాయొనర్పంబూనిన సవ్యాయుష్కర్మకాండా ప్రకారం బెట్టిదనిన,—అని చిరంజీవి సుబ్బారావుకు మంగలి వెంకటస్వామి భద్రముగా నిరుపద్రవంగా అసంపూర్ణ క్షౌరమును సంపూర్ణ మొనర్చి స్వామిని సంతోషింపజేసి తన సత్కార ద్రవ్యమును తాను స్వీకరించి వెడలిపోయెను.

తెలిసియు తెలియని క్షురకర్మ అధ్వాన్నముగా అపభ్రంశముగా చేసినది సుబ్బారావే అని తెలియక పండిత వెంకటస్వామి అనేక దుర్భాషలాడియుండెను. అవియన్నియు సుబ్బారావును తిట్టిన తిట్లేయని సుబ్బారావు అన్వయించుకొన వలసియుంటుంది. ఏమైనప్పటికీ, దూషణభూషణ తిరస్కారంబులు శరీరమునకు గాని ఆత్మకు గావని తెలిసినవాడై ఆ పండితునిముందు తెలిసియు తెలియని నరుడైన సుబ్బారావు తలముసుగు చుట్టుకొని తిరిగాడు. అతడెన్ని విధముల దూషించినప్పటికి, "మౌనమే విభూషణము మూఢమానవులకు" అనే సూత్రము ననుసరించాడు. అటువంటి సమయంలో మౌనము వహించడమే బుద్ధిమంతుని లక్షణం — అవి వయం గ్రహించి ఆ విధంగా ప్రవర్తించినందుకు అతడు యుక్తాయుక్తప్రవర్తన తెలిసిన పండితుడని చెప్పవచ్చు.

"విభూషణం మౌన
మపండితానామ్"

"అపండితులైనవారికే మౌనము విభూషణం," అన్నాడు—కాని పండితుని యెదుట ఆరీతిగా మౌనము వహించి

"మూఢతాచ్ఛాదనంబు"


(తనమూఢత్వమునకు ముసుగు) కప్పుకొని ప్రవర్తించడంకూడా వివేకలక్షణమే గనుక, పండితునియెదుట మౌనం వహింపగలిగిన అపండితుడుకూడా కొంతవరకు పండితుడే. ★


Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madras

★

మైసూరు రాష్ట్రంలోని
జోగ్ జలపాతం
ఫోటో—శ్రీమతి కె. కృష్ణవేణి,
(మైసూరు)

★





★

గోధూళి వేళ
ఫోటో—శ్రీ జి. ఎన్. భూషణ్.
(మద్రాసు.)



చ ప్రియా రిలీజ్